
ఆంధ్రగీతి

తెలుగు భాషాజాగృతి



డా॥ జి.వి. పూర్ణచందు

ఆంధ్రగీతి

తెలుగు భాషాజాగృతి

డా॥ జి.వి. పూర్ణచందు

కృష్ణాజిల్లా రచయితల సంఘం
ప్రచురణ

'ఆంధ్రగీతి" –తెలుగు భాషాజాగృతి
Andhrageeti A Poetic Manifesto of TeluguLanguage Renaissance
డా॥ జి.వి. పూర్ణచందు రచన

By Dr. G V Purnachand, B.A.M.S.,
Cell: 9440172642

మొదటి ముద్రణ: 2025
Published by:

Krishna District Writers Association
1st Floor, Satnam Towers,
Opp. Buckinghampet Post Office,
Governorpet, Vijayawada - 520 002
Cell: 94401 72642, 9440 167697

Title art: Sri Regulla Mallikarjuna Rao

For Copies:
Krishna District Writers Association
1st Floor, Satnam Towers,
Opp. Buckingham Pet Post Office,
Governor Pet, Vijayawada-520 002
Cell: 94401 72642, 94401 67697

Price: 200/-

Title & Book Designed by
Sri Kalasagar Yellapu

Printed at:
Sree kalyani Printing Works,
Cell: 98482 43477

"ఆంధ్రగీతి"–తెలుగు భాషాగర్వగానం

గుత్తికొండ సుబ్బారావు, అధ్యక్షుడు
దామెర్ల నరసింహారావు, కోశపతి
కృష్ణాజిల్లా రచయితల సంఘం

తెలుగు భాషాగర్వానికి కావ్యరూపంగా వెలువడిన వచన గానకావ్యం "ఆంధ్రగీతి"! భాషకోసం పరితపించే 'నుడినేస్తం' డా॥ జి. వి. పూర్ణచందు ప్రజానుడుల పల్లవిగానంలా పాడుకునే వచనాల్ని, భాషాభిమానం పాదుకునే భావాల్ని, తెలుగుతల్లికి కంఠాభరణంగా అలంకరించాడు.

తెలుగు భాషమూలాలు, ప్రాచీనత, మాండలిక గౌరవం, శాస్త్రసాంకేతిక రంగాల్లో తెలుగు ప్రాముఖ్యత వంటి అనేక కోణాలను కవిత్వీకరించిన అపూర్వ గ్రంథం ఇది! భాషను ఇంత విస్తృత దృక్కోణంలో విశ్లేషించిన కవిత్వం బహుశా ఇదే మొదటిది.

రచయితగా, పరిశోధకుడిగా, నిర్వాహకుడిగా పూర్ణచందు తెలుగు భాషకు చేసిన సేవ అపారమైంది. "తెలుగే ప్రాచీనం", "నైలు నుండి కృష్ణదాకా", "తెలుగులో అతిథి పదాలు", "సొంపైన తెలుగు" వంటి గ్రంథాలు పూర్ణచందు తెలుగుప్రీతికి నిలువెత్తు సాక్ష్యాలు. ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో ఆరేళ్లుగా సాగుతున్న "తినరా మైమరచి" శీర్షిక పూర్ణచందును తొలి తెలుగు ఆహార చరిత్రకారుడిగా నిలబెట్టింది.

తెలుగుభాషాయోధుడు మండలి వెంకటకృష్ణారావు శతజయంతి పండుగని చిరస్మరణీయంచేసే సంకల్పంతో కృష్ణాజిల్లా రచయితల సంఘం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

మండలి వెంకట కృష్ణారావుగారి మానసపుత్రిక కృష్ణాజిల్లా రచయితల సంఘం. వారి సంకల్పఫలంగా మండలివారే గౌరవాధ్యక్షులుగా, శ్రీ ముక్కామల నాగభూషణం అధ్యక్షులుగా, గుత్తికొండ సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, శ్రీ మండలి బుద్ధప్రసాద్, డా॥ జి.వి. పూర్ణచందు కార్యదర్శులుగా, పైడిపాటి సుబ్బరామశాస్త్రి, డా॥ తెన్నేటి హేమలత, డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు ప్రభృతుల నేతృత్వంలో ప్రారంభమైంది ఈ కృష్ణాజిల్లా రచయితల సంఘం. ఆరు పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించి, భాషోద్యమదీప్తిని జ్వలింప చేసింది. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఇందుకు మాకు అండగా నిలిచారు!

పాతికకు పైగా బృహత్ పరిశోధన గ్రంథాలు ప్రచురించింది. "తెలుగే ప్రాచీనం", "సింధు–కృష్ణ లోయల నాగరికతలు" వంటి జాతీయ సదస్సులు తెలుగుభాష చరిత్రమూలాలను అనేకం వెలికితీశాయి. ఈ కార్యాలన్నింటికీ కర్త, కర్మ, క్రియగా శ్రీ బుద్ధప్రసాద్ ఈ సంస్థను నడిపిస్తున్నారు.

మండలి వెంకట కృష్ణారావుగారి పట్ల అపారమైన గౌరవం, శ్రీ బుద్ధప్రసాద్ పట్ల అమితమైన వాత్సల్యం కృష్ణాజిల్లా రచయితల సంఘ కార్యనిర్వహణకు ముఖ్య కారకాలు. ఆ ఇద్దరూ కలిగించిన స్ఫూర్తి తెలుగు భాషోద్యమానికి మమ్మల్ని సంఘటితం చేసింది. వారిపట్ల మాకు గల గౌరవాభిమానాల గుర్తుగా ఈ "ఆంధ్రగీతి" అజరామర కావ్యాన్ని కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన మండలి వారికి అంకిత నివాళిగా సమర్పిస్తున్నాం.

కృతి స్వీకృతి చేయటానికి మండలివారు మనమధ్య లేనప్పటికి, భాషాభిమానానికి, ఆశయానికి, ఆచరణకు, ఆకృతికీ కూడా వారి అచ్చమైన వారసుడు శ్రీ బుద్ధప్రసాద్ చేతుల మీదుగా "ఆంధ్రగీతి"ని మండలివారికి సమర్పిస్తున్నాం!

అంకిత నివాళి



శ్రీ మండలి వెంకట కృష్ణారావు

కృష్ణాజిల్లా రచయితల సంఘానికి బీజావాపన చేసిన తొలి గౌరవాధ్యక్షులు
మండలి వెంకటకృష్ణారావుగారి శతజయంత్యుత్సవ సందర్భంలో...
తెలుగు భాషోద్యమ సమరాంగణ సార్వభౌముడు
డా॥ మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా
తెలుగుతల్లి మెడలో తెలుగుభాష, సంస్కృతి, చరిత్ర పరిమళాలు నిండిన
మల్లెపూదండగా ఈ 'ఆంధ్రగీతి'ని సమర్పిస్తున్నాం...

గుత్తికొండ సుబ్బారావు,
అధ్యక్షులు

డా॥ **జి.వి. పూర్ణచందు**
ప్రధానకార్యదర్శి

దామెర్ల నరసింహారావు
కోశపతి

కృష్ణాజిల్లా రచయితల సంఘం

స్మృతిగీతి!

ముతక ఖద్దరు అరచొక్కా, గోరంచు సాదా నూలుపంచె,
కారుణ్యం చిందే కన్నులు, ఆత్మీయత విరిసే చిరునవ్వులు,
అంతరంగం పలికించే మెత్తనైన మాటతీరు...
నిండైన విగ్రహం-మండలి...చెప్పగానే గుర్తొచ్చే పేరు!

పెను ఉప్పెనల మధ్య నిలిచిన దీపస్తంభ దీప్తి...
కల్లోల దివిసీమ పునర్నిర్మాణ దీక్షితుడు, సేవామూర్తి...
గాంధీక్షేత్రగర్భంలో 'గాంధీ నిర్మాణకార్యక్రమ' సారధి...
ఆర్టీసీ బస్సులోనే తిరిగిన మంత్రి, తెలుగు సారస్వత వారధి!

అవినీతి ఆవహించిన చదువుల తీరును మార్చి,
పరీక్షల చీకటిని మాపిన విద్యారంగ ప్రక్షాళకుడు!
చదువుకి చైతన్యమిచ్చిన చిత్తశుద్ధి జ్యోతి...
'మండలి' నామమే నీతి, ప్రతిధ్వని ఖ్యాతి!

ఉగాదిని తెలుగు ఉత్సవంగా నిలిపి,
'మా తెలుగుతల్లి'ని తెలుగు జాతిగీతంగా మలచి
తెలుగును 'ప్రపంచతెలుగు'గా తీర్చిన 'భాషామరీచి'
భాషకి తేజం నింపిన తెలుగు తోటమాలి!

తెలుగువారి తెలుగు సంస్థల రూపకర్త....
దేశాంతర ఆంధ్రుల కోసం శ్రమించిన కార్యకర్త...
జ్ఞానవీధుల్లో తెలుగుదీపం వెలిగించిన తపస్వి!
పాఠాలలో మానవతను చేర్చిన విద్యామంత్రి యశశ్వి!

గాంధీక్షేత్రం గూటిలో గూడుకట్టుకున్న ఒక వివేచన,
మండలివారి మనసులో మూర్తీభవించిన దీక్షారాగం,
కృష్ణాజిల్లా రచయితల సంఘం వెలిసింది...
కృష్ణ ఒడ్డున ఒద్దికగా, ఆ సంకల్పజీవి ఆత్మగా!

ఆ రోజున అత్తుకున్న విత్తనం మహావృక్షమై నిలిచింది...
మండలి సంకల్పమే మూలం– ఆత్మగా, ఆకాంక్షగా,
అక్షరాల రక్షణోద్యమానికి అక్షయమైన వేదికగా...
ప్రపంచ తెలుగు రచయితల మహాసభల కార్యదీక్షగా!

మండలి కృష్ణారావు నూరేళ్ల పండుగ,
తెలుగు భాషోద్యమానికి వెలుగు నిండుగా!
తెలుగు నామస్మరణకిది అమరిన కాంతి,
భాషాభిమానానికిది సంపూర్ణ 'ఆంధ్రగీతి'!

–డా॥ జి.వి. పూర్ణచందు

'ఆంధ్రగీతి' చరణాల వరుస...

'ఆంధ్రగీతి' రచనకు ప్రేరణ నిచ్చిన శ్రీ **మండలి బుద్ధప్రసాద్ గారికి,**
ప్రచురించిన కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ **గుత్తికొండ సుబ్బారావు,**
కోశపతి శ్రీ **దామెర్ల నరసింహారావు** గార్లకు,
ఆశీస్సులందించిన గురువు **విహారి** గారికి,
ఆప్తవచనాలిచ్చిన ఆచార్య **రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**గారికి,
పండితమిత్రులు డా॥ **గుమ్మా సాంబశివరావు,**
ఆచార్య **మాడభూషి సంపత్కుమార్** గార్లకు,
ముఖచిత్రం స్ఫూర్తిదాయకంగా అందించిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ
సంచాలకులు, చిత్రకారులు శ్రీ **రేగుళ్ళ మల్లికార్జునరావు**గారికి
ముద్రణకు చక్కని ఆకృతి ఇచ్చిన 64 కళలు.కామ్ సంపాదకులు
శ్రీ **కళాసాగర్** గారికి
నా నమస్కృతులు, కృతజ్ఞలు–

శీలా వీర్రాజు గారంటే నాకు అమితమైన భక్తీ, ప్రేమ! వారి చేతివ్రాత ఈ పుస్తకం అచ్చులోకి తెచ్చే సమయానికి యూనీకోడ్ ఫాంటుగా అందుబాటులోకి వచ్చింది. "ఆంధ్రగీతి" కావ్యాన్ని శీలా వీర్రాజు ఫాంటులో ముద్రించటం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

డా॥ జి.వి. పూర్ణచందు



భాషకు భక్తిగీతం-జాతికిజాగృతగీతం

-డా॥ మండలి బుద్ధప్రసాద్
గౌరవాధ్యక్షులు, కృష్ణాజిల్లా రచయితల సంఘం

'భాషా గౌరవం-మన అస్తిత్వం' అనే నినాదంతోనే తెలుగు ఆత్మమేల్కొంది. ఈ నినాదమే నన్నయకాలంలో ఆదిపద్యమై విరాజిల్లింది. పాల్కురికిలో జానుతెనుగై పులకించింది. తిక్కన, ఆడిదము సూరన్న, తెలుగన్నల యుగంలో అది అచ్చతెలుగై ప్రవహించింది. వాగ్గేయకారయుగంలో అది-రాగమై తానమై పల్లవై తెలుగుని సంగీతమయం చేసింది! ప్రతి స్వరమూ భాషకు మన్ననగా మారింది. ప్రతి పదమూ భాషకు పునర్జన్మ నిచ్చింది!

కాలం మారింది...! కానీ, ఆ జ్యోతి ఆరలేదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలుగుకు శక్తినింపిన కొమర్రాజు, కావ్యభాష స్థానే వాడుకభాషను చేర్చి, గొడుగుపట్టిన గిడుగు, సంస్కర్తలు వీరేశలింగం, గురజాడ లాంటి వైతాళికులెందరో నవ్యాంధ్రభాషకు ఆయువు పోశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు మన భాషలో మనల్ని మనం పాలించుకోవటానికి, మనభాషలో మనం చదువుకోవటానికి మనదైన రాష్ట్రం కావాలని కోరి, భాష కోసం అమరుడయ్యాడు. అంతటి ఉద్యమ చైతన్యం ఇప్పుడు ఏమైపోయింది...?

భాషాస్వావలంబన గురించి, ఆర్థికస్వేచ్ఛ, సాంస్కృతికగౌరవాల గురించి గొంతు సవరించుకోవలసిన సమయమాసన్నమైందని గుర్తుచేస్తోందీ "ఆంధ్రగీతి"!

రాజ్యాంగం ఇచ్చిన భాషా హక్కులు కాగితాలపైనే స్తబ్దంగా ఉన్నాయి. మాతృభాషకు లభించవలసిన స్థానం ఎవరికీ పట్టలేదు. పిల్లవాడికి తల్లిభాషలోనే మనోవికాసం ఏర్పడుతుందని మానసిక శాస్త్రం చెప్తోంది.

ప్రజల్లో మార్పు రానిదే ఏ ఉద్యమమూ ప్రాణం పొందదు. ప్రజాచైతన్యం తేవల్సిన కార్యక్రమం ఎక్కడో ఆగిపోయింది! భాషాస్ఫూర్తి క్షీణించిన ఈ దశలో తెలుగువారి మనసుల్లో మళ్లీ ఉద్యమజ్వాల రగిలించాలనే కోర్కెతో డా॥ జి.వి. పూర్ణచందు రాసిన ""ఆంధ్రగీతి"" సమయానికి సరిగ్గా పుట్టిన కవితాకల్హారం!

ఇది కేవలం ఒక దీర్ఘకవిత కాదు, భాషకు మళ్లీ ఊపిరి పోసే భేషజం! ఆయుర్వేద పరిభాషలో చెప్పాలంటే ఇది శక్తినిచ్చే 'పూర్ణచంద్రోదయం'!

పూర్ణచందు గురించి వ్రాయటం అంటే నా గురించిన ఒక ప్రతిబింబం చూపుకోవటమే!

కానీ, అతని కృషిని కొంతైనా ప్రస్తావించక తప్పదు. 2008లో 'తెలుగే ప్రాచీనం' (అధికార భాషాసంఘు ప్రచురణ), 'నైలు నుండి కృష్ణదాకా' (ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రచురణ) గ్రంథాల ద్వారా తెలుగు భాషకు ఆదిగౌరవాన్ని, ప్రాచీనతాహోదాను అందించే కర్తవ్యంలో పాలుపంచుకున్నాడు.

మరుగున పడిన పదాలను తనదైన భాషాబాణీలో విశ్లేషణ చేస్తూ, ఆధునిక జీవనంలో వాటి వినియోగాన్ని చూపిస్తూ, అనేక వార, మాస, దినపత్రికల్లో తన పరిశోధనాకాంతుల్ని నిరంతరం పంచుతూనే ఉన్నాడు. ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో గత ఐదారేళ్లుగా వెలువడుతున్న అతని వ్యాసాలు కేవలం ఆహారచరిత్రనేకాదు, తెలుగు భాషాసంస్కృతుల దీర్ఘయాత్రని కూడా చాటుతున్నాయి. విశ్వవిద్యాలయాల పరిశోధనాపరిధికి మించిన అంశాల్ని వెలికితీస్తున్నాడు.

పూర్ణచందు పరిశోధకుడే కాదు, మంచి కవినని కూడా చాటుకున్నాడు. 40యేళ్ల క్రితమే ఫ్రాయిడ్'నీ, సాంఖ్యదర్శనంలోని పరమార్థాన్ని సమన్వయపరుస్తూ, "కాంతిస్వప్న" దీర్ఘకవిత వ్రాశాడు.

మౌలికంగా పూర్ణచందు మినీకవితావాది! 1978–85ల నాటి మినీకవితా ఉద్యమంలో ఆయన పాత్రని నేను స్వయంగా చూశాను. ఆ తరువాత "ముక్కాలు" అనే సొంత ప్రక్రియలో అసంఖ్యాకంగా మినీకవితలు వ్రాసి, రెండు సంపుటాలుగా తెచ్చాడు. 5 భాషల్లోకి అవి అనువాదం అయ్యాయి కూడా!

ఇప్పుడు ఆయన మళ్లీ దీర్ఘకవితను తలకెత్తుకుని, తన తలమీద ఉన్న తెలుగు భాషోద్యమానికి జోడించి ఈ "ఆంధ్రగీతి"ని వెలువరిస్తున్నాడు. ఈ కావ్యంలో తెలుగు భాష అవతరణ, ఆంధ్ర–తెలుగు శబ్దాల వ్యుత్పత్తి, ఆంధ్రుల ప్రాచీనత ఇవన్నీ భాషాచరిత్రగాథలుగానే కాకుండా భాషాస్మృతిబింబాలుగా ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆంధ్రుల గాథను శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి పద్యాలలో "ఆంధ్రపురాణం" పేరున కవిత్వీకరించారు. వివిధ యుగాలలో తెలుగు సంస్కృతిని విశ్లేషించే ప్రయత్నం చేశారాయన! ఆయనే వ్రాసిన "తోరణము" గ్రంథానికి పీఠికలో విశ్వనాథ సత్యనారాయణగారు ఇలా అంటారు:

"నొడువ జాలని యిడుమల గుడిచి బడలి
చిక్కి జీర్ణించి నిజదేశసేవ చేసి
తుదకు స్మరణీయులైన యాంధ్రుల దలంప
గాజు కన్నైన నొక యశ్రుకణము రాల్చు" అని! ఈ "ఆంధ్రగీతి"లో భాషావతరణం

అధ్యాయాన్ని చదివేటప్పుడు విశ్వనాథ వారికి కలిగిన భావనే నాకూ కలిగింది... ఇంతటి మహోన్నత చరిత్ర కలిగిన ఆంధ్రజాతి, ఈ రోజున భాష విషయంలో ఎందుకు నిద్రపోతోందని!

తెలుగు పలుకుబడుల పరిమళాల గురించి, మాండలికాలను అన్ని ప్రాంతాలవారూ గౌరవించాల్సిన అవసరం గురించి, శాస్త్రసాంకేతిక అవసరాలకు తెలుగును ఉపయోగించుకోవటానికి అనుసరించాల్సిన విధానాల గురించి, వాడుకభాషను వ్యాప్తిలోకి తేవటం గురించి, అధికారభాషగా తెలుగు అమలు గురించీ ఎన్నో అంశాల్ని ప్రస్తావించాడు పూర్ణచందు.

తెలుగులో సైన్సు గురించి వ్రాస్తూ, లాటిన్ భాషతో సమానంగా తెలుగుపదాలు కూడా శాస్త్రీయంగా రూపొందాయని కొన్ని ఉదాహరణల్ని కవిత్వీకరించి చెప్పటం ఆసక్తిదాయకంగా ఉంది.

"బౌద్ధం శ్వాసించిన నేలల్లో 'పంచదార'
తక్కిన తెలుగుతోటల్లో 'చక్కెర'...
'పంచన్ల దార... 'పంచదార' అని!
బౌద్ధభిక్షువుల తీపి కానుక ఇది!"

ప్రాచీన కాలంలో బౌద్ధం వ్యాపించిన తెలుగు కోస్తా ప్రాంతాల్లోనే పంచదార అనటం ఉందని, తక్కిన తెలుగు ప్రాంతాల్లో చక్కెర అనే అంటారని, దానికి కారణం పంచదార= పంచన్ల దార (బౌద్ధభిక్షువుల కానుక) కావటమే ననటం అతని పరిశోధనా ప్రతిభని, కవితాప్రతిభనీ చాటుతుంది.

"తోడు...ఇగర కాచిన పాలలో
అమ్మచేతి మజ్జిగ చుక్కల చేదోడు!
క్షీరకన్యకు చల్ల పురుషుడితో పెళ్లి
నవదంపతుల నవ్యశోభనం– పెరుగు!" – పాలలో మజ్జిగ కలిపి తోడెయ్యటాన్ని క్షీరకన్యకు చల్లపురుషుడితో పెళ్లిగా వర్ణించటం ముచ్చటైన ప్రతీక.

పూర్ణచందు ప్రతీకలను, రూపకాలను, ఎన్నెన్నో కొత్త పదప్రయోగాలనూ అలవోకగా చేశాడీ కావ్యంలో. ప్రాసకోసం పాకులాడకుండా, కావ్యాన్ని వేగంగా నడిపించటం మీద ఎక్కువ దృష్టి పెట్టాడు. పదాలలో లాలిత్యాన్ని భావనలో కూడా ప్రసరింపచేశాడు.

పాశ్చురైజ్డ్ మిల్కుని తెలుగులో ఆనవాలు లేదా చిరువాలు అని పిలిచేవారని, 'జీరో బాక్టీరియా'గా పాలుకాయటం తెలుగువారికి అనాదిగా తెలుసంటాడు. ఇదంతా వ్యాసంగానో వాచ్యంగానో కాదు, కవితాత్మక చరణాల్లో వివరించాడు. "పదంగా కాదు, పరమార్థంగా

పెరిగిన పదపుష్టి!" అంటాడు.

తెలుగు భాష మూలాలను కూడా తర్కించిన దీర్ఘకావ్యం బహుశా ఇదే అనుకుంటాను. అనంత కాలవాహినిలో ఎన్నో సంఘటనలు... ఎందరో త్యాగధనులు. అన్నింటినీ, అందరినీ కవి ఇక్కడ ప్రస్తావించలేకపోయినా, భాషకు సంబంధించి తాత్త్విక, తార్కిక, వైజ్ఞానిక, చారిత్రక సామాజిక అంశాలను సరళమైన కవితా చరణాలుగా అనితరసాధ్యంగా మలచాడు.

తెలుగమ్మ ఉన్నతిని కీర్తిస్తోనే, ఆమె దీనస్థితిని కూడా వివరిస్తాడు. చివరిగా అంటాడు–

"తెలుగులో రచనలు చేసిన పీవీ నృసింహుడు...

తెలుగు కోసం తపించిన మండలి కృష్ణుడు...

తెలుగే తానై నిలిచిన నందమూరి తారకరాముడు...

ముడిచేందుకు నాలుగో వేలుకు మనిషే లేడిప్పుడు" అని ఆవేదన ప్రకటిస్తాడు.

"నమ్మకంగా నడిపించిన తల్లిని / నాలా కాపాడే దెవరామెని!" అనే ఆత్మవిశ్వాసం ప్రకటిస్తాడు.

"ఒక్కమాటైనా బతికితే చాలును, / ఆమె ఉనికి నూరేళ్లూ నిలిచి తీరును!" అనే ఆశావాదాన్ని నింపుతాడు.

పూర్ణచందు భాషోద్యమంలో నా సహచరుడు. అనేక కార్యక్రమాల్లో నా వెన్నంటి ఉన్నాడు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి. అధ్యక్షుడు సుబ్బారావు, పూర్ణచందు ఇద్దరూ భాషోద్యమంలో శ్రమజీవులు.

మా నాన్నగారు మండలి వెంకట కృష్ణారావుగారి శతజయంతి సందర్భంగా ఆయనకు ఘనమైన అక్షర నివాళి ఇవ్వాలనే సంకల్పంతో పూర్ణచందు ఈ "ఆంధ్రగీతి" దీర్ఘకవిత వ్రాశాడు. దీన్ని వ్రాయటానికి ఎక్కువ సమయం తీసుకున్నాడు కూడా!

భాషాప్రేమికులందరికీ ఈ పుస్తకం ఒక హస్తామలకి కావాలని ఆశిస్తున్నాను. 'ఆంధ్రగీతి' ద్వారా పూర్ణచందు భాషోద్యమ భాష్యకారుడిగా నిలిచాడు. మనసారా రచయితకు ఆత్మీయ శుభాకాంక్ష లందిస్తూ ఈ భాషోద్యమ కరదీపికకు స్వాగతం పలుకుతున్నాను.



కీర్తికేతనం-ఆర్తి నికేతనం

అజరామరమై నిలిచే కావ్యం 'ఆంధ్రగీతి'!

-శ్రీ విహారి

'ఆంధ్రగీతి' వెలువడుతున్న సందర్భం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నది. చారిత్రాత్మకమైనది. నిత్య సంస్మరణీయమైనది కూడా! అది మండలి వెంకటకృష్ణారావు శతజయంతి జ్ఞప్తి.

సామాన్యులకై అసామాన్యుడుగా జీవించి అచ్చంగా కీర్తిమంతులైనవారు మండలివారు. పోతన చెప్పిన "శారదనీరదేందు..." పద్యంలో ఉపమించిన సంపూర్ణ ధవళత్వ చిహ్నాలన్నీ ఆ కీర్తిధారికి వర్తిస్తాయి. అసలైన తెలుగు సంస్కృతిని అణువణువునా జీర్ణించుకొని, ఆచరణసాధ్యం చేసి చూపిన ధన్యజీవివారు. తెలుగువారికి వారు చేసిన బహువిధమైన సేవ స్ఫూర్తిమంతమే కాదు, అనుదిన వందనీయం! ఆ సేవా సంక్రాంత ఋణం తీర్చుకోగలిగేది కాదు.

శ్రీ బుద్ధప్రసాదు మండలి వెంకట కృష్ణారావుగారి బహుపార్శ్వయుత సద్గుణనిధిని వారసత్వంగా అందుకున్న భాగ్యశాలి. ఒక్కటేమాట... అడుగుజాడ తండ్రిది, నడత, నడక కుమారునిది. వీరి చలనం, గమనం, పయనం తెలుగు భాషాసాహితీ సంస్కృతులు చేసుకున్న పుణ్యఫలం. వీరు గౌరవాధ్యక్షులుగా, దిక్సూచిగా మా గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షులుగా, మా పూర్ణచందు ప్రధానకార్యదర్శిగా నిలిచిన కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణగాథ 'ఆంధ్రగీతి' వెలువడుతూ వుండడటం ఆసంస్థకు గౌరవప్రదం, ఆసంస్థతో నిత్యసంబంధ బాంధవ్యం కలిగిన నావంటి ప్రతి ఒక్క సాహితీ పరునికీ ఆనందదాయకం.

'ఆంధ్రగీతి' కవి డా॥ జి.వి. పూర్ణచందు వృత్తిరీత్యా ఆయుర్వేదవైద్యుడు. ప్రవృత్తిరీత్యా శతాధిక గ్రంథకర్త. సాహితీపరుడుగా నిత్య విద్యార్థి. అధ్యయనం, పరిశీలన, పరిశోధన, పరిశ్రమ, ప్రయోగం అతని చేత అనితరసాధ్యమైన సాహితీ విజయాల్ని సాధింపజేశాయి.

14 ఏళ్లకే కలం పట్టాడు. 21వ ఏటనే 'అమలిన శృంగారం' శాస్త్ర గ్రంథం రాశాడు. ఆ తరువాత అనేక వైజ్ఞానిక రచనలు చేశాడు. నవలాకారుడుగా 'నభూతో' పరిశోధనలుగా 'సప్తసింధు','తెలుగుధీర' నవలల్ని వెలువరించాడు.కవిగా, సోమసుందర్ వంటి పెద్దలు అభినందించిన 'కాంతిస్వప్న' దీర్ఘకవితని 1990ల్లోనే అందించాడు. ప్రయోగశీలిగా తన "ముక్కాలు" కవిత్వాన్ని ఐదు భాషల్లోకి అనువాదంగా తెచ్చాడు. సాహిత్య విమర్శకునిగా 'శ్రీగీతగోవిందం', 'పద్యంలో మనం', 'పద్యానుభవం' 'పద్యరాగాలు', 'రామాయణంలో విశేషాలు' వంటి గ్రంథాల్నీ, చారిత్రక రచనాధురీణుడిగా 'బుద్ధదేవుని కథ', కృష్ణాతీరం-మరోచూపు', 'అలనాటి పట్టణాలు', బ్రిటిష్ యుగం' వెలువరించాడు. అనేకమంది మహనీయుల జీవితచరిత్రలు వ్రాశాడు. అప్పయ్యదీక్షితుల జీవితచరిత్ర అద్భుత పరిశోధన.

కాగా, భాషాపరిశోధకునిగా పూర్ణచందు అద్వితీయుడైనాడు. 'తెలుగేప్రాచీనం', 'నైలునుండి కృష్ణదాకా', 'తెలుగులో అతిథిపదాలు', 'సొంపైన తెలుగు' వంటివి అతడు మాత్రమే

రాయగలిగినవిగా ప్రసిద్ధి పొందాయి. తెలుగు వారికి అతని అమూల్యమైన కానుక 'ఆహారవేదం'. అలాగే, ఆరోగ్యపరమైన పుస్తక పంక్తి. తెలుగువారి ఆహార చరిత్రకొక దిశను ఏర్పరచిన ఏకైక పరిశోధకుడిగా నిలిచాడు.

పత్రికల్ని నిద్రపోనివ్వని కాలమిస్ట్ పూర్ణచందు. ఒకేసారి తొమ్మిది పత్రికల్లో శీర్షికలు నడిపిస్తున్నాడు. సాహితీకృషీవలుడుగా అతడు పొద్దుచాలని సూరీడు. మరోపార్శ్వంలో అతడు కార్యశీలి, కార్యకర్త, కార్యదక్షుడు, కార్యదర్శి!

కృష్ణాజిల్లా రచయితల సంఘానికి సుబ్బారావు హార్డ్-వేర్ అయితే పూర్ణచందు సాఫ్ట్-వేర్ అని 20 యేళ్లక్రితమే రాళ్లబండి కవితాప్రసాద్ అన్నాడు. ఈ నాటికీ ఆ ఇద్దరిలో మార్పులేదు.

ఇంక "ఆంధ్రగీతి"- సాధారణ దీర్ఘకవిత కాదు. "ఆంధ్రగీతి" అనగానే ఇది 'గత చారిత్రక యశః కలాపం' అనిపించవచ్చు, కానీ, అంతకు మించిన ఆవశ్యక నివేదిక. 10 పేజీల అక్షరీకరణ. 7 ప్రకరణాలు: పూర్ణచంద్రాయణం'తో మొదలు, 'అధికారభాష'తో ముగింపు.

ఈ కృతి సృజనాత్మకమైన రచన. రచన సృజనాత్మకం కావాలంటే మూస నుండి విడివడాలి. వస్తుస్పృహలో నవత్వం కావాలి. ఇక్కడ ఉన్నది అది. తెలుగుజాతి, భాష, సాహిత్యం, సంగీతం, సంస్కృతి, విజ్ఞానం, కళలచరిత్ర స్పర్శ ఉన్నది. వీటన్నింటి మూలాలు పరిణామాలు ఉత్థానపతనాల విజ్ఞప్తి ఉంది. నాటి ఘనతకు నేటివాస్తవాల్ని పోల్చి చూపిన నిజాయితీ ఉన్నది.

"వేదనాదాల నుండి సాపేక్ష వాదాల దాకా/'ఆదిమత' నుండి 'అత్మికత' దాకా/'ఆటవికత' నుండి 'ఆటమికత దాకా/ తెలివి పులకించిన తెలుగు పలుకు"... ఈ కావ్యం! అందుకనే ఇది, అతనే అన్నట్టు...

"శబ్దం నుండి శాస్త్రందాకా/ సంకేతం నుండి సంభాషణ దాకా/ బోధన నుండి భావన దాకా/ భాషాపరిణామాల తెలుగు స్వరతేజం!"

పూర్ణచందు ఈకృతిలో తనివితీరా తెలుగుతల్లి గుణగానం చేశాడు. ఆబగా దోసిళ్ళతో అక్షరాల, పదాల, వాక్యాల, గ్రంథాల, వాఙ్మయాల అనుపానాల్ని ఆస్వాదించాడు, ఆఖరున ఒక చేదునిజాన్నీ మెత్తని పులిలా వదిలాడు, 'భక్తిగల హృదయానికే గదా తెలుగులోని మాధుర్యం" అన్నది గట్టి చురకే! దాని తాకువల్లనైనాతెలుగుల మనసులు, ఆలోచనలు, ఆచరణలు సునిశితం కావాలి...!

మాండలిక శోభ కులుకులు అందించింది ఈ కావ్యం! భాషావతరణ అక్షరాల శక్తీ, రక్తీ ద్యోతకం చేసింది. ఇక 'పలుకుబడుల పరిమళాలు' అనే అధ్యాయం సొంపైన తెలుగు వాహికతో వచ్చి పులకలనిచ్చాయి. మినుకు పలుకులు పారిభాషిక పదాల కష్టసుఖాల్ని చెప్పుకున్నాయి.

అంధకుల నుంచీ ఆంధ్రుల దాకా భాషాపరిణామాలను వివరించి, "తెలిసి మసులుకో తెలుగువాడా" అనే హెచ్చరిక నిచ్చాయి. జాతి సంస్కృతి ప్రవాహినీ సదృశం. బస్సునీ రోడ్డునీ టిక్కెట్టునీ ఎవరాపగలరు? ఎందుకు ఆపాలి?జీవనదిని కొలుద్దామంటాడు కవి.

'ఆంధ్రగీతి'కవితాత్మకమైన రచన. ఏ వాక్యాన్ని స్పృశించినా దృశ్యస్పృహ మేథని ప్రచోదితం చేస్తున్నది.

"చెట్టు మీద వాలిన చిలుకల కోలాహలం
అమ్మ మాటల్లో చేతనా ఛాయల వేదనాట్యం
పొలాలపై పరచుకున్న పచ్చని వెలుగుతీరమై
నదీజలాల ఆవర్తనంలో ఆమె తెలినవ్వులు" అనగానే ఆ కావ్యభాషలో సహస్ర కిరణాల్లో చిత్రవర్ణదృశ్యాలు శబ్దచిత్రాలై కళ్లకు కడతాయి. ఇంతకింత భావస్ఫోరకంగా–

"చివురుటధరాలపై కొత్తపొద్దు నింపాదిగా
తడితడినవ్వులతో పూలజల్లులు కురిశాయి!
కొండల కుండలాల గణగణలు సన్నగా
నుదుట సిందూరపు హొయలతో భానూదయం"

కవిత్వంలో అనిర్వచనీయతని మోయలేని సామాజిక వాస్తవికత రసాత్మకంగా చాలా పట్టుల్లో చెప్పాడు పూర్ణచందు.

"భూమిని నాగలి ముద్దాడిన ఆదిమకాలాన/రాతిగూళ్ళలో దీపాలునవ్విన రోజున/కట్టుబట్టల కోసం జీవితపు అల్లిక నేర్చిన వేళ/వంటకుండ కోసం కుమ్మరి చక్రం గిర్రున తిరిగినప్పుడు... అంటూ నాగరకత వైభవ ఆరంభదశను వివరిస్తూ,"అదిగో అప్పుడు అంకురించింది తెలుగు నుడి!" అంటాడు.

ఇటువంటి చరణాలు భావుక భావ్యమానమైన గుణనైపుణ్యంతో కావ్యాన అందగించాయి. కావ్యం కవితాత్మకం కావాలంటే, కవికి శబ్దసంపద ఒక్కటే చాలదు. ఆ శబ్దాలతో అభివ్యక్తిని రవళింప చేయగల పనితనం కావాలి! పూర్ణచందుకి ఈ శబ్దార్థ సంయోజనాన్ని ఇచ్చే అభివ్యక్తి పుష్కలంగా ఉంది.

"ఒక శబ్దం హృదయగవాక్షం తాకగానే / ఆలోచనామేఘం వాక్యమై వర్షిస్తుంది!/ ఒక'నుడి'దివ్యవేదస్వరంగాధ్వనించగానే / ప్రతి మౌనమూ జాతీయ గీతమై పాడుతుంది!" కవిత్వ సామాగ్రిని సంపాదించుకోవటమే గాక దాని పదునుని ఝళిపింపగల ఆలంకారిక తృష్ణ లేనిదే ఇలాంటి కవితామయమైన చరణాలు రావు.

'ఆంధ్రగీతి 'కావ్యవైభవాన్ని, శోభని, సౌభాగ్యాన్ని, నిదర్శించటానికి ఈ నాలుగు పంక్తులూ చాలు...ఈ కవి ఎంతటి సాంద్రతరంగా, గాఢతరంగా మాటని కవిత్వం చేయగలడో... ఈ రసాత్మక వాక్యాలు తేటతెల్లం చేస్తున్నాయి.

"వాక్యసాధకుడికి వాణీప్రసాదమైనిలువు" అని తెలుగమ్మని వేడుకుంటాడు ఆర్తితో...!

ఈ కావ్యానికి, అందునా అజరామరంగా నిలువనున్న కావ్యానికి ముందుమాట ఎంతని రాయగలను...! ఆ పరిమితి ఈ పరిణత భాష సౌందర్య దర్శనాన్ని ఇక్కడే ఆపాలని హెచ్చరిస్తున్నది.

"ఇరువది కోట్లసంతానవతి ఆమె / విశ్వధాత్రి మా తెలుగుతల్లి" అనీ, "ఆమె భాష, ఆమె భాష్యం...ఆమె భావం ఆమె చేతనా పరంధామం" అనీ అన్నాడు. ఈ భావన ప్రతి తెలుగు గుండెలో రవళించాలనీ, ప్రతీ తెలుగు రసనా నినదించాలనీ ఆకాంక్షిస్తున్నాను.

మండలి వెంకట కృష్ణారావుగారికి ఈ కృతి అంకితం అచ్చమైన నివాళి.

పూర్ణప్రజ్ఞానిధి, ప్రతిభాస్వంతుడు, రససిద్ధుడైన కవి పూర్ణచందుకు జేజేలు...శుభాశీస్సులు!



నిలువుటద్దంలో తెలుగుభాష-దశ, దిశ

ఆచార్య **రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

"భూమిని నాగలి ముద్దాడిన ఆదిమకాలాన
రాతిగూళ్లలో దీపాలు నవ్విన రోజున
కట్టుబట్టల కోసం జీవితపు అల్లిక నేర్చిన వేళ
వంటకుండ కోసం కుమ్మరిచక్రం గిర్రున తిరిగినప్పుడు
అదిగో అప్పుడు... అంకురించింది తెలుగు నుడి"

తెలుగు జాతి చరిత్ర. సంస్కృతి భాష, సాహిత్యం- వీటిమీద ఇప్పటికే చాలా సాహిత్యం వచ్చింది. తీర్థయాత్ర చేస్తున్న అర్జునుని నన్నయ్య గోదావరి దాకా తీసుకురావడంతోనే తెలుగు సాహిత్యం, తెలుగు నేలను ముద్దాడడం మొదలు బెట్టింది. ప్రాచీన తెలుగు కావ్యావతారికలలో తెలుగువారి చరిత్ర తెలుగు కవులు, తెలుగు భాష, తెలుగు జీవితం చిత్రించబడ్డాయి. కీర్తింపబడ్డాయి. పాల్కురికి సోమన సమకాలీన శివభక్తుల జీవితాలను వర్ణించారు. ద్విపదకు కావ్యగౌరవం కల్పించారు. "తెలుగు మాటలనంగవలదు వేదముల కొలదియా కాజూడుడు" అని హెచ్చరించారు.

శ్రీనాథుడు 'క్రీడాభిరామం'లో వరంగల్లును, పల్నాటి వీరచరిత్ర, భీమేశ్వర పురాణాలలో కోస్తా ప్రాంతాల్ని వర్ణించాడు. తాళ్లపాక అన్నమయ్య తెలుగు పల్లెలను వర్ణించాడు. తిక్కన, అన్నమయ్యలు తమకాలపు తెలుగు పదజాలాన్ని కుప్పబోశారు. వేమన, వీరబ్రహ్మంలు తమ కాలపు తెలుగు సమాజాన్ని కళ్ళముందు రూపు కట్టించారు. శ్రీ కృష్ణదేవరాయలు రుతువర్ణనల్లో. ధూర్జటి కరువు చిత్రణలో. తరిగొండ వెంగమాంబ కావ్యాలలోతెలుగు వారి జీవితమే వర్ణితమైంది. నన్నెచోడుడు, పాల్కురికి సోమన, పోతన, మొల్ల, వేమనవంటివారు తెలుగు భాష తరపున వకాల్తా పుచ్చుకుని వాదించారు. తెలుగు శతకాలు, క్షేత్రమహాత్మ్య కావ్యాలు సైతం తెలుగు సమాజాన్ని చరిత్రను ఆరాధనాభావంతోనో, విమర్శనాత్మకంగానో ప్రతిబింబించాయి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కనిపించేదంతా తెలుగు జీవితమే! కవిత్వం వరకే పరిమితంగా చూసినా తెలుగునాడు(దాసు శ్రీరాములు), ముసలమ్మ మరణం (కట్టమంచి రామలింగారెడ్డి), పూర్ణమ్మ (గురజాడ), ఆంధ్రప్రశస్తి (విశ్వనాథ) రాష్ట్రగానం (తుమ్మల), రాష్ట్రపూజ (జాషువా), కాపుబిడ్డ (గంగుల), రైతు రామాయణం (వానమామలై), ఆంధ్రావళి (రాయప్రోలు), జన్మభూమి (నాయని), రాయలసీమ రైతు (భైరపురెడ్డి), పెన్నేటి పాట (విద్వాన్ విశ్వం), కర్పూర వసంత రాయలు (సినారె), పెనుగొండ లక్ష్మి (పుట్టపర్తి), హంపీక్షేత్రం(కొడాలి), దాక్షారామం (ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి), శ్రీకృష్ణభారతం (భూతపురి), రెడ్డిరాజ్యమహోదయం

(బెళ్లారి), శ్రీకాకుళం (ఛాయారాజ్), ఆది ఆంధ్రుడు (కొలకలూరి), కొయ్యగుర్రం (నగ్నముని) హంద్రీగానం (జి. వెంకటకృష్ణ) వంటి అనేక కావ్యాలు విభిన్న చారిత్రక సందర్భాలలో విభిన్న భావజాలాలతో తెలుగుజాతి బహుముఖీన జీవితాన్ని ఆవిష్కరించాయి. తెలంగాణా విమోచనోద్యమం, ఆంధ్రోద్యమం, తెలంగాణా రాష్ట్రోద్యమం, ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమం తెలుగు కవులను తట్టి లేపాయి.

ప్రపంచీకరణ చేస్తున్న ప్రాదేశిక విధ్వంసం తెలుగు ప్రజలను తెలుగు భాషాసంస్కృతుల నుంచి దూరం చేస్తున్నదనే భావన తెలుగు కవులను కలాలు ఝుళిపించడానికి ప్రేరేపించింది.

గత నాలుగు దశాబ్దాల ఆధునిక కవిత్వంలో దళిత, బహుజన, స్త్రీ, ముస్లిం, ప్రాంతీయాది అస్తిత్వాలు ప్రాధాన్యం వహించాయి. వాటికి వ్యవసాయం, తెలుగు భాష అస్తిత్వాలను కూడా కలపవలసి ఉంది.

ఈ దశాబ్దాలలోనే తెలుగు భాషా సంస్కృతి అస్తిత్వ స్పృహతో కొన్ని వందల కవితలు వచ్చాయి. ఆ తానులో పోగు డాక్టర్ జి.వి. పూర్ణచంద్ గారి నుండి 'ఆంధ్రగీతి'అనే దీర్ఘ కవిత.

'ఆంధ్రగీతి'ఏడధ్యాయాల కావ్యం. పూర్ణచంద్రాయణం, భాషావతరణం, ఆంధ్రులప్రశస్తి, పలుకుబడుల పరిమళాలు, మాండలికశోభ, మినుకుపలుకులు, అధికారభాష అనే అధ్యాయాల మీదుగా పూర్ణచంద్ గారు భాషా సాహిత్య చరిత్ర అభిమానాన్ని, కళ్లాల్లో రైతు వడ్లను పరిచినట్లు పరిచారు.

చంద్రుని వర్ణనతో మొదలైన ఈ కావ్యంలో కవి పేరు కూడా వస్తుంది. అందులో కొంత ఆత్మముగ్ధత్వం కనిపిస్తుంది. అది కావ్యదోషం కాదు. కవి ఉద్దేశంలో మరోచంద్రుడు ఎవరైనా ఉన్నారేమో చూడాలి.

పూర్ణచంద్ గారు సంప్రదాయాన్ని తిరస్కరించని ఆధునికులు. ఆయనకు ప్రాచీన సాహిత్య పరిచయం పుష్కలంగా ఉంది. ఆధునిక కవిత్వ విజ్ఞానం సరేసరి! సాహిత్యంలో చరిత్రను అన్వేషించడంలో ఆయన మేటి. తెలుగువారి అలవాట్లను సాహిత్యంలోంచి పునర్నిర్మాణం చేయడంలో ఆయన దిట్ట. పదసౌందర్యాన్ని అనుభూతికి తెచ్చుకోవడంలోనూ ఆయన రసికుడు. అంత్యప్రాసలు విదూషక చేష్టలు కాకుండా జాగ్రత్త వహించడంలో అప్రమత్తుడు.

ఈ కావ్యంలో సాధారణంగా భాష పుట్టుక, దాని మూలాలు, భాష పుట్టడంలోని చారిత్రకత, మానవశ్రమ వంటి శాస్త్రీయ విషయాలను మొదట ప్రకటించారు కవి. తెలుగు భాషా ప్రాచీనత గురించి పూర్ణచంద్ గారికి భాషా శాస్త్రవేత్తలు కన్నా భిన్నమైన ఆలోచనలు ఉన్నాయి.

పూర్ణచంద్ గారికి వేదాలంటే పరిపూర్ణమైన ప్రేమ, ఇష్టం ఉన్నాయి. అందుకే, ఈ కావ్యంలో వేదప్రసక్తి విరివిగా వస్తుంది. తెలుగుభాష ద్రావిడభాషా కుటుంబానికి చెందినదనే ఆధునిక సిద్ధాంతాన్నిఆమోదిస్తూనే పూర్ణచంద్ గారు తెలుగుభాషకు సంస్కృతంతో గల విడదీయరాని సంబంధాన్ని అనేక సందర్భాలలో అనేక రకాలుగా అభివ్యక్తం చేశారు.

పూర్ణచంద్ గారు తెలుగు భాషారాధకులు. అవకాశం వచ్చినప్పుడంతా ఆయన తన్మయులై తెలుగు భాషను కీర్తిస్తారు. ఆయనకు గౌరవం ఉన్న వేదాల దగ్గరికి తెలుగు భాషను తీసుకుపోతారు.

"తెలుగు నేల అక్షరాల అలకాపురి/తెలుగు భావన మిన్నేటి మధుర గాన సిరి/తెలుగు అక్షరం తేనెలో తడిసిన ఇక్షురసం/తెలుగు పదం పరిమళించే మరువంపు దళం"ఆయన దృష్టిలో ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల మంది తెలుగువారు ఉన్నారు. అయినా తెలుగును మాట్లాడేవాళ్లు తగ్గిపోవడం పట్ల కవి తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

"తల్లిని మరిచిన తరం వట్టి మట్టిబెడ్డలు"! పూర్ణచంద్ గారికి తెలుగు భాష పట్ల ఎంత మక్కువో సంస్కృతభాష పట్ల కూడా అంతే మక్కువ. అందుకే "వేదాల పునాదుల వెంటే తెలుగులు" అని పలుమార్లు అన్నారు. అయినా రెండు భాషల మధ్య ఉన్న తేడాను ఆయన గుర్తించకపోలేదు...

"కొమ్మలకు వేలాడే తేనె పట్టులా అవుపిస్తాయి
అడ్డగీతను అంటి సాగే దేవనాగరి అక్షరాలు!
మంచి ముత్యపురాసులు దొర్లినట్లు
సుడివేసిన గుండ్రని బొమ్మరిల్లులా
తీరి ఉంటాయి తెలుగు అక్షరాలు"

ఈ కావ్యంలో చరిత్ర, విశ్వాసం కలగల్సి ఉంటాయి.

"సంస్కృతపు ముత్యాల హారంలో మధ్యమణి తెలుగు" అన్న కవి..."ఆంధ్ర ద్రవిడాది జాతీయులెందరో అరసిన అందరి పదాల కలబోతే ఆంధ్రము" అన్నారు. అట్లని పూర్ణచంద్ గారు పౌరాణికత దగ్గరే ఆగిపోలేదు. గాథాసప్తశతిని కూడా ప్రస్తావించారు. గాథాసప్తశతిలో తెలుగు పదాలను కూడా ప్రస్తావించారు. ఎమెనూ అనే పండితుని ఉదహరించారు. తెలుగునాట బౌద్ధం గురించి పూర్ణచంద్ గారు విశేషంగా చెప్పడం ఆయన వాస్తవిక దృష్టికి నిదర్శనం. ప్రాకృతం పట్ల గౌరవం ప్రకటించారు. సాధారణంగా భాష పుట్టుక పట్ల పౌరాణిక వాదం, పరిణామ వాదం రెండూ ఉన్నాయి. పూర్ణచంద్ గారు రెంటినీ ప్రస్తావించారు. 19వ శతాబ్దంలో పుట్టిన ద్రావిడ వాదాన్ని కూడా గుర్తించారు.

"బోధిసత్త్వుని వెలుగు మురియకముందే
కన్నడ మరాఠీ తెలుగు మూలధ్వనులు
ఒకే ఊపిరితో పలికిన గొంతుక లానాడు...
ఆంధ్ర మాతృకకు 'అక్షర సంతకాలు' అవన్నీ"

అంధక శబ్దం నుంచి 'ఆంధ్ర' అనేపదం పుట్టిందని గుర్తించారు. దాని వ్యుత్పత్తిని తెలిపారు. అలాగే 'తెలుగు' అనే పదం పుట్టుక, పరిణామాన్ని చరిత్ర ఆధారంగా వివరించారు. ఆంధ్రజాతి మూలాల గురించి ఇదివరకే ఉన్న లిఖిత ఆధారా లన్నిటిని ఈ కావ్యంలో కవిత్వీకరించారు పూర్ణచంద్ గారు. ఐతరేయ బ్రాహ్మణంలోంచి అనేక చారిత్రక అంశాలను స్వీకరించి, ఆంధ్రజాతి ప్రాచీనతకు పెద్దపీట వేశారు. రాజులను రాజవంశాలను కవులను కావ్యాలను శాసనాలను ఇందుకు ఉపయోగించుకున్నారు.

"గ్రీసు నుండి సయాం, చైనా దాకా
సముద్రుడికి పంచ కట్టి ఆంధ్రుణ్ణిచేశారు"
వంటి వినూత్న వర్ణనలు ఆసక్తికరంగా ఉంటాయి.

తెలుగువాళ్ళు తెలుగు మాధ్యమంలో చదవాలన్న అభిలాష కవికి హృదయదఘ్నంగా ఉంది. అంత మాత్రం చేత ఇతర భాషల అధ్యయనానికి కవి వ్యతిరేకం కాదు.

"ఎన్నెన్ని భాషలు మాట్లాడినా
అమ్మ భాషలోనే గ్రహింపు అధికం"

పూర్ణచంద్ గారు 4,5,6 అధ్యాయాలలో తెలుగుభాషలోని పలుకుబడులను, మాండలికాలను, పారిభాషిక పదాలను తన కవిత్వంలో వర్ణనాత్మకంగా వివరించారు. పదాల మూలాలను అన్వేషించి వివరించడంలో పూర్ణచంద్ గారికి శ్రద్ధ ఎక్కువ.

"ప్రతి అక్షరమూ ఒక్కో గ్రహం... / ప్రతి భావమూ ఒక్కో కాంతివలయం..." అంటూ భాషను ఖగోళీకరించారు. "పదం పువ్వు అయితే భావం దాని పరిమళం" అన్న భావుకత అందంగా ఉంది.

తెలుగుభాషలో ఇతర భాషాపదాల చేరికను కవి అడ్డుకోలేదు. భాష ప్రవాహశీలి, పరిణామశీలి అనే ఎరుక కవికి ఉంది.

"దడికట్టి భాషను దాస్తారెందుకు?" అన్నది కవి ప్రశ్న. తెలుగును పూర్తిగా విస్మరించడాన్ని పూర్ణచంద్ వ్యతిరేకిస్తారు గాని, ఆంగ్లాన్ని ద్వేషించరు. భావాన్ని చెప్పడానికి సరిపోయే తెలుగు మాట దొరకనప్పుడు ఇతర భాషా పదాలను స్వీకరించాలన్నది ఆయన అభిమతం.

మనకున్న పదాల్ని వెలుగుగా వాడదాం / అవసరాలకు అన్య పదాలను అతిథిగా ఆహ్వానిద్దాం"ఇతర భాషా పదాలను ఎక్కువగా స్వీకరించే ఆంగ్ల భాషను ఆయన ప్రశంసించారు కూడా! కొన్ని ఇతర భాషల పదాలకు తెలుగు అర్థాలను చెప్పే ప్రయత్నం కూడా చేశారు. తెలుగు మాటతో చెప్పదగిన అర్థాన్ని అనవసరంగా కృత్రిమ పదాల్లో చెప్పాల్సిన అవసరం లేదంటారు.

"పైవంతెన అంటాడు ఫ్లై ఓవర్ని పల్లెవాడు
ఊర్ధ్వవారధి అంటాడు చదువున్నవాడు"

ప్రజలు వాడే పదాలే మనకు ప్రమాణమని కవి అభిప్రాయం. కృత్రిమ అనువాదాన్ని ఆయన పూర్తిగా నిరాకరించారు. అడుగడుగునా వేదప్రసక్తి తెచ్చే పూర్ణచంద్ గారు తెలుగు పదాలు లభిస్తున్నప్పుడు సంస్కృత పదాలను వాడవలసిన అవసరం లేదనడం, మాండలిక పదాలను గౌరవించటం విశేషం.

"మాండలికాలన్నీ అచ్చ తెలుగు పలుకులే! / అగ్ని కణాల చెకుముకులు వరుసుకుంటే అంటుకునే దీపశిఖలు"

మాండలిక పదాభిమానాన్ని కవి ఎంత అందంగా కవిత్వీకరించారో చదివితే ఆనందం కలుగుతుంది.

"కనురెప్పల పొలం గట్లమీద కాసిన / కలల దోసపండ్లు మాండలికాలు" సంప్రదాయ వాసనలు ఉన్న కవి అయి ఉండి ప్రాచీన కావ్యాలలో మాండలిక పదాలు లేకపోవడాన్ని ఎత్తి చూపడానికి వెనకాడ లేదు.

"కావ్యాలకు మాండలికం బహుదూరం"...మాండలిక పారిభాషక పదనిఘంటువు కావాలన్న కవి కోరిక అవసరమైనదే! అయితే గతంలో ఈ కృషి చాలా వరకు జరిగింది. మధ్యలో ఆగిపోయింది. ఆగిపోయిన చోట నుండి మళ్లీ మొదలవ్వాలి. పారిభాషిక పదాలు పరభాషలోనివైనా మన భాషలో చెప్పడం అంత కష్టం కాదంటారు పూర్ణచంద్ గారు. పదాలను సృష్టించుకోవాలంటారు.

"కొత్త పదాలు పుట్టుకొస్తాయి జనం ఉన్నచోట"

"తల్లి భాషలో పరభాషను ప్రసరించే భాషా సాంకేతికత పెరగాలి" అన్నది కవి సూచన. ఆ రకంగా ఆయన కొన్ని పారిభాషిక పదాలకు తెలుగు పదాలను సూచించారు. క్వాడ్రాంగ్యులారిస్ అనే లాటిన్ పదానికి 'నల్లేరు' నాలుగు పలకలుగా ఉన్నది అని చెప్పారు. ఇంకా చాలా పదాలను అలా చర్చించారు.

"పారిభాషికాలకు పరభాషే దిక్కు
నిన్నటి మాట అది
సాంకేతికయుగాన అది అమ్మభాష హక్కు
ఈనాటి ఉద్యమం ఇది"

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలుగును అధికార భాషగా ప్రకటించుకుని దాని అమలు కోసం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘాన్ని నియమించుకుంది. అధికార భాషగా తెలుగు అమలు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లు అయింది. ఇక ఏ అధికారము లేని సంఘంగా అధికార భాషా సంఘం నిలిచిపోయింది. ఎవరో ఇద్దరు ముగ్గురు అధ్యక్షుల కాలంలో తప్ప తక్కిన వాళ్లకు ఆ సంఘం అధ్యక్షత అవసరమో, అలంకారమో అయిపోయింది.

పూర్ణచంద్ గారు ఈ కావ్యంలో చివరి అధ్యాయాన్ని అధికారభాషకే కేటాయించారు. అన్ని విధాల తెలుగుభాష అనాథగానే కాదు నిరుపయోగం అయిపోతున్నదే అని కవి ఆవేదన చెందారు. కావ్యాన్ని ముగిస్తూ ఆయన అన్న మాటలు కొరడా ఝుళిపించినట్లు ఉన్నాయి.

"చదువుల భాష కాలేదు బడిలో మన భాష
కార్యాలయాల్లో చేరలేదు, తెలుగు అక్కడ మూగనోము
న్యాయమూర్తి సత్యాన్ని తెలుగులో చెప్పడు తమాషా
ఇంటింటా కనిపించకుండా పోయింది తెలుగు తేనె సీసా"

ఒకనాటి నిజామాబాద్ జిల్లా కోర్టు న్యాయమూర్తి మంగారి రాజేందర్ (జింబో), ఇటీవల కర్నూలు జిల్లా కోర్టు న్యాయమూర్తి తెలుగులో తీర్పులిచ్చి చరిత్రకు ఎక్కారు. బోధనా భాషగా పాలనా భాషగా తెలుగు అమలు కావాలన్నది అధికారభాష చట్టం లక్ష్యం. మొన్నమొన్నటిదాకా అంటే దాదాపు 1990 దాకా ఈ రెండు రంగాలలో తెలుగు చాలా వరకు అమలైంది.

ప్రపంచీకరణ ప్రవేశంతో ఉపాధి పేరు చెప్పి, సంపూర్ణ కంప్యూటర్ పేరు చెప్పి, మాతృభాష పాలనా బోధనారంగాల నుండి అదృశ్యమైపోయింది. ఇది కవిని కలవర పెట్టింది. ఇలాంటి వాతావరణంలో నైనా సాధ్యమైనంత వరకు తెలుగును కాపాడుకోవాలని కవి తపన.

"పరభాష పల్లకి నెక్కి పాలకుల ఊర్మిళ నిద్ర" అని కవి చురక అంటించారు. పాలకులతో పాటు తల్లిదండ్రులకు కూడా ఇది వర్తిస్తుంది. తెలుగు మాధ్యమ పాఠశాల పక్క వీధిలో ఉన్నా పిల్లల్ని బస్సు ఎక్కించి దూర ప్రదేశాలలోని కార్పొరేట్ స్కూళ్లకు పంపించే తల్లిదండ్రులకు వర్తిస్తుంది. తమ పిల్లల్ని ఆంగ్లమాధ్యమ విద్యాసంస్థల్లో చదివిస్తూ తెలుగుమాధ్యమం ఉండాలని దబాయించే తెలుగుభాషా పరిరక్షణ ఉద్యమకారులకు కూడా పూర్ణచంద్ గారి మాట వర్తిస్తుంది.

ఈ భాగంలో ఇంగ్లీషులో వచ్చిన అర్జీలను తిరస్కరించిన 18వ శతాబ్దం నాటి మచిలీపట్నం కలెక్టర్ ర్యాంఘూంను కవి ప్రశంసించారు. ఆంధ్రోద్యమాన్ని కవి శ్లాఘించారు. స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రశంసించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగువారు అనుభవించిన వివక్షతను ప్రస్తావించారు. దేశానికి స్వతంత్రం వచ్చినా పరతంత్రబంధం వదలని వాస్తవాన్ని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న విజనులలో తెలుగు భాష ప్రస్తావన లేకపోవడాన్ని కవి ఎత్తిచూపారు. మళ్లీ ఒకసారి గుర్తుచేసుకుంటే పూర్ణచంద్ గారు ఇతర భాషలను నేర్చుకోవడానికి అభ్యంతరం చెప్పడం లేదు.

"ఏ భాషా మనకి శత్రువు కాదు
ఏ యాస అపహాస్యానికి 'గురి' కాదు
అమ్మ భాషని ప్రేమించే హృదయం
అన్య భాషలను గౌరవిస్తుంది"

ఇందులో రెండో పాదం గురించి అందరూ మరోసారి ఆలోచించాలి. నదీ, సముద్రపరివాహక ప్రాంతాల సంపన్నులు తీసే సినిమాలలో తెలంగాణ రాయలసీమ ఉత్తరాంధ్ర యాసలు అవహేళింపబడుతున్నాయి.

పాల్కురికి సోమన నుండి ఆధునిక కవుల దాకా తెలుగు భాషకు పట్టం కట్టిన కవులను పూర్ణచంద్ గారు ప్రశంసించారు. వాడుక భాషను ప్రేమించారు.

ఈ కావ్యం తెలుగుజాతి చరిత్ర, భాష, సంస్కృతి సాహిత్యాల దశనూ, దిశనూ ఆర్ద్రంగా, ఆవేదనగా చిత్రించిన కావ్యం. ప్రపంచంతో పాటు మనము నడుస్తూ మన భాషను మనం మర్చిపోరాదని దానిని రక్షించుకోవాలని ఆకాంక్షించారు. పూర్ణచంద్ గారికి శుభాకాంక్షలు చెప్తూ వారి 'ఆంధ్రగీతి' కావ్యాన్ని నేను మనసారా స్వాగతిస్తున్నాను.

"పరభాష ఓ బతుకు బాట...
తన భాష మనసుని తాకే పాట...
మనసు తెరలు తెరవాలంటే
తన మాటల దీపాలు వెలగాలి."



'ఆంధ్రగీతి'– తెలుగు కవితల ఇంద్రధనుస్సు

డా॥ గుమ్మా సాంబశివరావు

"కవిని రవితోడ పోల్చుట కచ్చితమ్ము
ఏడు వర్ణాలు జీర్ణించుకిట్టె ఏక
వర్ణమును చిమ్ముచుండును వసుధలోన
అనుచు కవితలు వ్రాసితే ఘనసినారె" అని, నేను 'సినారె శతకం'లో ఒక తేటగీతి వ్రాశాను.

సూర్యుడు ఏడు వర్ణాల్ని జీర్ణించుకుని ఏకవర్ణాన్ని చిమ్ముతాడనటం ద్వారా సూర్యకిరణాల ప్రభావంతో ఏడు రంగుల ఇంద్రధనస్సు ఏర్పడుతుందని, అరుదైన ఇంద్రధనుస్సులాంటి ఘనకవి సినారె అనీ అందులో అన్నాను.

డా॥ జి.వి. పూర్ణచందు గారి కవిత్వాన్ని విశ్లేషించేప్పుడు మనసులో సినారె మెదలటం కాకతాళీయం కాదు. ఒక మంచి కవిత చదివినప్పుడు మరో మంచి కవి స్ఫురణకు రావటం మంచి కవిత్వానికి గుర్తు!

తెలుగుభాష, సంస్కృతుల్ని మనసులో పెట్టుకొని 'ఆంధ్రగీతి'పేరున. ఏడు కవితల ఇంద్రధనుస్సును పూర్ణచందు సృష్టించారు.

పూర్ణచందు పరిచయం అక్కరలేని రచయిత. కవి, పరిశోధకుడు! అనేక అంశాల పైన వివిధ ప్రక్రియల్లో 150 గ్రంథాలు రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. భాషావేత్తగా తమ అనుభవాన్ని రంగరించి తెలుగుభాష ప్రాచీనత, విశిష్టత, ఒంపుసొంపులు, దీనస్థితుల్ని పలుకోణాల్లో దర్శించి ఈ 'ఆంధ్రగీతి' వెలువరించారు.

ఒక దీర్ఘకవితగా సాగిన ఈ కావ్యంలో పూర్ణచంద్రాయణం, భాషావతరణం, ఆంధ్రుల ప్రశస్తి, పలుకుబడుల పరిమళాలు, మాండలికశోభ, మినుకుపలుకులు, వాడుక భాష' అనే శీర్షికలున్నాయి.

మొదటి శీర్షిక 'పూర్ణచంద్రాయణం.'

'శ్రీగంధపు జరీ అంచులు అల్లుకుని' అంటూ, కవి శ్రీకారంతో కావ్యారంభం చేశారు.

తెలుగుదనం మెరుపుల పంచెకట్టుపైన వెన్నెలచొక్కాయి సొంపుగా తొడుక్కొని, పదబంధ పారిజాతాల తేరునెక్కి పూర్ణచంద్రుడు రావటంతో కవి ఈ కావ్యాన్ని ప్రారంభించారు. 'వెన్నెలచొక్కా' ఒక మంచి పదబంధం.

'ఆ చల్లనిరాత్రితో కరచాలనం చెయ్యటం వల్ల, తెలుగుదనం తేనెలో తడిసిన దివ్యానుభూతి కలిగిందని నవ్యభావన చేశారు.

తెలుగు వారికి మేనమామ కాబట్టి, ఆ వచ్చిన చంద్రుడికి స్వాగతాలు 'తెలుగు వర్ణమాల'తో పలుకుతున్నట్లు రచించటంలో ఆకాశంలోని చంద్రుడు అని ఒకరకంగాను, కవి పూర్ణచందు అని మరోరకంగానూ ధ్వనిస్తుంది.

'శబ్దం నుండి శాస్త్రం దాకా, / సంకేతం నుండి సంభాషణ దాకా, / బోధన నుండి భావన దాకా, / భాషా పరిణామాల తెలుగు స్వరతేజం!' అంటూ, భాషా పరిణామాన్ని అద్భుతంగా వివరించారు.

'ఆకాశానికి అక్షర మేఘమాల అల్లిన కవి'గా చంద్రుణ్ణి ఆయన భావన చేయటంలో పూర్ణచందు తన హైస్కూలు చదువుల రోజుల్లో నడిపిన లిఖిత మాసపత్రిక 'మేఘమాల'ను ధ్వనింపజేశారు.

'చంద్రమౌళికి మణిగా మెరిసిన చందమామ'అనటం ద్వారా శివుని తలమీద ఉన్న శిరోమణి అనే అర్థం ధ్వనింపచేసినా పూర్ణచందు తన తండ్రి చంద్రమౌళిగారిని స్ఫురింప చేయటం ప్రశంసనీయంగా ఉంది.

'తెలుగు దీపాన్ని అరచేతుల్లో అలంకరించుకుని,

అక్షరకాంతుల్ని అక్షయంగా వెలిగిస్తానన్నాడు...'

'విశ్వవిపంచి తంత్రులు శ్రుతిచేసి, / తెలుగురాగాలు లోకానికి పంచుతానని!'ఈ పాదాలలో పూర్ణచందు భాషకోసం తాను పడ్తున్న శ్రమను, చేస్తున్న సేవల్నిప్రపంచ తెలుగు రచయితల మహాసభలను 6 పర్యాయాలు నిర్వహించిన తీరుని పాఠకుడికి స్ఫురింపచేస్తున్నారు.

"తెలుగులో నేనూ నెలకొన్నాను....

'అ' అనే అక్షరంలో చంద్రవంకలా...!

రెండు పూర్ణబిందువులను

నా శిరసున శోభగా దాల్చాను...!" అనే చరణంలో 'అ' అక్షరాన్ని ఒక చంద్రవంకలాగా భావించటం చాలా గొప్పగా ఉంది.

ఆ చల్లని రాత్రితో చేలాగులిచ్చుకుని అనే వాక్యంలో చేలాగులిచ్చుకోవటం అద్భుతమైన తెలుగు పదబంధం. షేక్‌హ్యాండ్ అనే మాటకు క్షేత్రయ్య గారి ప్రయోగం అని పూర్ణచందుగారి వివరణ.

"మాటలే పాటలుగా వెలిగింది తెలుగుతల్లి" అనటం తెలుగు భాషలో సంగీతాత్మకతను స్పష్టం చేస్తుంది. మాతృభాషను అమితంగా అభిమానించే తమిళులు తమ సంగీత సాధనకు త్యాగరాజ కృతుల్ని ఎంచుకోవటంలోనే తెలుగు భాష ప్రత్యేకత తెలుస్తుంది. రాయప్రోలు సుబ్బారావు 'తనగీతి యఱవజాతిని పాటకులనుగా దిద్దివర్థిల్లిన తెలుగువాణి' అన్నారు కదా!

'భాషలన్నిటికి మేటి రూపమై వెలిగిన తల్లి' అనటం 'దేశభాషలందు తెలుగు లెస్స' అనే పంక్తిని గుర్తు చేస్తుంది.

'తెలుగుతల్లి నవ్వులు నదీజలాల తెలినురుగుల నర్తనం'లా భావించటం కవి భావుకశక్తిని వెల్లడిస్తుంది.

"తెలుగుతల్లి భాగ్యం కాంతుల వరదై / జగమంతా ఆమె వెలుగులతో నిండిపోతుంది' అనే ఆశాభావాన్ని ప్రకటించారు. భావాన్ని బయలుపరిచే పరాశక్తిగా అమ్మభాషను భావించిన కవి ప్రతిభ అనితరసాధ్యం.తెలుగుతల్లిని నాదసరస్వతిగా, ఏడుస్వరాల కల్పవల్లిగా, సకలకళావతిగా ప్రకటించారు.

తెలుగునేల– అక్షరాల అలకాపురి! / తెలుగు భావన మిన్నేటి మధుర గానసిరి,/తెలుగు అక్షరంతేనెలో తడిసిన ఇక్షురసం, / తెలుగు పదంపరిమళించే మరువంపు దళం' అని అద్భుతంగా, అపూర్వంగా తెలుగుని ఆయన భావించారు. 'తెలుగుతల్లిని' ఇరువది కోట్ల సంతానవతి అన్నారు. అంతేకాదు, భాషను ప్రేమించటం ఓ మహాతపస్సుగా భావించారు.

ఇప్పటి వరకూ చెప్పినదంతా స్వప్నంలో జరిగిందంటూ, కళ్లు విప్పుకు చూస్తే' ఒక మూగగొంతు. నీరు తడారి ఎండినట్లు' ఉందని ప్రకటించారు.

'మాతృభాషను మరచిన తరం వట్టి మట్టిబెడ్డలు' అన్నారు,

'అమ్మభాష అనే ఊపిరి నాళంలో అన్యభాషల కఫం కమ్ముకుం'దని ఆవేదన చెందారు.

'ప్రాచీన భాషాసాగర కెరటాలపైన తెల్లవారని తెలుగుదనం ఊయల లూగింది.' అని చెప్పటం ద్వారా మన తెలుగుకు ప్రాచీనభాషాహోదా వచ్చినా ఏ మాత్రం తెలుగు అభివృద్ధి చెందటం లేదని నిరుత్సాహాన్ని ప్రకటించారు.

తెలుగుకీర్తి రెపరెపలాడాలని భావిస్తూ, నీలాకాశంలో చంద్రబింబంలా 'అ' అక్షరం ముద్రితమైన తెలుగు పతాకం వినువీధుల్లో స్వేచ్ఛగా ఎగరాలి తళతళగా' అని ఆశించారు.

తెలుగు భాషావికాసానికి అందరూ ముందుకు సాగాలని స్వాగతిస్తూ "పోరాడితే పోయేదేమీలేదు – అన్య భాషావ్యామోహం తప్ప" అని ప్రశంసనీయంగా పలికారు.

భాషపట్ల ప్రజల్లో అభిమానం, గౌరవం పెరుగుతున్నాయని చెబుతూ, 'అమ్మపాలతో రంగరించిన భాషాప్రేమలా, జన్మభూమిపై వెలుగులు వేళ్లూనుకున్నాయి' అనటం బాగుంది.

'భాషావతరణం' రెండవ శీర్షిక.

ఇందులో భాష రూపుదిద్దుకొన్న తీరుని వివరించారు. "శ్వాసల మధ్య పెరిగే భావనల చిగురు–భాష! / ఊహల ఉరవడిలా పలుకుల ప్రవాహం– భాష! / భాషను సొంపార పెంపొనరిస్తే మన్నన మనకే, / వదిలేసి విర్రవీగితే వసివాడేది మన ఉనికే!" అంటూ, భాషకు నిర్వచనాన్ని, మాతృభాష ప్రాముఖ్యాన్ని, దాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని వివరించారు.

తెలుగు నాగరికతను "మన తెలుగునేల' సింధునగర వైభవానికి సమకాలీన నాగభూమి' అని వివరించారు

"వేదాల పునాదుల వెంటే తెలుగులు / హంసలా నడిచిన 'జ్ఞానపథ'గాములు / మాటల మార్మిక భాషాయంత్రాన్ని కదిలించే / విద్యుత్ విద్వత్తుల నుడుల చేతనలు!"అని భావన చేస్తారు.

గతం ఎంతో వైభవోపేతంగా సాగినా, వర్తమానస్థితి దీనంగా ఉందంటూ...'పాతకాలపు

మసక అద్దంలో మన ముఖంలా / నవ్వుల వెనుక నలిగిన నిస్సహాయపు నీడలా, / గడిచిపోయిన అమృతక్షణాల్ని వదిలిన చోట / ఆగిన గడియారపు ఆఖరి క్షణంలా అమ్మభాష!' అని ఆవేదన చెందుతారు.

తెలుగు, సంస్కృత భాషలు వేల సంవత్సరాల నుంచి అన్యోన్యంగా ఉన్న తీరును వివరిస్తూ,

"భారతీయ గాథలో తొలి అధ్యాయం తెలుగుజాతి! / తెలుగు,సంస్కృతమూ వేరైనా ఆత్మ ఒక్కటే... / తనదనే ప్రత్యేకతలెన్నో నిండుగ వెలిగే సుకృతి / తలదన్నే ఖ్యాతులకు చిరునామా తెలుగు సంస్కృతి' అనిభావించారు.

అక్షరాల చెట్టుకింద పరచుకున్న నీడలో తత్వజ్ఞానపు కుహరాలు ప్రవచిస్తాయనీ, వాక్యాల బీజాల్లా నాటిన ప్రతి పలుకులూ మనసులో సామగానమై మొలకెత్తుతాయనీ, అక్షరాల పల్లకిలో ఊరేగే పదపట్టపురాణి తెలుగుతల్లి' అని భావన చేస్తారీ కవి.

సంస్కృతంలోని ఘుణాక్షరన్యాయాన్ని గుర్తుచేస్తూ... "అక్షరాలు–భాషల నదీ తీరపు తడి ఇసుకలపై / ఆబగా తిరిగే నూరుకాళ్ల జీవి / ఊహల పాదాలతో వడిగా నడిచిన / అడుగుల జాడలు...అవి శబ్దశిల్పాలు!' అని వర్ణిస్తారు.మన వ్రాతకథ గీతల మధ్యగీతలా ప్రారంభమైనదంటూ,'లిపిగీతాసారం.జ్ఞానమహాసాగరం' అంటారు. దేవనాగరి అక్షరాలను వర్ణిస్తూ,

"కొమ్మలకు వ్రేలాడే తేనెపట్టులా అవుపిస్తాయి
అడ్డగీతను అంటి సాగే 'దేవనాగరి' అక్షరాలు..." అన్నారు.

ఇంక తెలుగు అక్షరాలను:"మంచిముత్యపు రాసులు దొర్లినట్టు/ సుడివేసిన గుండ్రని బొమ్మరిల్లులా/ తీరి ఉంటాయి తెలుగు అక్షరాలు/ తాళపత్రాలపై తల్లిచేతి వ్రాత ముగ్ధగీత!! అని వర్ణిస్తారు.

"ద్రావిడజనని కీర్తిగా జనించిన తెలుగమ్మ" తెలుగు భాష ద్రావిడ భాషాకుటుంబానికి చెందిందన్నారు. ద్రావిడ గుణాల పునాదులపై ఆర్యభవనాలు వెలిశాయిక్కడ' అని స్పష్టం చేశారు.

"హాలచక్రవర్తి ఆంధ్రగాథల కూర్పు / తొలి కథాసంపుటి 'గాథాసప్తశతి' నేర్పు / ప్రేమపరిణయ భావాల తొలి పరిమళం అది–'అంటూ, పల్లెజీవనంలోని గాన మాధుర్యాన్ని చాటిచెప్పారీ చరణంలో!

పాశ్చాత్య భాషావేత్తలు ఎమెనో, ఎఫ్.బి.జె. కౌపర్'లను ప్రస్తావించారు.

కృష్ణాజిల్లా ఘంటసాలలో కనిపించిన తొలి శతాబ్దాలనాటి శాసనాలలో 'భరతీయనులు' అనే పేరుని అఖండభారత భావనకు ఒక సాక్ష్యంగా పేర్కొన్నారు. "బౌద్ధ ఛత్రశాసనంపైన కనిపించింది../ 'భరతీయను'లనే తెలుగు పేరు ఘంటసాలలో! / రెండు వేల యేళ్లనాడే పరిమళించిన / అఖండభారత జయగీతికకు పల్లవిగా!" అంటారు.

క్రీస్తుపూర్వమే మనదేశంలో బౌద్ధం విరాజిల్లిందని. 'ప్రాకృత పాళీ సంస్కృతాల పల్లకీ ఎక్కి పరాయి గీతాలు పాడి పొగిడారు తెలుంగులు' అని చెప్పటం ద్వారా ఆనాటి మన

తెలుగువారి అశ్రద్ధని, ఒళ్లు బరువుతనాన్ని వివరించారు.

'తామరాకుల మాటున దాగిన చేపపిల్లల్లా/తెలుగుమాటలు అనాదరపు నీటి మూటలు!/ పరిమళించిన పదకుసుమాలన్నీ... చెట్లకింద రాలుటాకుల కసవులు!' అని ఆవేదన చెందారు.

ఇంకా తెలుగు కవుల ప్రసక్తి, సమీప భాషలతో సాహచర్యం, తెలుగులిపి పరిణామం, అంధకుల ప్రస్తావన, ఆంధ్ర శబ్ద వైశిష్ట్యం, భారత భాగవతాలు, నాట్యశాస్త్రం, మొదలైన గ్రంథాల్లో, ఆంధ్రపథం గురించిన విశేషాలెన్నో కవిత్వీకరించిన వైనం ఆశ్చర్యం కలిగిస్తుంది.

"లాటిన్, సంస్కృత భావగంగలో 'అంధ' ...

దాని భావం మానవుడని!జ్ఞాన జనుడని!

ఆంధ్రపాలజీలో 'ఆంథోస్' అంటే, మనిషి!

ప్రాకృతంలో అది 'అంధక'గా నిలిచింది"

"సంస్కృతంలో సంస్కరించి 'అంధ' అన్నారు...

ఆత్మచైతన్యంతో అదే 'ఆంధ్ర'గా వికసించింది!

కాలగర్భం లోంచి కాంతిమయోదయంలా

'ఆంధ్ర' నామమే నిలిచింది కీర్తిమయంగా!"

ఈ చరణాలు పూర్ణచందుగారి సొంత పరిశోధనాంశాలు. ఆంధ్రశబ్దానికి ఇండో యూరోపియన్ భాషల కూటమి మూలభాషలో 'అంథ్' అంటే మనిషనీ, ఆంధ్రపాలజీలో అదే ధ్వనిస్తోందని, ఇండో-యూరోపియన్ భాషలకు చెందిన వేదభాష మాట్లాడినవారు మనల్ని 'ఒక జాతీయు'లనే అర్థంలో 'అంధ' అని పిలిచారనీ, అదే సంస్కృతీకరించబడి 'ఆంధ్ర' అయ్యిందనీ ఆయన వివరిస్తారు.

మనల్ని మనం తెలుగువారిగా పిలుచుకున్నామని, 'తెల్' అనే రూపానికి తెలియజెప్పటం అనే అర్థం ఉందనీ అంటారు. ఏ మూడు లింగాలూ తెలుగు నేలకు హద్దులుగా లేవంటూ త్రిలింగ లోంచి తెలుగు వచ్చిందనే వాదనని వ్యతిరేకించారు.

'ఆంధ్రుల ప్రశస్తి' మూడవ అధ్యాయం.

'అప్పటివాడు ఆంధ్రుడు! ఉపనిషత్, బ్రాహ్మణాల నడుగు/తెలివెలుగు నుడుల నందుకుని, జ్ఞానసింధు తీరాల చేరిన తెలుగు' అంటూ సింధునాగరికత కాలానికే తెలుగువారున్నారని, ఆ నగర నిర్మాణంలో వీరూ భాగస్వాములనీ ఒక చారిత్రక ఊహను వివరిస్తారు. "ఆంధ్రజాతీయులు ఆదిజాతుల ఆరంభనేతలు/ అమరిన అమర అక్షర స్వరూప దివ్యఖ్యాతులు' అంటారు. అలాగే, 'పాళీ, ప్రాకృత, సంస్కృతుల కలయికలో వెలిగిన ఉపనిషత్తుల జ్ఞాపకాల ఆంధ్రజ్యోతులు!' అని వివరిస్తారు.

'ఆత్మబలమే ఆయుధంగా ప్రకాశించిన వాళ్లమనీ, సమరసత్వం సహజీవన సారాలను చాటిన ఆంధ్రులమనీ, బోధిద్రుమఛాయలో వికసించినజ్ఞానపుష్పాలమనీ, ఆంధ్రుల విశిష్ట

జ్ఞానసంపదను తెలియజేశారు.

"విష్ణువే ఆంధ్రుడై వెలసిన విష్ణుజాతీయులమని, ఆపస్తంభ సూత్రాల ఆచార పాలకులమని, అపరాధి కన్నకొడుకే అయినా లెక్కించని మాధవవర్మలం" అనీ ఆంధ్రుల ప్రశస్తిని చాటుతారు.

రెండువేలయేళ్ల భాషా సంప్రదాయాలతో పలుకుబడుల 'ప్రాచీని'గా గుర్తింపు తెచ్చిందని కీర్తించారు. 'అమ్మభాషకు మించిన శాంతం' లేదన్నారు. ఆనాడే ఓడ నడిపి గెలిచిన మహా నావికుడు శివకుడి పేరు ఘంటసాల శాసనాలలో స్వర్ణాక్షరాలతో లిఖించారని ఆంధ్రుల నౌకాయానాన్ని ప్రస్తుతించారు. గ్రీసు నుండి సయామ్, చైనాల దాకా సముద్రుడికి పంచెకట్టి ఆంధ్రుణ్ణి చేశారని వర్ణిస్తారు.

"వాల్మీకి మహర్షి కౌశల్యాదేవిని 'మహాంధ్రీ' అని సంబోధించాడు, శ్రీరాముడు తెలుగువారి మేనల్లుడు" అంటారు. తెలుగునాట రామాలయం లేని ఊరు లేదంటే ఈ బంధుత్వమే కారణమేమో!

'పలుకుబడుల పరిమళాలు' నాలుగవ అధ్యాయం

'ప్రతి పదమూ భాషల ఆకాశంలో మెరిసే నక్షత్రమే'ననీ, 'దివ్యతేజమై అలరిస్తుంది మనసుని' అనీ అంటారు. జీవన పథానికి అమ్మభాష దారిదీపమనీ, మన అభిమానమే భాషకు గురుత్వాకర్షణ అనీ, ప్రతి అక్షరమూ ఒక్కో గ్రహమనీ అద్భుతంగా భావించారు.

భావాల ఆత్మవిలాసం భాష అనీ, పలుకుల సంగీత విభావరి జీవితమని, శరీరానికి జీవుడిలా మనసుకు భాషే ప్రాణమని చెప్పారు. తెలుగులో అనేక భాషల పదాలు చేరాయని, ఒక భాషాపదాలు మరో భాషలోనికి చేరటం 'స్నేహపూర్వక హంసగమనం' అనీ, సముచితంగా ఆలోచన చేశారు.

దేశం విడిచి వెళ్ళినంత తేలిక్కాదు భాషను మరవటం అంటూ, మనిషికీ భాషకూ ఉన్న విడదీయరాని సంబంధాన్ని వివరిస్తారు. భాషాద్రోహులు అమ్మభాషకు ద్రోహం చేస్తున్నారని, తియ్యని తెలుగుమాటలు వారికి చేదై దూరమైపోయాయని, పదాలు పెరగటమే భాషకు ప్రాణమనీ అన్నారు.

'తెలుగు వాక్యాల తామరకొలనులో ఆంగ్లపదం సందర్శకుడుగా ఉండాలనే సంకేతంతో ఒక చక్కని భావచిత్రాన్ని అందించారు. అన్యపదాల్ని స్వాగతించాలని, అన్యపదాల స్వీకరణలో ఆంగ్లేయులే అధికులని, మనం చిల్లికుండలో నీళ్లు పడుతున్నామని, మన భాషలోకి వచ్చే పదాలు తక్కువ ...పోయే పదాలు కొల్లలుగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు.

ప్రస్తుతం తెలుగు భాషాస్థితి 'ఆసుపత్రి పడక' అయిందని, విదేశీ మోజు తెలుగుభాషకు శాపమైందని, అన్య భాషాపదాల రాకతో మన పదాలు మరుగున పడకూడదని హెచ్చరించారు. సాంకేతిక అవసరాలకు సాధ్యమైనన్ని తెలుగుపదాల్ని సృష్టించుకోవాలన్నారు.

ప్రజల వాడుకమాటలు గ్రామ్యాలంటూ ఈసడించేవి కావని, వాడుకమాటలే శాస్త్రాలకు బాంధవ్యమని, కొత్త పదాలకు నిరంతరం ఆంగ్లేయులు తలుపులు తెరచి ఉంచుతారని,

అందువలన ఆంగ్లం అభివృద్ధి చెందుతోందేగానీ అంతరించటం లేదనీ అన్నారు. మనం భాష విషయంలో తీవ్ర నిర్లక్ష్యంలో ఉన్నామని, భాషను కోల్పోతే మన సంస్కృతి మరణానికి వీలునామా రాసినట్టేనని హెచ్చరించారు.

సాంకేతిక పదాలకు సంస్కృతాన్ని ఆశ్రయించి తెలుగు అనువాదం అనటం భావ్యం కాదన్నారు. అర్థంకాని తెలుగులో అనువదించటమూ ఉపయోగం లేనిదంటూ, పరాయి పదం ఏ భాషలోంచి వచ్చినా మన భాషలో ఒదిగిపోయి, జనం నాలుకలపైన ఆడితే అది దేశీయమైన తెలుగు పదమే అని కవితారూపంలో నిర్వచించారు.

'కాలంతో కలసిన మాటలు కాలుణ్ణి దాటాయి..!/కాలానికి ఎదురీదినవన్నీ కాలగర్భంలో కలిశాయి...

పదిలపరచుకున్నవే కావ్య గర్వాలు,/మనసులో గుడి కట్టుకున్న శాశ్వత రూపాలు!' అని వివరించారు.

'మాండలికశోభ' ఐదవ శీర్షిక

'మన భాషకు ప్రాణనాడి... అమ్మ!

మన యాసకు మూలరేఖ...అమ్మ!

మట్టిబొమ్మకు గుండె నిచ్చిన దేవత...

జీవితం పాఠశాలలో తొలిపాఠం అమ్మ!' తెలుగులోని మాండలిక భాషాసౌందర్యాన్ని తెలిపారు. ఏ మాండలికానికైనా మూలం తల్లిభాషేనన్నారు. మాండలికాలు ఆయా ప్రాంతాలకు చెందినవి కావటం వల్ల ఆ పదాలన్నీ అచ్చతెలుగుపదాలే అన్నారు.

'పామరుడి పలుకే పసిడి నాణెం' అంటూ, మాండలిక పద ప్రాధాన్యాన్ని స్పష్టం చేశారు.

'మాండలికం మట్టి పరిమళాల వాహకం' అన్నారు, 'ప్రజలమాటే కవితకు లోతైన చూపు' అని మాండలిక వైశిష్ట్యాన్ని వివరించారు.'కవితకు అసలు సొబగు మాండలికం' అనీ, భాషాస్రవంతిలో మాండలికం ఒక వాగు' అనీ, అందరినీ ఒక తాటిన నడిపేది పల్లెపలుకుల మాండలికమేననీ పరిశీలనాత్మకంగా ప్రకటించారు.

"మినుకుపలుకులు-పారిభాషిక పదాలు"

ఇది ఆరవ అధ్యాయం. ఇందులో సైన్సుకి సంబంధించిన విషయాలను కవితాత్మకంగా వివరించారు:

సైన్సు అనే పదానికి తెలుగు సమానార్థకం లేదనటాన్ని, సైన్సుకి తెలుగు చాలదనటాన్ని ఆయన ఖండించారు. మౌలికంగా సైన్సు రచయిత అయిన పూర్ణచందు సైన్సు రచనలను తెలుగులోకి తెచ్చేందుకు అనేక సూచనలు చేశారు. పారిభాషిక పదాల్ని 'మినుకుపలుకులు' అనటం బావుంది. సాంకేతిక పదాలకు తెలుగుమాటల్ని సూచించిన ఆదిభట్లవారిని స్మరించారు.

'ఇంగ్లీషు అరువు కొత్త కాదు / సంస్కృతపు తేనెరుచి తెలియంది కాదు / మన మాటలే మన బలం / మన భావాలే మన ధనం' అని గ్రహించాలని సూచించారు. తల్లిభాషలో

పరిభాషను ప్రసరించే భాషాసాంకేతికత పెరగాలన్నారు. నిరంతర అన్వేషణ సాగాలన్నారు.

పదసంపద నిర్లక్ష్యం వద్దన్నారు. 'భాష తలవంచితే జ్ఞానం పుడుతుందా?' అని ప్రశ్నించారు. 'తల్లిమాటలు తరిగిపోతే మేధాతరిగినట్టే!' అన్నారు.

'ఎరుకలో మెరిస్తే అది 'మినుకు ఎరుక'/శాస్త్రానికది తల్లిమాట పరిమళం!' అంటూ, మినుకు ఎరుకలంటే శాస్త్రపరిజ్ఞానం అని వివరిస్తారు. 'మినుకుపలుకుల గుట్టువిప్పితే / శాస్త్రజ్ఞానం కట్టలు తెంచుకుంటుంది!' అని అంటారు. తెలుగులో 'మినుకు ఎరుక (శాస్త్ర పరిజ్ఞానం)' తేలికై నడవాలన్నారు.

పాలలో మజ్జిగ చుక్కలు కలిపి తోడుపెట్టడాన్ని కవిత్వీకరిస్తూ, 'క్షీరకన్యకు చల్ల పురుషుడితో పెళ్లి / నవదంపతుల నవ్యశోభనం– పెరుగు !' అంటూ అద్భుతమైన భావుకతని ప్రదర్శిస్తారు. పాశ్చురైజేషన్ అని పాశ్చాత్యులు అంటున్నది తెలుగువారికి అనాదిగా ఆచారంగా ఉందంటూ, జీరో బాక్టీరియాగా కాచిన పాలకు ఆనవాలు అనే తెలుగు పేరున్నదన్నారు. రాయలవారు చిరువాలు అనే ప్రయోగం చేయటాన్ని గుర్తుచేశారు. ప్రతీ తెలుగుపదం వెనుకా ఒక శాస్త్రం, ఒక చరిత్రా ఉన్నాయని ఘంటాపథంగా చెప్పారు.

'పారిభాషికాలకు పరభాషే దిక్కు' / నిన్నటి మాట అది! / 'సాంకేతిక యుగాన అది అమ్మభాష హక్కు' / ఈనాటి ఉద్యమం ఇది!' అని ఈ కవి ఒక భాషాసైనికుడిగా ప్రకటించుకున్నారు. ఒక విధంగా ఈ కావ్యం 'భాషోద్యమ వాణి'గా చెప్పుకోవాలి.

"అధికారభాష' ఏడవ అధ్యాయం.

ఇది "ఆంధ్రగీతి" లో అతిముఖ్యమైన అధ్యాయం. 1795 లోనే మచిలీపట్టణం కలెక్టర్ జె ర్యాంఘాం అర్జీలన్నింటినీ తెలుగులోనే ఇవ్వాలనే నిబంధనని పెట్టినట్టు పూర్ణచందు పరిశోధించి చెప్పారు.

"తల్లిపాలు తాగిన వాడు/తెలివి తేటల వెలుగు రేడు...,

పోతపాల బతుకు / పరాయి కంచంలో ఎంగిలి మెతుకు!" ప్రాధమికవిద్య అమ్మభాషలో జరిగితే పిల్లల తెలివితేటలు మరింత పెరుగుతాయనే యునెస్కో సూచనను ఈ చరణంలో గుర్తు చేస్తారు. పొట్టి శ్రీరాములు అసువులు బాసిన ఆంధ్రోద్యమాన్ని ప్రస్తావిస్తూ భారతదేశంలో భాషాదీపకాంతులు ఆంధ్రలోనే తొలిగా వెలిగాయన్నారు.

తెలుగుతల్లిని స్తుతించిన కవుల్ని ప్రశంసించారు. ప్రభుత్వాలు భాషాభివృద్ధికి ఖాళీచేతులు చూపిస్తున్నారని, అమ్మభాషతో బాటు అన్యభాషలూ నేర్చుకోవాలని. కవితాకౌశలం అమ్మభాషతోనే అలవడుతుందని, జానుతెనుగు, నాటుతెనుగుప్రతి మదిలో నిలిచి తేటతెనుగుల కాంతి జగమంతా విస్తరించాలన్నారు.

"భాషలలో మేటి తెలుగు వాడికి తెలుగే! / తెలుగే ఎందుకంటే తెలుగులో పుట్టావు కాబట్టి!

ఏ భాష మాటలాడినా నువ్వు తెలుగు వాడివే! / తెలుగొక్కటే మనసుని వికసింప చేసేది సానప!!"

"ఇన్ని భాషలు మాట్లాడుతున్నా ఇంకా అర్థం కాలేదా'/ అమ్మభాషలోనే గ్రహింపు అధికం అని!

సహజ పరిమళం అమ్మదనానికే ఉంటుంది / మాతృభాషే మహనీయం మనిషికి!"అంటూ తనదైన బాణీలో తెలుగుభాష గొప్పదనాన్ని అమ్మభాష ప్రాముఖ్యాన్నీ ఈ రెండు చరణాల్లో నొక్కి చెప్పారు కవి పూర్ణచందు.

"నమ్మకంగా నడిపించిన తల్లిని / నాలా కాపాడే దెవరామెని!

ఒక్క మాటైనా బతికితే చాలును, / ఆమె ఉనికి నూరేళ్లూ నిలిచి తీరును!" అని ఈ కావ్యానికి ఆశావాదంతో ముగింపు పలికారుకవి.

సప్తశీర్షికల సమాహారమైన ఈ దీర్ఘకవితకు ""ఆంధ్రగీతి""అనే పేరుపెట్టటం చాలా సముచితంగా ఉంది.

ఆంధ్రభాష ప్రాచీనత, శాసనాల్లో కావ్యాల్లో దాని ప్రసక్తి, ప్రజావ్యవహారంలో భాష సాగిన తీరు, దేశాంతరాల దాకా పాకిన వైనం, తెలుగువారి లలిత కళాప్రావీణ్యం, భాషోద్యమాలు, వివిధ ప్రాంతాల్లో తెలుగు పలుకుల తీరుతెన్నులు, తెలుగులో పారిభాషికపదాల రూపకల్పన ఆవశ్యకత, అధికారభాషగా తెలుగు సరైన ఫలితాన్ని సాధించలేకపోయిన విషయాలు...ఇలా ఎన్నెన్నో తెలుగు భాషకు సంబంధించిన అంశాల్ని పరిశోధనాత్మకంగా కవిత రూపంలో చెప్పటం విశేషంగా ఉంది.

డా॥ జి.వి. పూర్ణచందు 150కి పైగా వ్రాసిన పుస్తకాలన్నీ ఒక ఎత్తు అయితే ప్రస్తుతం వెలువడుతున్న ఈ 'ఆంధ్రగీతి' ఒక్కటీ ఒక్క ఎత్తు. భాషాపరిశోధకుడూ, భాషోద్యమ కార్యకర్తా కావటం వలనే పదికాలాలపాటు నిలిచే రచనగా ఇది రూపొందింది!

భావనలోనూ, భాషాప్రయోగంలోనూ, ఆలంకారిక పదవిన్యాసంలోనూ ఒక కొత్త పూర్ణచంద్రుడు ఈ కావ్యంలో కనిపించాడు. ఎన్నెన్నో భావచిత్రాలు పరిమళించాయి. తెలుగు అక్షరాన్ని కూర్చి, "తెలుగుకూ అక్షరరూపం దక్కింది-ప్రతి అక్షరం బంతిపువ్వైమురిసింది-గుండ్రటి ముత్యంలా మురిపించే ఆకృతులతో/ వయ్యారపు వలయాల వ్రాతగా అవతరించింది" అని అద్భుత భావన చేశారు. ప్రపంచ భాషల్లో అందమైన లిపులు కలిగిన భాషల్లో మనది ద్వితీయ భాష అనే విషయాన్ని స్ఫురింపచేశారు.

"ఆంధ్రగీతి"లో అలవోకగా అలంకారాలు అమరిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది.

"మాటల మార్మిక భాషాయంత్రాన్ని/కదిలించే విద్యుచ్ఛేతనలు తెలుగునుడులు" ఈ పంక్తుల్లో భాషకు యంత్రానికి అభేదం చెప్పారు. భాష పరిణామశీలం ఎప్పుడూ కదులుతూ ఉంటుంది. అలాగే, యంత్రం కూడా తిరుగుతూ ఉంటుంది. ఈ భాషా యంత్రం కూడా మార్మికమైనది. అంటే నర్మగర్భంగా ఉంటుంది. దీన్ని తెలుగునుడులు అనే విద్యుచ్ఛేతనలు కదిలిస్తాయని అపూర్వభావన చెయ్యటం వల్ల ఇది రూపకాలంకారం.

"పదకుసుమాలు ఆమె జడలో అలంకారాలు/ వాక్యసింహాసనంపై ఆమె విలాసగర్వాలు" ఇక్కడ'పదం' అంటే శబ్దం ఉపమేయం. దీనికి ఉపమానంగా కుసుమాల్ని స్వీకరించారు.

ఉపమాన ఉపమేయాలకు అభేదాన్ని పాటించారు. కుసుమాలు పరిమళించి, అందాన్నిపెంచినట్టే, పదాలు కూడా సుమధుర భావాల సువాసనలు వెదజల్లుతూ తెలుగుతల్లి జడలో అమరాయట!

'వాక్యాల సింహాసనం'– ఇక్కడ వాక్యాలు ఉపమేయం, సింహాసనం ఉపమానం. వాక్యాలకు సింహాసనానికి అభేదాన్ని పాటించారు. సింహాసనాన్ని అధిష్ఠించిన తెలుగుతల్లి విలాసగర్వంతో వెలుగొందటం లాంటి ఆలంకారిక వాక్యాలు ఈ కావ్యంలో పరిమళాలను ప్రవహింపచేస్తున్నాయి.

పూర్ణచందు వచనకవితా పితామహుడైన కుందుర్తి శిక్షణలో పెరగటంవల్ల ఆయన లాగానే రూపకాల్ని కుప్పలు పోశారు. అంత్యప్రాసలు అలవోకగా ప్రయోగించారు. భావాలకు నవ్యతనిచ్చారు. కొత్త పదబంధాల్ని సృష్టించారు. 'చప్పుడించిన', 'మౌనించిన', 'స్వరజిమ్మే', 'ఎగసెత్తే', 'వెర్రివీచే, జ్ఞానశవం', 'పద్యాలపటం, కాంతించిన', అక్షరించిన, వలయిస్తుంది... లాంటిసొగసైన తెలుగు పదబంధాలెన్నింటినో సందర్భంలో ఇమిడిపోయేలా ప్రయోగించారు పూర్ణచందుగారు.

"అహమహమిక', 'రాతిరాత్రి', 'ఘటాఘటి', కదల్చలేని కాణాచి', ఆకాశపంచాంగం' అకాల కూష్మాండ నిరర్థకులు', 'కొక్కిరిబిక్కిరికూతలు', 'ఎండలోని నీడ', 'ఒత్తి గొట్టానబెట్టు', 'కుల్లాయిగబ్బాయి', 'పసదనం' 'ఈసు', 'ఆతల నుండి ఈతలదాకా', 'అల్లారుబెల్లం', 'పాచిపెత్తనం', 'అనర్గళగళం', 'తీర్థకాకాలు' ఇలా ఏరితే యాబైకి పైగానే వాడకంలోలేని పదబంధాలను అది తన నియమంగా వాడి చూపించారాయన.

ఈ కావ్యానికి లక్ష్యప్రస్తావనగా కవి వ్రాసిన ఉపక్రమణిక కూడా పద్యాల రూపంలోనే వుంది. తెలుగులోనే శాస్త్రవిజ్ఞానం వికసించే వేళ ఇదనీ, సాంకేతికతతో కొత్త యుగగీతం– తెలుగులో 'పలికే' విజయ సంకేతం" అనీ, వివరిస్తారు. 'మాట్లాడేందుకు ఉపయోగపడిన మాటలే దేశ్యం/వివిధ దేశజనులకూ అర్థమయ్యే మాధుర్యం / వినసొంపుగా మనసులో జీర్ణమయ్యే పదం / మన భాషలో ఇమిడిపోతే అదే నిజమైన దేశ్యం!' అంటూ విన్నకోట పెద్దన వాక్యాల్ని ఉదాహరించారు. ప్రజల నాలుకలపైన ఆడే పదాలన్నింటినీ తెలుగు పదాలుగా స్వీకరించి భాషను పెంపుచేసుకోవాలని సూచించారు. "సామాన్యుడి పలుకే ఆంధ్రమిది సత్యం" అన్నారు. తాను పాడిన 'ఆంధ్రగీతి'వాడుక భాష 'పరికాపు'కు సంబంధించినదనీ, కావ్యభాష అయిన తెలుగుకు వచ్చిన తక్షణ ముప్పేమీ లేదని వాడుకభాషనే పరిరక్షించుకోవటానికి ఉద్యమించాలనే సందేశంతో తాను ఈ కావ్యరచనకు ఉపక్రమించినట్టు ఇందులో చెప్పుకున్నారు. 'ఆంధ్రగీతి' ఒక ఆత్మగర్వంగా చాటుకున్నారు.

'ఆంధ్రగీతి' ఇప్పటికిప్పుడు రచించింది కాదు. దశాబ్దాలుగా వారిమదిలో మెదలిన, మెరుస్తున్న భావాలకు ఆకృతి ఇది.

ఈ కృతి ఆంధ్రత్వవిజ్ఞానసర్వస్వం !
తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక !!
దీర్ఘకవితల తోటలో పరిమళించిన భాషాపుష్పం...
జగమంతా పరివ్యాప్తమైన కవితాసుగంధం... !



సప్తస్వరాలు పల్లవించిన ఆంధ్రగీతి

ఆచార్య **మాడభూషి సంపత్ కుమార్**

సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

ఆంధ్రత్వమాంధ్ర భాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయ్య దీక్షితులు తెలుగు గొప్పతనాన్ని తెలియజేశారు. తెలుగు వారుగా పుట్టడం, తెలుగు బాష మాట్లాడే అవకాశం లభించడం మనం చేసుకొన్న తపస్సు ఫలితం తప్ప ఊరికే రాలేదని అన్నారు. చాలామంది తెలుగు భాష ఔన్నత్యం గురించి చెప్పారు. అటువంటి భాష ఈ రోజు కనుమరుగై పోయే స్థాయికి చేరడం మన దురదృష్టం. తెలుగు భాష గొప్పతనాన్ని ఎంతమంది ఎన్ని రకాలుగా కీర్తించినా తెలుగువారు మాత్రం తెలుగు భాషను ప్రేమించలేకపోతున్నారు. తెలుగు భాషకోసం అనేక విధాలుగా సేవ చేస్తున్న వారిలో మొదటి వరుసలో ఉన్నవారు డాక్టర్ జి.వి.పూర్ణచందు గారు.

డాక్టర్ జి.వి.పూర్ణచందుగారు వృత్తిరీత్యా డాక్టరు. అయితే ఆయన ప్రవృత్తి మాత్రం తెలుగు బాషా సేవ, స్వతహాగా కవి, కవితా ఉద్యమకారుడు, సహజంగా బాషాభిమాని, భాషోద్యమకారుడు. స్వాభావికంగా కార్యకర్త, తెలుగు కార్యక్రమ నిర్వహణాదకుడు. ప్రకృతి సిద్ధమైన ఈ గుణాలవల్ల ఆయన రచయితగా మారడమన్నది కూడా స్వతస్సిద్ధంగానే జరిగింది.

విభిన్న ప్రక్రియల్లో, విభిన్న విషయాలకు సంబంధించి నూటయాభై గ్రంథాలకుపైగా వెలువరించారు. వీటిలో కవిత్వం, నవల, చరిత్ర, జీవిత చరిత్ర, ఆహారం ఇత్యాది అంశాలతోపాటు భాషకు సంబంధించిన వివిధ కోణాల్లో వెలువరించిన గ్రంథాలు అనేకం ఉన్నాయి. తెలుగు భాషమీద ఉన్న గౌరవం, అభిమానం ఆయనచేత భాషకు సంబంధించిన అనేక కార్యక్రమాలు చేయించడంతో పాటు అనేక గ్రంథాలను కూడా రాయించింది. అందువల్ల ఆయనకు తెలుగుభాషతో సహవాసమనేది సహజసిద్ధమైంది. సమృద్ధమైంది. గత అర్ధశతాబ్దంపైగా తెలుగు భాషతో ఆయనకున్న సాన్నిహిత్యం ఇప్పుడు మన చేతిలో ఉన్న 'ఆంధ్రగీతి' గ్రంథాన్ని రాయించింది.

ఆంధ్రమాతను కీర్తిస్తూ ఇప్పటికి చాలామంది కవితలు రాశారు. విశ్వనాథ సత్యనారాయణ 'ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషము', రాయప్రోలు 'ఆంధ్రావళి', మధునాపంతుల 'ఆంధ్రపురాణము, ఇంకా ఇతర పేర్లతో తెలుగును, తెలుగువారిని కీర్తిస్తూ అనేక కవితలు వచ్చాయి. కానీ వాటన్నిటికన్నా భిన్నమైంది మనచేతిలో ఉన్న ఆంధ్రగీతి'.

ఇది దీర్ఘకవిత, మిగిలినవి చాలా వరకు కవితా ఖండికలే. వాటిలో ఆయా కవులు చెప్పింది. చెప్పగలిగింది చాలా స్వల్పమే. 'ఆంధ్రపురాణము' కావ్యమైనా అది ప్రాచీన కావ్య

పద్ధతిలో రాజుల పేర్లతో రాసిన కవిత్వం. అందుకే దానికి పురాణమని పేరు పెట్టారు. తెలుగు కీర్తిని కీర్తించినవాళ్ళు చాలామంది ఉన్నారు. వీటికి భిన్నంగా సమగ్రంగా వెలువడిన గీతం 'ఆంధ్రగీతి'.

'ఆంధ్రగీతి' కేవలం కవిత్వం కాదు. గాన యోగ్యమైన గీతం. తెలుగు గీతం. తెలుగువారి గీతం, తెలుగు భాషా సాహిత్యాల కీర్తనా గీతం, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి, తెలుగుకు సంబంధించిన సమస్త విషయాలను కీర్తించిన గీతం. దశబ్దాలపాటు తెలుగు మీద చేసిన పరిశోధన ఫలితంగా వెలువడిన గీతం. ఇదొక సైన్స్ గీతం. ఇందులో శాస్త్రీయమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. సప్త స్వరాలలా సప్త అంశాలతో కూడిన కావ్యం ఇది.

పూర్ణచంద్రాయణం, భాషావతరణం, ఆంధ్రప్రసస్తి, పలుకుబడుల పరిణామాలు, మాండలిక శోభ, మిణుకు పలుకులు, అధికార భాష ఇలా సప్త స్వరాలతో పల్లవించిన ఆంధ్రగీతి ఇది.

భాష పుట్టుక, ద్రావిడార్య మేలు కలయిక ద్వారా తెలుగు ఎలా ఆవిర్భవించింది మొదలైన శాస్త్రీయాంశాలను భాషావతరణంలో కవితా రూపంలో వివరించారు. రామాయణ మహాభారతాలనుంచి, మనుస్మృతి, నాట్యశాస్త్రం ఇలా అనేక ప్రాచీన గ్రంథాలనుంచి ఆంధ్రుల ప్రశస్తి, ప్రసక్తి ఏ విధంగా ఉందన్న విషయాలను కవితారూపంలో వివరించడం కవిత్వం మీద ప్రేమ ఉన్న వాళ్ళకు, కవిత్వం మీద పట్టు ఉన్న వాళ్ళకు మాత్రమే సాధ్యమైన విషయం.

'అటు పుటు రటు' పదాలకు లోతైన అర్థాల నిచ్చారు కవిత్వంలోనే. వాల్మీకి కౌసల్యను 'మహేంద్రి' అని సంబోధించాడు రామాయణంలో, దాని ఆధారంగా కౌసల్యకు పుట్టినిల్లు ఆంధ్ర అని, రాముడు ఆంధ్రులకు మేనల్లుడని ఒక కొత్త విషయాన్ని తెరపైకి తెచ్చారు. రవి కాంచని చోటును కూడా కవి కాంచునంటే ఇదే. పలుకు బడులను గురించి చెబుతూ...

"అచ్చ తెలుగు విడిచి ఆంగ్లానికే పిలుపు,

ఇంటి అలి విడిచి వెలయాలి. వలపు" అని మనం ఎటు పోతున్నామో దానివల్ల కలిగే అనర్థ మేమిటో చెప్పారు. ఇతర భాషలను కలుపుకోవడం వల్ల కలిగే లాబాలను చెబుతూ అదే సమయంలో వికృతమైన ఆంగ్లమోహాన్ని నెత్తికెత్తు కోవడంవల్ల కలిగే అరిష్టాలను కూడా చెప్పారు.

విన్నకోట పెద్దన 'ఏది దేశ్యం' అనే విషయం గురించి చెప్పిన నిర్వచనాన్ని కవితీకరించి తన కావ్యానికి అదే సిద్ధాంతంగా చెప్పుకున్నారు డాక్టర్ పూర్ణచందు. మన ప్రజల వాడకంలో ఉండి, అవి ఇతర దేశాల వారికి కూడా అర్థమయ్యేలాగా, వినసొంపుగా ఉంటే, భాషలో జీర్ణమై ఇమిడిపోతే, అది ఏ దేశ పదమైనా దేశ్యంగా స్వీకరించవచ్చునేది కవి భావన.

అచ్చమైన, ద్రావిడభాషాజన్యమైన కావ్యభాషని తెలుగు అనీ తద్భవాలు తత్సమాలు అన్నీ కలగలిసిన వాడుక భాషని ఆంధ్రం అని పూర్ణచందుగారు ఈ 'ఆంధ్రగీతి' ప్రస్తావనలోనే తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ప్రమాదంలో ఉన్నది ఈ ఆంధ్రభాషేనని, భాషను పెంపు చేసుకోవటానికి

సంస్కృతంలో నుంచి వచ్చిన పదాలే కాకుండా ఇతర భాషల్లోంచి వచ్చిన అన్యదేశాల్ని కూడా స్వీకరించాలని, వాటిలో మన భాషలోకి ఇమిడిపోయే వాటిని దేశ్యంగా ప్రకటించాలని పూర్ణచందుగారు ఈ ఆంధ్రగీతికి వారు వ్రాసిన ప్రస్తావనలో కోరారు.

రైలొచ్చింది, రోడ్డేశారు లాంటి ప్రయోగాలు తెలుగు ప్రజల నాలుక పైన సహజంగా అడుతున్నాయి. అయినా మన పండితులు ఇంకా వాటిని అన్యదేశ్యాలుగా దూరంగా ఉంచాలని చూస్తున్నారు. కొందరైతే, వాటికి తెలుగులో పదాలను వండాలని ప్రయత్నించి ఎవరికీ అందని, అర్థంకాని పదాలను సృష్టించాలని ప్రయత్నిస్తున్నారంటూ, తీవ్రంగానే తప్పుపడుతున్నారీ కవి! బస్సు, రైలు, కారు, కంప్యూటర్ వాడుకలో రోజు నలుగుతున్న మాటల్ని విస్మరించడాన్ని అయిన ఖండిస్తున్నారు. మనవి కాని వాటిపైన మన పెత్తనం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక పదాలకు తెలుగు అనువాదం దేనికని, చివరికి సంస్కృతాన్ని ఆశ్రయించి తెలుగుకు దూరం చేస్తున్నారని ఆక్షేపించారాయన.

వెన్నెముక గల ప్రాణులు, వెన్నెముకలేని ప్రాణులు అనకుండా, సకశేరుకములు, అకశేరుకములు అని అనువదించి తెలుగు మాధ్యమం పాఠ్యపుస్తకాలను భ్రష్టు పట్టించారన్నది ఆయన ఉపన్యాసాల్లో వినిపించే విషయమే. చదువు రానివాడు పైవంతెన అంటే చదువుకున్నవాడు ఊర్ధ్వవారధి అంటాడని అనువాదాలకు సంస్కృతాన్ని ఆశ్రయించటాన్ని కవి ఆక్షేపించారు.

ప్రతి ఏడాది ఆక్స్‘ఫోర్డ్ ఇంగ్లీష్ నిఘంటువు కనీసం 10 పదాలు అయినా ఇతర భాషలలోంచి స్వీకరించి ఆంగ్లాన్ని పెంపు చేసుకొంటోందని మెచ్చుకున్నారు. మన పండితులు మన వాడకంలో ఉన్న ఇతర భాషా పదాలను దూరం చేసుకోవటమే భాషాభిమానం అంటున్నారు. ఇది భాష పురోభివృద్ధికి తోడ్పడే అంశంగా డాక్టర్ పూర్ణచందు అంగీకరించలేదు. ఒక్క ఇంగ్లీష్ మాట కూడా లేకుండా వాక్యాన్ని రాయండి అనే వాళ్ళని ఒక్క సంస్కృత పదం కూడా లేకుండా ఎన్ని వాక్యాలు రాయగలరని ప్రశ్నిస్తున్నారు.

“తెలుగు తాంబూలంలో ఆకు వక్క సున్నంలా మనవైపోయిన మాటలే మన సుగంధాలు” అని సుత్తి మెత్తగా హితవు చెప్పారు.

“పలుకుల్లో పూసిన పరదేశపు రజనీగంధాలు మన మట్టిలో అరవిరిసిన బొప్పాయి అనాసరసాలు వాడుకలో మెరిస్తే అవి తెలుగు నక్షత్రాలు” అని వివరిస్తారు. పపాయా తెలుగులో బొప్పాయి అయింది. బతావియా దీవి నుండి ఒక రకం పండ్ల విత్తనాలను తెచ్చి ఆంధ్రదేశంలో పాలకొల్లులో రైతులకు ఇచ్చి పండింప చేస్తే కాసిన బతావియా పండ్లు తెలుగు జన వ్యవహారంలో బత్తాయి పళ్ళు అయ్యాయి. ఈ భాషా చారిత్రక విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, “ఇవి మన మట్టిలో అరవిరిసినవని వాడుకలో మెరిస్తే అవి తెలుగు నక్షత్రాలు అవుతాయని” ఆయన వివరిస్తారు.

పదాలని ఇలా కలుపుకొని మనవి చేసుకోగలిగే చాతుర్యం కావాలన్నారు. అలాగని పూర్ణచందు గారు అన్యదేశ్యాలతో తెలుగు భాషని కలుషితం చేసేయటాన్ని సమర్థిస్తున్నారని

కాదు. ఆయనకు అన్యదేశ్యాల పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. ఏ పదాన్ని ఎంతవరకు స్వీకరించాలో ఆయన వివిధ పత్రికలలో సొగసైన తెలుగు పేరుతో రాస్తున్న వ్యాసాలే సాక్ష్యం.

"పలుకుబడుల పట్టాల మీద ఇప్పుడు పరాయి పదాల రైలుబండ్ల చప్పుడు పొగలు కక్కుతూ ధూళి లేపుతూ ఉల్లుకుట్టు పలుకులు తిక్కరేపుతూ" అనే పద్యం ఇతర భాషా పదాల పట్ల ఆయన దృక్పథాన్ని చాటుతుంది. అవసరం లేకపోయినా ఆంగ్ల పదాలను వాడటాన్ని ఆయన ఏమాత్రం అంగీకరించరు. "టెంపుల్ కి వెళ్లి కోకోనట్ బ్రేక్ చెయ్ " లాంటి మాటల్ని ఆయన ఉల్లుకుట్టు పలుకులని అవి తిక్కరేపుతాయని ఈసడించారు.

"ఎక్కడి వాడు ఆంధ్రుడు... ఉపనిషత్తులు బ్రాహ్మణాల నడుగు

తెలివెలుగు నుడులందుకుని జ్ఞానసింధు తీరాలు చేరిన తెలుగు" అంటూ తెలుగు ప్రాచీనతను అయన చాటుతారు. ప్రాచీన యుగాలలో తెలుగు భాష దుస్థితిని వివరిస్తూ...

"ప్రాకృత పాళీ సంస్కృతాల పల్లకినెక్కి

పరాయి గీతాలు పాడి పొగిడారు తెలుంగులు

తరతరాల కావ్య కల్హారాలకెక్కని తెలుగు

స్వాభిమానం కోల్పోయిన జాతీయత అది" అని తన ఆవేదనను ప్రకటిస్తారు.

భాషా సౌర వ్యవస్థ గురించి ఆయన రాసిన పద్యాలు నవ్యనూతనంగా ఉన్నాయి.

"ఆకాశ మండలం ఇరుసుమాను

అంటుకుని తిరిగే తిరుగుడు రాయిలా

అక్షరాల పరిభ్రమణం అది భాషాకర్షణ

భాషను చుట్టుకున్న బ్రహ్మాండవలయాలు" అంటారు. భాషా సౌర వ్యవస్థ అనే ఒక కొత్త ఆలోచన చేస్తారీ కావ్యంలో కవి

వాక్యాలు శబ్ద గోళాలై మెరిసిపోతున్నాయి తాత్త్విక గమనానికి వాలురెక్క"లా! హరిత కాంతులు విరజిమ్ముతున్నదంటే, గ్రీన్ సిగ్నల్ పడిందని!

తల్లి గర్భంలో నాలుగవ నెలలోనే బిడ్డకు హృదయం ఏర్పడుతుందని ఆ గర్భస్థ శిశువు అప్పటినుండే తల్లి మాటలను ఆకళింపు ప్రారంభిస్తాడని, కాబట్టి బిడ్డ మనసు మాతృభాషలోనే రూపొందుతుందని ఒక సిద్ధాంతాన్ని పూర్ణచందుగారే విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ విషయాన్ని కవిత్వీకరిస్తూ ఆయన ఇలా అంటారు....

"తల్లి గర్భాన ఉమ్మ నీటిలో ఎదిగే శిశుహృదయాలలోనే విలాసంగా ఎదుగుతుంది భాష...ఎండలోని నీడలా మమకారం" అని! బిడ్డ మనసు ఎదగటానికి తల్లి మమకారం ఎండలోన నీడ లాంటిది" అనటం ఒక అద్భుతమైన ఉపమానం. తల్లి గర్భంలో ఉమ్మ నీటిలో ఎదిగే పాపాయి హృదయంలోనే అమ్మ భాషలో విలాసంగా ఎదుగుతుందనటం నిజంగానే విలాసవంతంగా ఉంది.

పుట్టాక మనిషి శరీరం ఎదిగినట్టే భాషా శరీరం కూడా ఎదుగుతుందని పూర్ణచంద్ గారు సూత్రీకరించారు.

"శబ్దాలే శ్వాసలు, పదాలే నాడీ ప్రవాహం,

వాక్యాలే రక్తకణాలు, భావాలే రసధాతువులు,

భాషాశరీరం సజీవ భావరూపం,

ప్రతి పదము ఓ హృదయగానం"

"భాషా శరీర రచనలో పదాలు పదబంధాలు

దట్టంగా అల్లుకున్న నాడీజాలాలే అన్ని"

"తెలుగు తల్లి ఒడిలో తల పెట్టుకుని చరిత్ర సేదతీరింది",

"దాపురించిన ఆకురాలు పాడుకాలాన ఒక్కో పదము ఒక్కో శతాబ్దంలా రాలుతోంది."

"ఈ పుడమి చల్లని కడుపులో దాగిన పద సంపదలు ఎన్నో

మాటల మడిలో విరిసిన పచ్చని పలుకుల పరిమళాలెన్నో"

"కనురెప్పల పొలం గట్ల మీద కాసిన కలల దోసపండ్లు మాండలికాలు",

"మాటల చెట్టుకి అక్షరాల విత్తనాలు" ఇలాంటి వెంటాడే వాక్యాలు ఆంధ్ర గీతినిండా కుప్పలుగా కనిపిస్తాయి.

భాషను కాపాడుకోవడంలో మనం ఆచరణాత్మక దృష్టిని అలవర్చుకోలేకపోతున్నాం అనేది కవి ఆవేదన.

"తెలుగు భాష ఆసుపత్రి పడక" అంటూనే, మారే కాలానికి మారని మన తత్వం భాషా పరిణామాలను పట్టించుకోని పాపం విదేశీ మోజు భాషకు అసలు శాపం" అంటారాయన.

వాడుక యోగ్యమైన పదాలు ఏ భాషకు చెందినవైనా సరే మన ప్రగతికి తోడ్పడే వైనప్పుడు మనస్ఫూర్తిగా స్వాగతించాలని ఆయన సూచిస్తున్నారు.

"దడి కట్టి భాషను దాస్తారెందుకు? నుడి వెలుగులు నింపే శాస్త్ర పదాలను అంటరాని వంటారెందుకు? భాషకు తాళాలు వేస్తారెందుకు?" అని ప్రశ్నిస్తున్నారు కవి.

"బార్లీకి తెలుగు పేరు ఉన్నదా? మనదిగా చేసుకుంటే అది భాషాపరాజయం కాదు భావవ్యక్తీకరణ పరిపక్వత" అన్నారు. నిజమే బార్లీని తెలుగులో ఏమని పిలవాలి? యవధాన్యం అనేది సంస్కృత పదం, బార్లీ ఆంగ్ల పదం. ఋగ్వేద కాలం నుండి మనకు వాడకంలో ఉన్న బార్లీ భారతదేశానికి సొంత పంట. తెలుగువారికి కూడా చిరకాలంగా బార్లీ వాడకంలో ఉంది. కానీ తెలుగు పేరు లేదు. ఉండేదేమో తెలీదు. అది లుప్తం అయిపోయి ఉండవచ్చు. ఇప్పుడు బార్లీని మనం మన ఆహార పదార్థాలలో కలుపుకున్నట్లే బార్లీ అనే పేరును కూడా కలుపుకుంటే దాన్ని భాషా పరాజయంగా భావించవద్దని హితవు చెప్పారు. భాషను పెంపు

చేసుకోవడం మీద దృష్టి సారించాలని ఆయన కోరుతున్నారు.

"కొత్త ఉపకరణాల రాక... సరికొత్త మాటలకు శోభ !

పరిశ్రమల ఊపుకు సాంకేతిక పదాలే శ్వాస-ఆశ !

తలుపులు తెరుచుకుంటున్నాయి విశ్వమంతా

అన్యపదాలకు అప్రకటిత స్వాగత లేఖలు" సాంకేతికత దూసుకుపోయే వేగయుగం ఇదని, తెలుగులో సాంకేతిక పరికరాలు పనిచేస్తేనే మనుగడ అని, కొత్త పరికరాలకు కొత్త పద్ధతులకు చాలినంతగా మన మాటలు శబ్ద సత్యమై రాజ్యమేలాలని ఆయన ఈ కావ్యంలో ఆకాంక్షించారు. ఒక కొత్త పరికరం లేదా ఒక కొత్త పద్ధతి ఆవిష్కరణ అయినప్పుడు చాలినంతగా మన మాటలు శబ్ద సత్యమై రాజ్యమేలాలని ఆయన ఈ కావ్యం లో ఆకాంక్షించారు.

మాండలికాల గురించి ఈ కావ్యంలో ఒక అధ్యాయమే రాశారు. మాండాలికాల్ని ఇతర ప్రాంతాల వారు గౌరవిందాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. "ఏ భాష మనకు శత్రువు కాదు/ ఏ యాసా అపహాస్యం కారాదు" అన్నారు.

ఊరెల్లా పలికే వెన్నెల భాష ఉపిరి లోకానికి

వాడుక భాషే వాస్తవ భాష-ప్రజల నోట మోగాలి!

సాహిత్య సింహాసనం పైన వెలిగే తేజస్సు-ప్రజల భాషే!

బంధాలు అనుబంధాల పలకరింపు-వాడుక భాష!" అంటారు. అన్ని మాండలికాల ఉమ్మడి నిమంటువు ఏర్పడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

మాండాలికాల్ని ఇతర ప్రాంతాల వారు గౌరవించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

సైన్సు రచయిత కూడా అయిన పూర్ణచంద్ గారు మినుకుపలుకులు అనే అధ్యాయంలో శాస్త్రసాంకేతిక రంగాల ప్రగతికి తెలుగు భాష ఏ విధంగా తోడ్పడుతుందో సవివరంగా చర్చించారు. సైన్స్ అనే మాటకు సరైన తెలుగు పదం లేదనటాన్ని ఆయన అంగీకరించలేదు. పారిభాషక పదాలను మినుకు పలుకులు అని, సైన్స్‌ని "మినుకు ఎరుక" అని అంటారని సాహిత్య ఆధారాలతో నిరూపించారు.

'క్షీరకన్యకు చల్ల పురుషుడితో పెళ్లి' చేసిన అద్భుతమైన ఊహ ఈ కావ్యంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. తెలుగులో ప్రతి మాటకు శాస్త్రపరమైన వివరణ ఉంటుందంటూ "ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయి కాబట్టి పెరుగు" అన్నారని వివరిస్తారు. "సాంకేతిక పదాలలో పెరుగు తెలుగు మాట అది తొలి మెరుగు" అన్నారు.

'ఆకు చాటున పండులా పదాల వెనుక దాగిన చరిత్ర'ను ఆయన వివరించే ప్రయత్నం చేశారు.

అధికార భాషగా తెలుగు అమలు గురించి వాడుక భాషగా తెలుగు అభివృద్ధి గురించి శాస్త్ర సాంకేతిక భాషగా తెలుగు రూపుదిద్దుకోవాల్సిన అవసరం గురించి ఆంధ్రగీతిలో ప్రతి

చరణంలోనూ పూర్ణచంద్ గారి సహృదయ రాగం పలుకుతుంది.

ఇందులో చెప్పిన విషయాలన్నీ శాస్త్రీయమైన అంశాలు. ఇవన్నీఎంతో పరిశోధనతో వ్యాసాలుగా రాయగలిగినవి మాత్రమే. కానీ కవిత్వంలో శోభాయమానంగా చెప్పడం పూర్ణచందు గారికే చెల్లింది. ప్రతి పద్యంలోనూ కవిత్వం తొణికిసలాడుతూ ఉంటుంది. ఎక్కడా తొట్రుపాటు ఉండదు, తొందరపాటు ఉండదు. చరిత్రను, శాస్త్రాన్ని, సమాజాన్ని కవిత్వంలో రంగరించి అందించిన అజరామర కావ్యం ఆంధ్రగీతి.

ఈ తరహాలో ఇదే తొలి గ్రంథం. మలి తరానికి ఆధార గ్రంథం.

ఇందులో నుంచి శాస్త్రీయ విషయాలను కొల్ల గొట్టవచ్చు, కవిత్వాన్ని ఆస్వాదించవచ్చు, భవిష్యత్తులో ఇలాంటి గ్రంథాలు రాయడానికి ప్రేరణగా తీసుకోవచ్చు. అది మన ఇష్టం. ఇక అలపించండి ఆంధ్రగీతి.

ఆంధ్రగీతి

తెలుగు భాషాజాగృతి

డా॥ జి. వి. పూర్ణచందు

తెలుగమ్మా...! నీకు వందనాలు,
ఆంధ్రమాతా... మంగళగానాలు!
నీ పాటలు మ్రోయు తుమ్మెద నాదాలు,
నీ మాటలు మందార మకరందాలు!

అన్నమయ్య ఆలాపనే నీ శ్వాస,
త్యాగయ్య గానమే నీ ధ్యాస!
మంగళంపల్లి స్వరమే నాదసారంగం!
ఘంటసాల గానమే రసగంగాతరంగం!

నన్నయ -తిక్కన -ఎఱ్ఱన - పద్యాధార!
తెలుగు దారిన వెలుగుల అరుణతార!
సోమన ద్విపదలు ప్రగతి దీపకాంతులు,
వేమన నీతులు నిత్య ధర్మరీతులు

వీరేశలింగం, గురజాడ, శ్రీశ్రీ
నవయుగానికి నక్షత్ర కాంతులు
గిడుగు, పీవీ, మండలి – తెలుగుతేజాలు
భాషావికాసపు అమర రథచక్రాలు

అణువణువులోని రహస్యాలను విప్పే కాంతివి,
మనసులో, మేథలో వెలుగునింపే జ్యోతివి ,
శాస్త్రమూ కవిత్వమూ కలిసిన సింధువులో,
తెలుగుతల్లి! నీ శబ్దమే జ్ఞానఘోష!

కణాలలోని సూక్ష్మాలు, రోదసిలోని మర్మాలు,
తెలుగులోనే పలికించు – తెలుగే మేలనిపించు!
యంత్రమూ మనసూ మేళవించే యుగమిది!
తెలుగులోనే శాస్త్రవిజ్ఞానం వికసించే వేళ ఇది!

మనిషి మెదడు రహస్యాల తలుపులు తెరిచి,
కృత్రిమ మేథకూ నీ మాటలు నేర్పించి,
శాస్త్రానికి మనసుని జతచేసే సూత్రాలు నేర్పి,
తెలుగులోనే ఉపకరణాలను పలికించు తల్లీ!

రేపటి మన అవసరాలు తీరాలి!
ఆత్మగౌరవం మెండై నిలవాలి!
మన భాష, మన భావం, మన జ్ఞానం
మన బుద్ధి, మనతత్త్వమే 'లో'వెలుగులు !

వేయేళ్ల దీపకాంతులతో మన తెలుగు!
అహమహమికతో నిలిచి మెరిసిన వెలుగు!
మారిన కాలంలో మాయమైన విలువలు,
నట్టనడివీధిలో ఊడిన పట్టు వలువలు

డబ్బే ధర్మమై దౌర్భాగ్యమైపోయింది!
భాషా గౌరవం వీధికాలువలోకి పారింది!
మనసులో ఏమూలనో ఒక ఆశారేఖ...
మళ్లీ మేల్కొలుపు తల్లీ ...నీ చేతితో తట్టి!

నన్నయ, తిక్కన, సోమన, వేమన...
వీరేశలింగం, గురజాడ, గిడుగు...
ఒక్కో యుగాన భాషోద్యమం ఒక్కో రీతి...
మళ్లీ వెలిగిస్తాం తెలుగుదీప జ్యోతి!

ఇప్పుడు నువ్వే చెప్పు, మాతృభాషామూర్తీ!
శాస్త్రమే నిన్ను చేరే మార్గమవ్వాలని!
సాంకేతికతతో కొత్త యుగగీతం...
తెలుగులో పలికే 'విజయ సంకేతం!

కావ్యమంత గంభీరమై వెలిగిన భాష...
సాంకేతిక పథానికి అవరోధం కారాదు...!
జనమడి మాటే జ్ఞానద్వారమనే గ్రహింపు
వాడుక నుడులే వాస్తవికత వహింపు!

మాట్లాడేందుకు ఉపయోగపడిన మాటలే దేశ్యం,
వివిధ దేశజనులకూ అర్థమయ్యే మాధుర్యం,
వినసొంపుగా మనసులో జీర్ణమయ్యే పదం,
మన భాషలో ఇమిడిపోతే అదే నిజమైన దేశ్యం!

చిన్నకోట పెద్దన పలికిన వాక్యమిది మౌలిక సత్యం,
వివేకంతో స్వీకరించాలి మనం అన్యపద సౌందర్యం,
వ్యాకరణం అడ్డుగోడట సాంకేతికయుగానికి చెల్లవు
నూతన భాషాగమనాట వెనక్కి మళ్లవు!

స్వేచ్ఛగా సాగే మాటలే జీవమై,
శాస్త్రమూ, కవిత్వమూ కలిసిపోవాలి!
ఆపి నిషేధించి గెలిచిందెవ్వరు?
భాషే స్వరమై, భాస్వరమై వెలగాలి!

అవసరమే చెబుతుంది భాష విలువని!
భాషకు వాడుకే పులికాపు – పలుకే కొలమానం,
కొత్త యంత్రం పుడితే కొత్త మాటలు పుడతాయి!
తెలుగుతల్లీ! అంగీకరించు ఆనందంగా!

సెల్లూ, మిక్సీ, ఫ్రెండరూ గుడెసెల్నీ చేరినవేళ,
ప్రజల నాలుకలే నిఘంటువు లౌతాయి!
కొత్త పదాల సృష్టికర్తలు జనమే! ఆపగలదెవరు?
సంస్కృతాన వండివార్చే కన్నా జనభాషే మిన్న!

తెలుగంటే అచ్చతెలుగే...
పోయిన పదాలెన్నో పోగా మిగిలినది!
ఒక్కో మాటలో అనంత కాల చరిత్ర...
ఒక్కోపదబంధంలో నిబిడీకృత సంస్కృతి!

వాడుక భాషలో రాజ్యం, అన్నం లాగానే,
రైలూ, రోడ్డూ, బస్సూ కూడా తత్సమాలే!
పదాల రూపమే మారినా భావం ఒక్కటే,
ప్రజల ఊపిరిలో పలికితేనే భాష శాశ్వతం!

భాష అంటే సమాచార ప్రవంతి
జనాన్ని చేరిన ప్రతి నుడీ ఆంధ్రమే!
భావం అందినదే భాషా రత్నం,
సామాన్యుడి పలుకే ఆంధ్రమిది సత్యం!

తత్సమ పుష్పాలతో పూసిన గీతం,
తద్భవ పరిమళం నింపిన మధుర స్వరితం!
అచ్చతెలుగు వెలుగుల జాజివనంలో,
ఆంధ్రభాషా వైభవమిది జాతిజీవితం !!

శాస్త్ర సాంకేతిక సీమలలో వెలుగు,
స్వభాష పునాది, సారథి మన సంస్కృతి మెరుగు!
అక్షరమే ఆత్మగా, పదమే జ్ఞానదీపంగా,
'ఆంధ్రగీతి' పాడుదాం – ఆత్మగర్వంగా!

1. పూర్ణచంద్రాయణం

శ్రీగంధపు జరీ అంచుల అల్లుకుని
తెలుగుదనం మెరిపించే పంచెకట్టుపైన
వెన్నెలబొక్కాయి సొంపుగా తొడుక్కొని
పదబంధ పారిజాతాల తేరుపై వచ్చాడు...

పూర్ణచంద్రుడు...! తెలుగువారి వాకిట వెలుగు...
తెలుగింటి తేజోరాశి, తెలుగువారి మేనమామ...
చిన్నివెన్నెల కందు...చలివెలుగు చినుకు...
రాకాచంద్రుడు వచ్చాడు రాకరాక ఇంటికి!

ఆ చల్లని రాత్రితో చేలాగులిచ్చుకొని -
ఆ శీతల పవనాలతో ఊపిరి పంచుకుని
మట్టివాసనల మాధుర్యగీతమై,
తెలుగు తేనెలో తడిసిన 'కర్దమమన్నత' అది!!

అచ్చులు, హల్లుల పసుపు కుంకుమలతో,
పదాల వెలుగుల్ని పాదాలపై 'వార'పోసి,
నిసర్గ విసర్గలతో రాజతిలకం దిద్ది,
తెలుగు వర్ణమాలతో చంద్రుడికి స్వాగతం!

వెన్నెల చినుకుల కళ్ళాపి చల్లి
ముంగిళ్ళ రతనాల రంగవల్లుల తీర్చి
ఆకాశపు దారంతా ఆశల తోరణాలు కట్టి,
వాకిట వెలుగులో వేదగానాల స్వస్తి...

గోదావరి ఉరకలు క్షీరప్రవంతులుగా...
కృష్ణవేణీ ధ్వనితరంగాలు ఓంకారంగా...
పెన్న, వంశధార, తుంగభద్ర, గుండ్లకమ్మ, కిన్నెరసాని,
తెలుగు నదుల అక్షరాభిషేక విభవం!

వేదనాదాల నుండి సాపేక్షవాదాలదాకా...
'ఆదిమత'నుండి 'ఆత్మికత'దాకా...
'ఆటవికత'నుండి 'ఆటమికత'దాకా...
తెలివి పులకించిన తెలుగు పలుకు!

శబ్దం నుండి శాస్త్రం దాకా,
సంకేతం నుండి సంభాషణ దాకా,
బోధన నుండి భావన దాకా,
భాషా పరిణామాల తెలుగు స్వరతేజం!

గుహాజీవితపు అలజడుల నుండి
సహజీవనపు శాంతికాంతుల దాకా...
సంస్కృతి ఆలపించిన అనంతగానం!
భాషాభిమానం పలికిన ప్రణవనాదం!

ఆకాశానికి అక్షర మేఘమాల అల్లిన కవి!
చంద్రమౌళికి మణిగా మెరిసిన చందమామ -
తెలుగుదీపాన్ని అరచేతుల్లో అలంకరించుకుని,
అక్షరకాంతుల్ని అక్షయంగా వెలిగిస్తానన్నాడు...

విశ్వవిపంచి తంత్రులు శ్రుతిచేసి,
తెలుగురాగాలు లోకానికి పంచుతానని!
పాలపుంతలో ప్రమదనాదంగా నిలుపుతానని!
విశ్వగాన సుధలతో జగమంతా నింపుతానని!

పర్వతాలకన్నా ప్రాణవంతమైన పదబంధాలు,
సాగరాలకన్నా సుస్వరమైన శబ్దవీచికలు -
అవి తెలుగు పలుకుల్లో తేనెలౌతాయి...
తెల్లని చంద్రికల్లో తడిపలుకులౌతాయి!

తెలుగు అక్షరాలు - ఎడమకు తిరిగే వామావర్త శంఖాలు!
తెలుగు మాటతేటలు - వేదనాద స్వరసాగరాలు!
తెలుగు లిపిరేఖలు - అమ్మవారి చిత్రరూపాలు...
పలికిన ప్రతి పదమూ ఓ మంత్రోచ్చారణమే!

పద్యమై పూయగా, శబ్దానికి శోభగా,
శిల్పమై ఒలికి, సంస్కృతికి నాభిగా,
భావానికి భావంగా, ప్రణవానికి ప్రతిధ్వనిగా -
తెలుగుతల్లి మ్రోగించే తేజోనాదం!

"తెలుగు వర్ణాల్లో నేనూ ఉన్నాను భద్రంగా -"
అంటున్నాడు చంద్రుడు స్వయంగా...
అక్షర తారకల ముత్తెపు హారంలో దారంగా!
అక్షయ భావాలకు తానే ఆధారంగా...!

తెలుగులో తానూ నెలకొన్నానని...
'అ'అనే అక్షరంలో చంద్రవంకలా!
రెండు పూర్ణబిందువుల్ని
తన శిరసున శోభగా దాల్చుకుని!

***   ***   ***

ప్రతి అక్షరమూ వేదగానమై స్పందించింది...
ప్రతి వాక్యమూ ఓంకారమై నినదించింది...
తెరచిన మనసు మందిరంలో,
తెలుగమ్మ తానే ప్రత్యక్ష విగ్రహమై వెలిసింది!

కొండల మేడలపైన నవభానుడి గోరువెచ్చని చూపు...
తెలుగుతల్లి అమృతశిఖపై చంద్రోదయ ప్రసారం!
ఆమె చుట్టూ గుబురు విరిసిన కాంతివలయాల...
అక్షర ముద్రిత పట్టుపతాకమై, దివ్యలోక విహారం!

తెలుగుతల్లీ! నీ గుణగానం చేస్తే,
మానవతాదోషాలు తొలగిపోతాయి;
పరమపావన భావంగా గ్రహిస్తే,
నీ నామమే ప్రపంచాలకు ప్రకాశవంతం!

నాదసుధారస అక్షయగానం పంచే తల్లిగా వెలసి
సప్తస్వరాల అమృతనపు కల్పవల్లియై నిలిచి
రాగమయమైన పలుకుల తీరుతో శోభిల్లి
మాటలే పాటలుగా వెలుగుల తెలుగుతల్లి !!

అక్షరాల కుసుమ పరాగమై రాజిల్లే తల్లి ,
పద్దెపు ముత్యాల హారమై మెరిసే తల్లి,
పదకవితల గోపురమై గగన మానిన తల్లి ,
మాట - పాటగా భాసిల్లిన వెలుగుల తల్లి //

జ్ఞాన గంగాతరంగమై పారే తల్లి
కళాకల్పవృక్షమై కాంతులూరే తల్లి
సత్యసౌందర్య భాగ్యసీమ పల్లవించే కల్పతరువై
పాట - రుద్రగానమై భాసిల్లిన వెలుగుల తల్లి!

భాషలన్నిటికీ మేటి రూపమై వెలిగిన తల్లి
సంస్కృతికి దీప్తి దీపమైన వరాల తల్లి
మానవతా మంత్రరూపమై మెరిసిన తల్లి
దేవభాష గౌరవమై నిలిచిన తెలుగుతల్లి!

*** *** ***

మేరు శిఖరాన నవోదయ భాస్కరుని కాంతి...
తెలుగమ్మ నుదుట తిలక రేఖగా దివ్యప్రభ!
వేదసార గాథల పునరావిష్కరణమై నీవు,
వాక్యసాధకుడికి వాణీవరప్రసాదమై నిలువు!

వాగుల్లో వంకల్లో ఉరకలెత్తిన జలరేఖలా...
ఆమె కళ్లలో సుడులు తిరిగే నదుల ఆరాటం!
కొండగాలుల చండవేగపు నడకలా...
ఆమె ఊపిరిలో భావగాథాప్రవాహం!

చెట్టుమీద వాలిన చిలకల కోలాహలం...
అమ్మమాటలలో చేతనాభాయల వేదనాట్యం!
పొలాలపై పరుచుకున్న పచ్చని వెలుగుతీరమై...
నదీజలాల నర్తనంలా ఆమె తెలినవ్వులు!

ఆమె మనసు – అక్షర చినుకుల ఆనంద నాట్యం!
ఆమె మురిపెం – ఆకృతి దాల్చిన వాక్యవిన్యాసం!
ఆమె నిశ్శబ్దం – మౌనాన్ని మాటగా మలిచే సంభాషణం!
ఆమె చూపు – హృదయాన్ని తడిపే అక్షయ సందేశం!

ఆమె అడుగులు-ప్రకృతికి కొత్త జీవశ్వాస...
అమె పలుకులు – మనసులో వేయి దీపాల కాంతి!
పదాల పరంజ్యోతుల తీరాలలో
అమ్మచుట్టూ గుబురుగా విరిసిన పుష్పలావికలు!

చిరునవ్వుల చందన చర్చిత పుటల్లో
వాక్య వికాస విహంగాలు కువకువలాడిన వేళ
ఆమే భాష, ఆమే భాష్యం...
ఆమే భావం, ఆమే చేతనాపరంధామం!

ఎంతైనా ఇంతే వినిపించే ఆమె కీర్తనం
స్వాంతం అది భాషాభక్తిహృదయానికి!
తెలుగుతల్లి భాగ్యం కాంతుల వరదై,
జగమంతా నిండిపోతుంది ఆమె వెలుగులతో!

మనసులోని తలపును మాటలా అందించే శక్తి,
కడుపులోని చింతను కన్నీటి గాథలా వినిపించే శక్తి
కోరుకున్నవారికి తల్లిదనాన్ని ప్రేమగా పంచే శక్తి
అమ్మభాష, అది వేదనని రిక్తపరచే పరాశక్తి!

అమ్మభాషను ఆరాధించే హృదయాలలో,
పాప, తమస్సులు నశిస్తాయి క్షణాలలో!
ప్రకృతి భావనలు, సత్యారసాలు ప్రసరిస్తూ,
భాషామృతం కొన ఊపిరి ఆగే ప్రాణాలలో!

మాటలలో మాధుర్యం, పలుకులో శోభ,
ప్రతి వాక్యం సంగీతమయమై
మనసులలో ఆత్మీయత పంచుతుంది... !
ప్రతి హృదయం ఆశీర్వాదానికి తలవంచుతుంది!

పరభాషా సౌఖ్యాలకు పరిమితమైతే,
తెలియరాదెన్నటికీ విశ్వసౌందర్యం!
భాషానురక్తితో ఆత్మను పరిస్తే,
ఆలోచనలలో అపూర్వత విప్లవిస్తుంది!

రసిక శిరోమణులు, భక్తహృదయులు
భాషలోని మహిమను గ్రహిస్తారు;
అమృతమయ భాషాభిమాన రహస్యాన్ని
మనసుమనసున సుగమంగా ప్రసరిస్తారు.

భాషాభక్తి లేని కంటికి భౌతిక సుఖమే అవధి...
విశ్వజనీనత, ఆత్మీయతలు ఆవిష్కరించలేని పరిధి!
రసన కందనిది ఆత్మీయత, సత్యసౌందర్య మారీచి...
భక్తి గల హృదయానికి తెలుగు కదల్చలేని కాణాచి!

తన ఆలోచనలతో సంస్కృతి పరిరక్షణ,
తన పదాలతో సంగీతతత్త్వ వ్యక్తీకరణ
ప్రతి వాక్యం, ప్రతి అక్షరం –
భాషాభిమానుల భావనామృత సారం!

తెలుగుతల్లి... నాదరస సరస్వతి...
సప్తస్వరాల కల్పవల్లి, సకల కళావతి
సమభావపు దీపాలు వెలిగించి
విశ్వశాంతిని ప్రసరించే ప్రేమరూపవతి

*** *** ***

చివురుటధరాలపై కొత్తపొద్దు నింపాదిగా
తడితడి నవ్వులతో పూలజల్లులు కురిశాయి!
కొండల కుండలాల గణగణలు సన్నగా
నుదుట సిందూరపు హొయలతో భానూదయం!

ఆమె అడుగుల వెంట తారకల వెలుగులు
సైన్యజలధిలా తారట్లాడి పొంగిపొర్లాయి!
ఆమె నడుల పొందికలో ప్రభాతకిరణస్వరాలు
మల్లెమొగ్గలై తెలినవ్వులు విరిశాయి!

ఎన్ని కవనాల కానవాల్లో కదలాడిందో
శార్దూల మత్తేభాల గర్వాన్ని నింపుకుని
పలుకుబడులలోని పసందు శబ్దసారథిగా...
పద్యమై పరవశించాలని యుగాలుగా!

ఎన్ని శబ్దసాగరాల లోతుల్లో ఈదులాడిందో
సరిగమ స్వరాల దర్పాన్ని నిలుపుకుని
పదబంధాల పరిమళం లోకానికి పంచాలని...
వాగ్గేయమై అలరించేందుకు సిద్ధంగా!

ఎన్ని యోగానుయోగాల్లో మునిగితేలిందో
శాస్త్రపరిజ్ఞానపు తత్త్వాన్ని నిలుపుకుని
పారిభాషికమై చొక్కించాలని సాంకేతికంగా...
వైజ్ఞానికమై వెలుగొందాలని శాస్త్రీయంగా!

తెలుగు నేల – అక్షరాల అలకాపురి!
తెలుగు భావన – మిన్నేటి మధుర గానసిరి,
తెలుగు అక్షరం – తేనెలో తడిసిన ఇక్షురసం,
తెలుగు పదం –పరిమళించే మరువంపు దళం

తెలుగు పలుకు – వేదవాణి ...
తెలుగు మాట – వెన్నెల విరిబోణి ...
తెలుగు వాక్యం –విశ్వభాషావాహిని...
తెలుగు సంభాషణ – సంస్కృతీస్వరాల సంకీర్తన!

అయినా చంద్రమా... నువ్వున్నావు...
జీవామృతం కరిగిన మేలిమి పుత్తడివి...
మరణించే భావాల మడులలో వికసించే
అక్షరాల ఎర్రమందారపు పసిడి పుష్పానివి!

వెలిగించు – ఒక కొత్త ఆకుపచ్చ ఆశారేఖ
అందించు – ఒక కొత్త స్వప్నపు స్వాగత రేఖ
ప్రభవించు – ఆశల మేఘాల ఆవలినుంచి
సూర్యతేజాల జీవకాంతి మణిహారపు తారక!

మలిపొద్దులా వెలుగు లీనే దివ్య రూపం –
కలువ కళ్లలో తేనెలూరే కారుణ్యగాథ –
సోయగం కాదు, ఆత్మ సొబగు...
వెన్నెల తాకిన పారలౌకిక నిశ్శబ్ద స్పర్శ –

ఇరువది కోట్ల సంతానవతి...ఆమె!
విశ్వధాత్రి! మా తెలుగుతల్లి!
ఆమె అమృత రూపు మనసుని తాకగానే–
దుఃఖానుభూతులన్నీ కరిగిపోతాయి!

భాషను ప్రేమించటం – ఓ మహాతపస్సు!
దీక్షపూనితే దారికే దర్శన సేవ!
ప్రేమ నింపితే కలిగే పదార్చన భాగ్యం!
పదమే పునీతమై పొంగే ఆత్మసాధన

*** *** ***

అంతలోనే ఏదో అలికిడి మనసు నిండా...
మెలకువ వంటి కమ్మని కల కరిగిపోయింది!
కళ్లు విప్పుకు చూసింది ఇంకొక్కసారి...
ఒక మూగకల... నోరు తడారి ఎండినట్టు...

కళ్లు విప్పుకు చూసింది మరొక్కసారి...
ఒక వెర్రిగాలి... శుష్కపుష్పమై మూలిగింది...
చిమ్మచీకటిలో 'కొందలపడిన'గాలిదీపంలా!
అంతా భ్రాంతే...! భాషకు ఒరిగేదింతే!

పేగుల మాడిన పేదరాలిలా
మూత వేసిన రెప్పల వెనుక
నిద్రలేని కళ్లలో కలల బంధాలు...
వీధుల్లో ఒంటరై నడుస్తోంది... తెలుగుతల్లి!

బండరాతికింద గొంతు నలిగిన నీటిచుక్కలా
నోరువిప్పక ఆడిపాడే తోలుబొమ్మలా
అమ్మమాటలు తెలీని అమ్మబిడ్డలు
తల్లిని మరచిన తరం, వట్టి మట్టిబెడ్డలు!

అన్యభాషల కఫం కమ్ముకున్న ఊపిరినాళంలా
తడబడి తల్లిమాటలు పలకని జీవవేణువులా
తల్లిదనానికి నోచని నిస్తేజ మానవతరం...
'లాతిమాటల్లో' పీకలోతు కూలిన జాతినిర్వాకం!

ఎన్నెన్నో అవమానాల బరువు భరించింది!
తన శిఖపై దీపం నిలుపుకొని... భాషామతల్లి
కాడిగట్టిన ఆలోచనలు కొండెక్కుతున్నాయి
బొగ్గులకోసం కల్పవృక్షాన్ని పొడుస్తున్నాయి!

అనుభూతి లేని రసనీరసహృదయాలు –
వాసన లేని పూలు – శుష్కమనసులు!
నీళ్లు ఆవిరైన జీవనదుల చారికలు!
ప్రేమలు ఒలికిపోయిన ఎండుటెడారులు!

అనంత స్వప్నాల వంటరి కంచె... ఆకాశం!
వాక్యాల ఊసుల్ని ప్రసరించే నీలితెర అది!
విస్తృత భువనతలంపై మేఘశిల్పాల మెరుపు
అక్షరాల ఆకృతుల సుందర భావనాభవనం!

వేదాల పునాదుల వెంటే తెలుగులు
హంసలా నడిచిన జ్ఞానపథగాములు
మాటల మార్మిక భాషాయంత్రాన్ని
కదిలించే విద్యుచ్ఛేతనలు నా నుడులు!

ప్రతి పదమూ -కృష్ణాతరంగమై నిశ్శబ్దవాహిని!
ప్రతి మౌనమూ - అంతరంగాన చైతన్యరథం!
ప్రతి వాక్యమూ - ఆలోచనల ఆద్యంత సంచలనం!
ప్రతి పలుకూ - ఆత్మావిష్కరణకు రాగానుబంధం!

ప్రాచీన భాషా సాగర కెరటాలపైన,
తెల్లవారని తెలుగుదనం ఊయల లూగింది!
పలుచని ప్రకాశపు కణాలుగా ఒక్కో పదం,
అచేతన గర్భంలో ఆదిశేషమై తేలి ఆడింది!

అమ్మ శ్వాస తగిలితే...
కొమ్మలకు శబ్దాలు పూస్తాయి అమరికగా!
నిశ్శబ్దాన్ని తాకిన ప్రతి పదమూ ఆమె స్వరమే!
భాషకు జీవమిచ్చే ఆమె శబ్దదేవతా స్వరూపమే!

అమ్మ శ్వాస తగిలితే...
వాయులీనతంత్రులు కమ్మగా నినదిస్తాయి!
పదలయలు మృదంగనాదమై నర్తిస్తాయి!
నాదజగాన సుస్వరాలు గుంపులుగా జనిస్తాయి!

ఒక 'శబ్దం' హృదయపు గవాక్షాన్ని తాకగానే
ఆలోచనల మేఘం వాక్యమై వర్షిస్తుంది!
ఒక నుడి 'దివ్య వేదస్వరం'గా ధ్వనించగానే,
ప్రతి మౌనమూ జాతీయగీతమై నిలిచి పాడుతుంది!

'అ' అక్షరం... జెండా మధ్యలో...
నీలాకాశంలో చంద్రబింబంగా!
తెలుగు పతాకం వినువీధిలో...
స్వేచ్ఛగా ఎగరాలి తళతళగా...

'మడి'- అమ్మమాటల గుడి!
తెలుగుపలుకుల పుణ్యప్రణవం...
తెలుగుజాతి జేజేల పలికే జీవనగోపురం...
తెలుగుతల్లికి శబ్దపుష్ప సమర్చనం!

'మడి'-అమ్మ గుండె సవ్వడి,
లాలిపాటల అమృత తరంగం,
తేనె పలుకుల హరివిల్లు...
'జ్ఞానసాగరమథన దివ్యగీత'!

'మడి'- మనసు మడిలో పండిన పైరు
సుతిమెత్తని భావలాలిత్యం,
భాషకు 'ఎగ్గు' తలపకు - 'లగ్గు' కాదు
పలుకుల తేజమే జాతి ఔన్నత్యం!

పొరాడి అణగారటం దేనికి?
పోరాడితే పోయేదేమీ లేదు...
పరభాషా వ్యామోహం తప్ప!
పలికే ప్రతి పలుకూ స్వతంత్ర యాగం!

తెలుగుతల్లి అడుగుల్లో జ్ఞాపకాల గాథల్లా...
వీరుల జాడలే వీధుల్లో నడుస్తున్నాయి,
అమ్మపాలతో రంగరించిన భాషాప్రేమలా...
జన్మభూమిపై వెలుగుల ప్రెళ్ళూనుకున్నాయి!

ఆమె చిరునవ్వులో వేయిగాథల పరిమళం....
ఒక సంగీతపు సుధాసంధానం...
ఆమె పిలుపు...ఒక మార్మిక మృదుస్వరం
మనసులను 'తొక్కించే' త్రికాల గానం!

ఆమె నడక - పదాల పాలకడలిపై నౌకాయానం!
ఆమె ఉనికి -అక్షరాల అద్భుత కాంతిపుంజం!
ఆమె నామం -అమరులు కీర్తించే దివ్య గీతం
ఆమె రూపం - భాషగా వెలసిన విశ్వామృతగానం!

**** **** ****

2. భాషావతరణం

శూరుల పుట్టుక, శాస్త్రాని కందని కథనం!
దేవతల జన్మకథ, ఓ దివ్యరహస్య సంజాతం!
యేరుల మూలం, మరుగునున్న మహాతత్త్వం...
ప్రతిధ్వనించే ప్రళయమే భాషకు మూలధ్వని!

నుడుల జన్మరహస్యమూ అంతే....
అది కాలగర్భంలో దాగిన శబ్దబీజం
ఆద్యంతా లెరుగని అనాది ఊహ!
లోక ప్రమాణాల కందని మౌనమూలం!

భూమిని నాగలి ముద్దాడిన ఆదిమకాలాన
రాతిగూళ్లలో దీపాట నవ్విన రోజున
కట్టుబట్టల కోసం జీవితపు అల్లిక నేర్చిన వేళ
వంటకుండ కోసం కుమ్మరిచక్రం తిరిగినప్పుడు...

అదిగో అప్పుడు... అంకురించింది తెలుగు నుడి!
శ్రామిక కర్షకుల ఓహరిసాహరుల గానరవళులతో,
చేతనావర్తపు, మనోవికాసపు మెలకువలతో
మాటల మడిలో వడిగా పెరిగింది తెలుగు పైరు!

వాగ్జ్యోతి వెలుగులు విరజిమ్మే సౌభాగ్యమిది,
కళాజీవన రాగాలు నినదించే యుగమిది –
తెలుగుతల్లి వేదికపై శోభించే సమయాన,
లోకానికి లాలనగా నిలిచే మహోత్సవమిది

జ్ఞానగంగల జలధారలు పొంగే క్షణమిది,
సాహసగాథల స్ఫూర్తులు రగిలే వేళయిది –
అక్షరపుష్పాల పూదోట వికసించే కాలాన,
తెలుగు వైభవం విశ్వమంతా పరచే క్షణమిది!

ఆనందాలు, శోకాలు, ఆగ్రహాలు,
ఆవేశాలు, భయాలు, ఆశలు...
తలపుల తోటలో విరిసిన
షడ్రుచుల ఉగాది పలకరింపులు!

ప్రతి మాట – తన కాటుక కన్నులు విప్పి
ప్రపంచపు టద్దంలో తననే చూసుకుంటుంది!
ప్రతి పదం – తన హృదయ కవాటాలు తెరిచి
చరిత్ర పుటల్లో తేనె తానేనని మురిసిపోతుంది!

ప్రతి అక్షరం – తన అంచులపై
కాలగమనపు శిలాలోలాన్ని
శిల్పంలా చెక్కుకుంటూ సాగుతుంది!
తన గుండెలపై ఎదిగిన జీవపు జాడల కోసం!

శ్వాసల మధ్య పెరిగే భావనల చిగురు... భాష!
ఊహల ఉరవడిలా పలుకుల ప్రవాహం.... భాష!
భాషను సొంపార పెంపొనరిస్తే మన్నన మనకే,
వదిలేసి విర్రవీగితే వసివాడేది మన ఉనికే!

*** *** ***

కృష్ణ, గోదావరి, తుంగభద్ర నదీమాతల ఒడి...
తెలుగు పలుకుల పురిటిగడ్డ సంపన్నంగా!
నాగరకత వికాసానికి సిరివెన్నెల దివ్య దివిసీమ...
సింధు నగర వైభవానికిది సమకాలీన నాగభూమి!

ఒక 'మాట – హృదయాన్ని తాకిన క్షణమే,
వాక్యం అక్షరాలా అక్షరధారగా వర్షిస్తుంది!
ఒక నుడి దివ్యవేదస్వరంగా ధ్వనిస్తుంది...
ఒక భావన పాడిన మౌనగీతమై వినిపిస్తుంది!

ఒక చింతన మాటగా రూపుకట్టుకుంటే,
మనసులో రాగం పల్లవిస్తుంది!
ఆలోచనల లహరి పొంగులెత్తి
శ్రుతిలయల కడలిగా మారుతుంది!

విస్తృత భువనతలాన
ఏవేవో ఊహల మేఘశిల్పాలు –
భావనా భవన సౌందర్యానికి
బహుళ వర్ణసంకీర్ణాలు

వేదాల పునాదుల వెంటే తెలుగులు
హంసలా నడిచిన "జ్ఞానపథ"గాములు
మాటల మార్మిక భాషాయంత్రాన్ని కదిలించే
విద్యుత్ విద్వత్ నుడి చేతనలు!

ఎన్ని వెన్నెల యుగాలో పలవరించింది భాష...
తన పలుకులకు అక్షరయోగం కలగాలని!
ఎన్ని వసంతాల జగాలో పరితపించింది భాష...
తన గతులకు 'వ్రాతవెలుగు' చేకూరాలని!

వ్రాతలేని భాషలా... గానంలేని గాత్రంలా
కాలపు పొగమంచులో కనుమరుగైన స్వరంలా
మూగవై మసకబారిన జ్ఞాపకాల వెలుగులు...
మనం మరిచిపోతున్న మన జీవితపు అక్షరాలు!

పాతకాలపు మసక అద్దంలో మన ముఖంలా
నవ్వుల వెనుక నలిగిన నిస్సహాయపు నీడలా,
గడిచిపోయిన అమృతక్షణాల్ని వదిలిన చోట
ఆగిన గడియారపు ఆఖరి క్షణంలా అమ్మభాష!

*** *** ***

భారతీయ గాథలో తొలి అధ్యాయం తెలుగుజాతి!
తెలుగు, సంస్కృతమూ వేరైనా ఆత్మ ఒక్కటే...
తనదనే ప్రత్యేకతలెన్నో నిండుగ వెలిగే సుకృతి...
తలవన్నే ఖ్యాతులకు చిరునామా తెలుగు సంస్కృతి!

ఎవరి సంస్కృతి వారికి... అహో తియ్యనే!
తియ్యనైన సంస్కృతులలో తేనెతీపి తెలుగు!
మానవత్వం ఒక పరిణామ ఫలసంపన్నం
మట్టిని ముద్దాడే హృదయ స్పందన ప్రసన్నం!

తన జీవన విధానం తన సృష్టే!
తన కుటుంబం, తన సమాజం, తన ఆహారం,
తన అవసరాలకు తగిన తన బతుకుతీరు
తన వివేకంతో కూర్చిన మహనీయతే సంస్కృతి!

పొయ్యిలో పిల్లి లేవగానే కడుపులో ఎలుక పరారు
ఆకలి శాంతించగానే ఆలోచనామృతం తనరారు!
తనకోసం, తనవారికోసం, ఎల్లలోకాలకోసం,
జ్ఞానం అంకురించగానే జీవానందం పొంగారు!

అక్షరాల ఆనందం కొత్తచిగుళ్ల శాంతి
జనహృదయాల్లో కాంతించే దివ్యజ్యోతి
తెలుగయ్యల తేజస్సు దశదిశలా వెలుగు
తెలుగమ్మల త్యాగం తరతరాల మెరుగు

అంతరాత్మను పలికించే గోదారి సవ్వడి...
వాక్య రవళికి ఊతమిచ్చిన మృదు శబ్దగంగ...
పరవశాన జలధి గానమై చొక్కించింది అమ్మపలుకు...
బ్రహ్మనాదమై అక్షరాలవంపుల్లో ప్రవహించింది తెలుగు...

సంస్కృతి... జాతి సమీకృత జీవన కృతి.
భారతీయ భాషామణిమాలలో మాణిక్యఖ్యాతి
తేనెలొలుకు మాటల పొందు తెలుగు రీతి
సాత్త్విక భావనల విందు, ఆత్మికతకు తానే మందు!

వాక్యంలో వెలిసిన వాక్చాతుర్య రత్నమిది!
గేయచరణంలో జాలువారిన గానసుధ ఇది!
చరిత్ర గాథలలో చిరంగా స్థిరంగా నిలిచినది...
దార్శనికతకు మారుపేరైన భాషామకరందమిది!

అక్షరాల చెట్టుకింద పరచుకున్న నీడలో
తత్త్వజ్ఞానపు కుహూరాలు ప్రవచిస్తాయి!
వాక్యాల బీజాల్లా నాటిన ప్రతి పలుకూ
మనసులో సామగానమై మొలకిస్తాయి!

కాలచక్రాన కొత్తమెరుపై తిరిగిన తీరున
కలల్ని కలిపిన కావ్యంలా ఉగాది పండుగ!
పచ్చదనమై పరిమళించిన గేయపల్లవం
పొంగారిన పసిడి జ్యోతుల కాంతి నిండుగ!

ఒక మాట గాలిలోకి పరివ్యాపిస్తే
తరతరాల ఆలోచనగా మెరుస్తుంది!
ఒక గాత్రంలోంచి జాలువారిన స్వరం
అక్షరాల ఆరాధనగా సంచలిస్తుంది!

పదకుసుమాలు ఆమె జడలో అలంకారాలు,
వాక్యాల సింహాసనంపై ఆమె విలాసగర్వాలు,
శబ్దసాధన చేసే సాయుధాక్షర సందోహాలు,
ఆమె చిత్తప్రకాశాన్ని ప్రతిబింబించే సరోరుహాలు!

నుడుల మెరుపేదో తాకిన క్షణం
నిరత నిరయ నిరింద్రియ శబ్దానికి
అనంతత్త్వపు చేతనావర్తం ఏదో
అనుభూతుల పరిమళం అలముకుంది!

పాపాయి చేతి తొలిపలుకు కంకణం...
కాలపు కల్పవృక్షం కాసిన తొలిఫలంలా
చంటిదాని నవ్వుల్లో పరిమళించే భాషాగంధం
పల్లవించిన పసిమనసు శుద్ధశబ్దరసగంగలా!

ఒక భావం -వర్ణాల గర్భాన రత్నమై మెరిసి
పలుకుల పరిమళం శాశ్వతమై నిలుస్తుంది!
ఒక జ్ఞానం మౌనపు ముత్యమై కాంతించి
శాస్త్ర సాగరాల నధిగమించి సాగుతుంది!

మాటని అలా వదిలేస్తే మనసు మూగదౌతుంది!
మాటని ఇలా పలకరిస్తే మెదడు మాటలాడుతుంది !
సంభాషణల జడివానలో తడిసిన అక్షరాల మడి
పదాలు వాక్యాలు కావ్యాలై కంకులేసుతుంది!

మాటకు... రూపమిస్తే–జ్ఞానకాంతి వికశిస్తుంది,
శబ్దమిస్తే... సంగీతపు నదిలా పరవశిస్తుంది,
ఆయుధమిస్తే... అగ్నిజ్వాలై ఉరుముతుంది,
దైవత్వమిస్తే... మనిషికి మన్నన వరమిస్తుంది!

అక్షరాల పల్లకిలో ఊరేగే
పద పట్టపురాణి – తెలుగుతల్లి!
ఆమె ఊసే వేదమంత్రధ్వని,
ఆమె ధ్యాసే 'నాడు'ల గాథ!

*** *** ***

తెలుగమ్మ మెడలో వ్రాతమాల...
స్మృతులను మెరిపించే మణిహారం...
ఆరంజ్యోతిలా వెలిగే అక్షర రమణి!
అక్షరాల అలంకార స్వర చూడామణి!

అక్షరాలు అంతరంగ నేస్తాలు
ప్రతి వర్ణమూ ఒక తేజోరేఖ...
ఆలోచనావాహినికి తొలిమజిలీ...
జ్ఞాపకాల తెరపై తెలివెలుగు రవళి!

అక్షరాలు – చీకటి పొగమంచుని చీల్చుకుని
ఆకృతులు దాల్చిన శబ్దచిత్రాలు
మౌనపీఠంపై వెలిసిన ధ్యానశిల్పాలు
జ్ఞానచేతసులు చెక్కిన 'ఆది లిపులు!

అక్షరాలు - మేఘాల మేడలకు ఎగబాకిన
జాజిమల్లె తీగల సోయగాలు
తీర్చైన పదబంధ తారకలు
చేతనావర్తపు శ్వేతకారికలు!

అక్షరాలు - భాషల నదీతీరపు తడి ఇసుకలపై
ఆబగా తిరిగే నూరుకాళ్ల జీవి
ఊహల పాదాలతో వడిగా వేసిన
అడుగుల జాడలు... అవి శబ్దశిల్పాలు!

మౌర్యులు అందించిన మహత్తర వారసత్వం
బ్రాహ్మీలిపి రూపాన విరజల్లిన జ్ఞానదీప్తి!
నిలువుగీతలూ అడ్డగీతలూ కలిసిన
అక్షరాల ఊసులు తళుకురేఖలు!

మౌన శతాబ్దాలకు వ్రాతరూపం ఇచ్చిన
నవనవోన్మేష జ్ఞానసందోహం....
అక్షరించిన శబ్దాల నాట్యమాధుర్యం!
మాటల్ని కళ్లారా చూసిన సత్య సౌందర్యం!

శిలలపై శాసనాలై మెరిసిన శబ్దరేఖ
అక్షరమైన అనుభూతికి ఆరంభగీతి...
అక్షయమైన జ్ఞాపకానికి ఇది ఆరంజ్యోతి
కళలకు తలమానికం అద్భుతం వ్రాతకళారీతి!

కొమ్మలకు వ్రేలాడే తేనెపట్టులా అవుపిస్తాయి
అడ్డగీత నంటి సాగే ‘దేవనాగరి’ అక్షరాలు...
స్మృతులను అల్లుకున్న రథం ముగ్గుపై
తంగెడుపూల బతుకమ్మలా కమనీయంగా!

మంచిముత్యపు రాసులు దొర్లినట్టు
సుడివేసిన గుండ్రని బొమ్మరిల్లలా
తీరి ఉంటాయి తెలుగు అక్షరాలు
తాళపత్రాలపై తల్లి చేతివ్రాత ముగ్ధగీత!!

వ్రాత కళ... గీతల మధ్య ‘గీత’...
‘లిపిగీతాసారం’...జ్ఞానమహాసాగరం!
సత్యస్వరూపాలు వ్రాతలో అక్షరాలు...
వాక్కుకు సాక్ష్యాలు, నిక్కమైన నీలాలు!

అంతుబట్టని శబ్దబ్రహ్మమే సింధూలిపి,
అక్షరమూర్తుల సాక్ష్యాలే ఉన్నా-
ఆకృతి రేఖలన్నీ అల్లుకున్నా
బోధపడని భావమై నిలిచాయి శిలాజగాన!

ఋగ్వేదకాలంలో ‘లిపి’ఓ కలల నీడ,
అక్షరాకృతి అవసరం మౌనమంత్రాలు -
అదొక ఆధ్యాత్మిక యోగానుయోగం!
నిస్సందేహ శబ్దానుభవ మౌనప్రయోగం

బౌద్ధయుగంలో-
నునుపు శిలలపై శిల్పమై మెరిసిన లిపి-
వర్ణమాల తోటలో వసంత వెలుగు...
అక్షరాల పక్షుల కిలకిల నాదం!

తెలుగుకూ అక్షర రూపం దక్కింది
ప్రతి అక్షరం బంతిపువ్వై మురిసింది!
గుండ్రటి ముత్యంలా మురిపించే ఆకృతులతో
వయ్యారపు వలయాల వ్రాత అవతరించింది!

చారిత్రక యుగం ఉదయించిన వేళ,
తెలుగు గమనాలు తాకిన మార్గసంధి!
చరిత్ర మలుపుల్లో తళుకుమన్న
భాషారథచక్రం గలగల తిరిగింది

ద్రావిడ జనని కీర్తిగా జనించిన తెలుగమ్మ!
వేదస్పర్శతో మురిసిన ప్రాచీనోన్నత దీప్తి!
తేజోమయం చేసిన నాటి భాషాబంధాలు...
పదపద్మాల వైభవ భాషావికాసాలు!

కొమ్మలు వేరైనా భాషల కడిమిచెట్టు ఒక్కటే!
తెలుగూ తమిళం కన్నడం మళయాళం...
జీవభాషల జలధిలో సాహితీసంగమం
ద్రావిడగంధ సుగంధమే మూలస్వరం!

సంస్కృతపు ముత్యాలహారంలో
మధ్యమణి తెలుగు...
తను వెలుగుతూ
తన వెలుగును జగతికి పంచుతూ!

ఆదిమ యుగాన నాగుల గాథలే వినిపించాయి!
పల్లకిలో ఊరేగిన తెలుగు నాగస్వరాలు ఆనాడు!
సిరి మోపిన 'దివిభూమి'పైన వెలసి,
నాగలి మొన మెరిసిన శకలం శ్రీకాకుళం!

ఆ వంక నాగులు, ఈ వంక గరుడులు
నట్టనడుమ యక్షులు, ఆవల కిన్నెర గానాలు
ఒక్కరేమిటీ? ఆంధ్ర ద్రావిడాది జాతీయు లెందరో...
అరసిన అందరి పదాల కలబోతే ఆంధ్రము!

అమరావతి బౌద్ధ శిల్పాలలో
నాగపడగలే చరిత్రకు నిధినిక్షేపాలు!
ఇది నాగభూమి... ఇదే ధన్యభూమి!
ఇది జ్ఞానభూమి... ఇదే తపోభూమి!

ఆర్యాంధ్ర బంధుత్వం మానవతాప్రకాశమే!
ఆర్యధర్మ తేజమై ఋషిలా వికసించింది!
ఆంధ్రధర్మ రీతులకు గీర్వాణసుగంధాలు
ఆర్య విజ్ఞానధారలకు ఆంధ్రవ్యాఖ్యానాలు!

వేదవిదుల అనంత యాత్ర...
ద్రావిడ రీతుల స్వీకారమే పెద్ద మలుపు...!
ఆగమాల ఆత్మను ఆలింగించిన వైనం
తెలుగు బిడ్డలకు జ్ఞానఫలప్రదానం!

పరిమళించిన ఆత్మ స్వరూపం అది!
ద్రావిడగుణాల పునాదులపై
ఆర్యభవనాలు వెలిశాయిక్కడ!
ఆత్మవాదాల తీరుకు కొత్త మలుపులివి!

అణువణువునా సహజ భౌతికత మరుగై
ఆధ్యాత్మికత ఎల్లెడలా వెల్లివిరిసింది!
తత్త్వగర్భిత సంస్కృతికి ఆంధ్రతేజోరేఖ
భావాల సమాగమపు అఖండ భారతీయం!

హాలచక్రవర్తి ఆంధ్రగాథల కూర్పు...
తొలి కథాసంపుటి 'గాథాసప్తశతి' నేర్పు!
ప్రేమ, పరిణయ భావాల తొలి పరిమళం అది -
పల్లెజీవనంలోని గానమాధుర్యాలు!

గీర్వాణ భాషానిర్మాణ గర్భంలో
తెలుగు పదాల సవ్వడే ఒదిగింది
కొత్త ఆలోచనలకు తలుపులు తెరిచింది
'మార్గ' కవితకు బీజావాపన అది!

పండితుడు ఏమెనూ అన్నాడు-
ఇది 'సంస్కృత ద్రావిడీకరణం'
పదాల పరస్పర స్పర్శతో జనించిన
రెండు భాషల సంయోగ ఫలదీకరణం!

***   ***   ***

'భారత్'శబ్దానికీ ఓ తెలుగు అర్థం వుంది...
'మూలద్రావిడంలో పల్లవించిన 'పార్'...
తెలుగులో 'ప్రాత' 'భారత'గా తళికించింది!
ప్రాచీన దేశమనే భావన పులకించింది!

నాగరకతా వలయాల పుడమిపై భారత్
పరిపక్వమైన ఒక పౌరాణిక నామం!
ద్రావిడభాషలో మేల్కొని
ఋగ్వేద పరంపరగా సాగిన పరంధామం!

ఋగ్వేదంలోనూ మూలద్రావిడ పదాలెన్నో...
వెదికిన పండితుడు ఎఫ్బీజే కౌపర్
ద్రావిడ జాతులందరికీ ప్రాతః స్మరణీయుడు!
భాషా ప్రాచీనతకు అతను దార్శనికుడు!

బౌద్ధ ఛత్రశాసనం పైన కనిపించింది...
'భరతీయను'లనే తెలుగు పేరు ఘంటసాలలో!
రెండు వేల యేళ్లనాడే పరిమళించిన
అఖండ భారత జయగీతికకు పల్లవిగా!

బౌద్ధ ధర్మచ్ఛత్రం నీడన
సేదతీరింది భాషా సమత్వం!
ఉత్తర దక్షిణ హద్దుల్లేని జాతీయత...
పల్లవించిందిక్కడ తొలి భారతీయత

తెలుగు గర్భాన పుట్టి,
సంస్కృతం ఇంట మెట్టి;
తెలుగుదనాన్ని పరిమళించిన
పదపారిజాతాలెన్నో చికిలించాయి!

తల్లి మాటలో సత్యం, తాత్వికతలో మాధుర్యం –
ఇరువురి ఆలింగనమే మన భాష;
వేదాకాశం నుంచి తెలుగు వీధుల దాకా
జీవన సహజసౌందర్య భాషాకౌశలం తెలుగు!

అటు నుంచి ఇటే కాదు పదాల రాక...
ఇటునుంచి అటు కూడా సూటైన పోక!
భాషల సంగమ ఫలమే ఇదంతా!
మనసుల మిళిత మధుర స్వరూపం!

తెలుగువారి అప్పచ్చి,
మూలద్రావిడ అప్పం,
ఋగ్వేదంలో అది అపూపం,
ఆహార పదాల చరిత్ర అపురూపం!

తెలుగులో మురిసే సంస్కృత పదాలు
ఒక్కరి ఆధిపత్యం కాదది స్నేహపరిమళం!
తెలుగుల ఓడినవారు కాదెన్నడూ...
గర్వంతో, స్వతంత్ర ఆత్మతో నిలిచారు గర్వంగా!

రెండు సంస్కృతుల సంలీనం –
ఆర్య–ద్రావిడ కలయికే తెలుగు సంస్కృతి.
పరస్పర ప్రభావం, పరస్పర సౌందర్యం,
నిరంతర చిరంతనంగా నిలిచిన స్వీకృతి!

తెలుగూ సంస్కృతమూ తల్లీ–బిడ్డ కాదు,
అక్కాచెల్లెళ్ళకన్నా మించిన బంధం!
స్నేహం, అనురాగం, గౌరవం
తెలుగువారి నోట పరిమళించిన అందం!

*** *** ***

కృష్ణ నుండి వంశధార దాకా!
ఆంధ్రుల మనసు బౌద్ధమయమై
శాంతిజ్వాలగా జ్ఞానకాంతులు నింపింది!
ప్రాకృత గళమే తరంగమై నింగికెగిసింది,

పదాల పునాదుల్లో విరిసిన వెలుగు,
ప్రాకృతమే ఆనాడు పాలించిన అరుగు!
అశోకుడి శాసనాల్లో గాథగా మెరిసింది...
తొలి ప్రస్థానపు మధుర ఖ్యాతి అది!

ప్రాకృతమే రాజ్యభాష శాతవాహన యుగాన
రాజులు 'ఆంధ్రభృత్య' బిరుదాంకితులు...!
ప్రేమగల కవితా ప్రియంభావుకులే వారున్నా...
ఆంధ్రమంటే మాత్రం ఆమడ దూరం అందరున్నా!

తెలుగు ప్రాణాలు ఆనాడు,
మానవాణిగా మారిన కాలం అది...
తెలుగును మరచి తలవంచినవారే అంతా!
భాషలతో పాటు పరమతాలకూ పాడారు వంత!!

ప్రాకృత పాళీ సంస్కృతాల పల్లకినెక్కి
పరాయిగీతాలు పాడి పొగిడారు తెలుంగులు!
తరతరాల కావ్యకల్హారాల కెక్కని తెలుగు...
స్వాభిమానం కోల్పోయిన జాతీయత అది!

తామరాకుల మాటున దాగిన చేపపిల్లల్లా
తెలుగుమాటలు అనాదరపు నీటిమూటలు!
పరిమళించిన పదకుసుమాలన్నీ...
చెట్లకింద రాలుటాకుల కసవులు!

బోధిసత్త్వుని వెలుగు మురియక ముందే,
కన్నడ, మరాఠీ, తెనుగుల మూలధ్వనులు
ఒకే ఊపిరితో పలికిన గొంతుక లానాడు!
ఆంధ్ర మాతృకకు అక్షర సంతకాలు అవన్నీ!

తెలుగుదనం కవిత్వమై తీర్చినవారెందరో...
పదంపదంలో ఒక ప్రతిజ్ఞగా నిలిచినవారు!
ఒకనాటి మౌనానికి విముక్తి పలికినవారు...
ఇప్పటి తెలుగు ధ్యానానికి ఆకృతులైనవారు!

నన్నయ యుగం అది...
భాషా పునరుజ్జీవన వైతాళికం
ప్రతి పదం, ప్రతి వాక్యం, ప్రతి పద్యం
జన హృదయాలను తాకిన తెలుగు సేద్యం!

పాల్కురికి సోమనాథుడు జనం కవి
జానుతెనుగు కావాలన్నాడు కవితకు
సామాన్యుడే కథానాయకుడుగా ఆయన
అసామాన్యతను తెచ్చాడు సొంపైన తెలుగుతో!

'యయాతి చరిత్ర' వ్రాసిన కవి
'తెలుగన్న' తన పేరన్నాడు...
ప్రబంధ పరమేశ్వరు డనటంకన్నా
ఇంపుగా ఉందీ పరవశనామం!

'శుద్ధాంధ్ర కవిని' అన్నాడు తనను
ఆడిదము సూరన్న గర్వంగా!
ఉభయభాషా కవిమిత్రుడి కన్నా
ఘనమైన తెలుగుదనపు ప్రకీర్తి ఇది!

సంస్కృతం రాని మహాకవులే
తెలుగులో వ్రాస్తారని ఈసడించినా,
మడమతిప్పని మహనీయులున్నారు మనకి...
అచ్చతెలుగునే నమ్మిన కలం యోధులు!

పర్వతాల్లో ప్రతిధ్వనిగా...
ప్రేమగానపు పలుకుబడిగా...
ఆనాటి అసలు పేరు ఆంధ్రం!
శబ్దస్వరూపమై వెలిగిన వేదం!

**** **** ****

3. ఆంధ్రుల ప్రశస్తి

మబ్బుల చక్రాల రథంపై సాగే చంద్రుడిలా,
నిశ్శబ్ద నాదాల మధ్య వెలిగే వెన్నెలలా,
అమ్మ పలుకుల నేతి దీపపు వెలుగులో
కదలని 'రాతిరాత్రి'ని కరిగించే భాషాచేతన!

ఆమె భాష మనకో జీవజావళి
పాలలోంచి నీళ్లను వార్చే మరాళి
నిజానిజాల మధ్య నడిచే నిశ్శబ్ద రవళి
జ్ఞానంతో అల్లిన మాటల తారావళి!

ఒక భాష-వేల పదాలుగా విరబూసి
కోటి కాంతిధారలు స్రవించినట్టు...
ఒక మాట-చైతన్య జ్వాలగా ఎగసి,
లోకమంతా వెలుగులీని వికశించినట్టు...

ఆదికాలమర్మంలో
అంధకుల గాథలలో నిలిచిన జాడలం,
ఆంధ్రుడి ఆదిస్వరూపంగా
భారత భాగవతాలలో అవుపించిన నీడలం!

కాలం అంటే గడియారం
టకటక మోత కానేకాదు –
అది నాటక మించి జాలువారిన
త్రికాలజ్ఞానపు మాటల పరివారం!

ఎక్కడివాడు ఆంధ్రుడు?
ఉపనిషత్తులు, బ్రాహ్మణాల నడుగు...
తెలివెలుగు నడులందుకుని,
జ్ఞానసింధు తీరాల చేరిన తెలుగు

ఎవరమీ ఆంధ్రులం? ఎప్పటివారమీ జాతీయులం?
చరిత పుటలలో జాడలు కొల్లలు మనవి –
శిలాశాసన సాక్ష్యాలెన్నో... సాహిత్య భాష్యాలింకెన్నో...
జనపదుల గీతాలే చరిత్రగర్వమై నిలిచాయి!

ఆంధ్రజాతీయులు ఆదిజాతుల ఆరంభనేతలు
అమరిన అమర అక్షర స్వరూప దివ్యఖ్యాతులు
పాళీ ప్రాకృత సంస్కృతుల కలయికలో వెలిగిన
ఉపనిషత్తుల జ్ఞాపకాల ఆంధ్రజ్యోతులు...!

మానతత్త్వం నేర్పింది, బౌద్ధం
శాంతిమార్గం చూపింది, జైనం
వేదాచారాల అక్షరబంధంతో
నవ్యరూపం ఇచ్చింది సంస్కృతం...

ఇది కలయికల కాలం –
భాషల సంగమం, భావాల సమ్మేళనం
స్వావలంబన కోసం ముందడుగేస్తూ
తెలుగు చేతన వెలిగింది భాషాకూడలిలో!

ఇది ఓ అద్భుత సమాగమం!
శరీరానికి అంతరంగం తోడైనట్టు,
అక్షరాలతో భావాల తేనెలు రంగరించి
తెలుగు సాహిత్యానికి తియతీయని సోయగం!

బౌద్ధగాథలలో 'అంధకు'లనే పిలుపు....
బ్రాహ్మణాల్లోనూ మెరిసింది ఆంధ్రులతలపు...
దమిళులూ, అంధకులూ మ్లేచ్ఛులన్నారు పొగరున
అంధకరక్ష 'ఘటాఘటి'ని చూసి ఈసున!

అస్సకుల పౌరుషం, మూషికుల కీర్తి
ఆంధ్రరాజుల చరిత్ర వేయివెలుగుల కాంతి!
మ్లేచ్ఛులన్నవారే వచ్చి ఆశ్రయించిన వైనం...
ఆంధ్రజనపథం జ్ఞానపథమయ్యింది 'క్రమకళి'గా!

లాటిన్, సంస్కృత భావగంగలో 'అంధ'...
దాని భావం మానవుడని! జ్ఞాన జనుడని!
ఆంత్రపాలజీలో 'ఆంథ్రోస్'అంటే, మనిషి!
ప్రాకృతంలో అది 'అంధక'గా నిలిచింది...

సంస్కృతంలో సంస్కరించి 'అంధ' అన్నారు...
ఆత్మచైతన్యంతో అదే 'ఆంధ్ర'గా వికసించింది!
కాలగర్భంలోంచి కాంతిమహోదయంగా
'ఆంధ్ర' నామమే నిలిచింది కీర్తిమయంగా!

భిక్షువుల పాదాల వెంట నడిచిన నాదం
'అంధకరఠ్ఠ' అందుకు అక్షరసాక్షి!
బుద్ధుడికి గొడుగు పట్టిన తొలిశిష్యుడు
ముచిలింద నాగుడు అతను ఆంధ్రతేజుడు!

ఆంధ్రం, ఆంధ్రపథం, ఆంధ్రమండల ఘోష
క్రీస్తుకు పూర్వపు స్వతంత్ర స్మరణలివి!
అంధక నుండి ఆంధ్రదాకా సాగిన యాత్ర...
భాషోపనిషత్తులలో ప్రతిధ్వనించిన చరిత్ర!

పూర్వద్రావిడ తాత్త్వికధ్వని...
'తెల్' అంటే తేటతెల్లం, తెలపటం!
తెలుగు స్వరం... తెలియచెప్పే శక్తి!
తెనుగు నుడి... దక్షిణాది శ్రుతి!

జ్ఞానానికి నిలయమైన జాతి ఇది,
ధ్యానపథం చూపిన పాత్ర మనది!
పలుకుల్లో తత్త్వజ్వాలలుంటే
పరివర్తనలో పరమార్థం పొంగుతుంది!

తెనుఁగు, తెలుఁగు త్రిలింగ నాదం...
ఘోషించిన చరిత్రగాథ – తెలుగు!
శబ్దసూక్ష్మత నుడి నిశ్చలత...
అనాదిగా ఆస్వాదించిన తెలుగు!

తెలుగుదనం పునాదిగా నిలిచిన ఆనవాళ్లం
సింధు సరస్వతి తీరాల దాకా వెలిసిన వాళ్లం!
పదపద్మాల్లో పరిమళించే తత్త్వసారం
తల్లిమాటల తేనె తరంగాల్లో తేలినవాళ్లం!

"త్రిలింగ" మూలం అంటారు గానీ.....
ఏ మూడు లింగాలూ
తెలుగు తీరాలకు హద్దులు కావు!
దీపకాంతికి ఎల్లల కొలమానాలు లేవు!

తెనుగు–తెలుగు–జాతిపురాణ స్వరధారలు!
వేలయేళ్ల పూర్వపు నినాద గానాలు
భువిపై పలికిన తొలి తెలుగు సజీవనాదాలు
పేరులోనూ పెన్నిధి... జ్ఞాని,మౌని, ధ్యాని ఆంధ్రుడని!

ద్రావిడ భాషామతల్లి గర్భంలో
ఆంధ్రం ఓ తొలి శిశువు...
ఆర్య ఋషుల పద పద్మాల పీఠంపై
ఆంధ్రుల గౌరవమే వెలుగులైన స్థానం!

ఆంధ్రగోదావరి తీరాన పంచవటి
సీతారామ లక్ష్మణుల నివాసం!
ఆ భూమి ఓ కాననం కాదు వేదకలశం...
అక్కడే మెరిసింది అనంత భక్తివాహిని!

సుగ్రీవుడు ఆజ్ఞాపించాడు...
ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య దేశాల్లో
సీతజాడ వెదకాలని!
ఒక్క ఆజ్ఞలో అఖండభారత రేఖలు!

నాట్యశాస్త్ర సృష్టికర్త భరతుడు,
ఏడు 'విభాష'లలో చేర్చాడు ఆంధ్రాన్ని!
మనుస్మృతిలో నిషాదులం మనం...
ఒక్కోయుగంలో ఒక్కోపేరుతో ఆంధ్రులం!

మెగస్తనీసు వ్రాశాడు చరిత్రపుటల్లో...
మౌర్యులంతటి ధనికులు ఆంధ్రులని!
అశోకుడు ప్రకటించాడు స్పష్టంగా...
ఆంధ్రులు బౌద్ధమార్గ ప్రవాహకులని!

రోమన్ల ప్యూటింగర్ పటంలో వెలిగిన
"ఆండ్రె ఇండి" అంధ్రుల ఆదిరేఖ!
ప్రపంచపటంపై మొలకెత్తిన గుర్తు,
తెలుగువారి తొలి విశ్వముద్ర!

వేదకాలానికే విభవించిన వాళ్లం
ఐతరేయబ్రాహ్మణంలోనూ ఉన్నవాళ్లం
ఒక్కో గ్రంథంలో ఒక్కో కథ మన గురించి...
ఆత్మతనమే ఆయుధంగా ప్రకాశించినవాళ్లం!

విష్ణువే ఆంధ్రుడై వెలసిన విష్ణుజాతీయులం!
శివుడికే కన్నిచ్చి కన్నీరు తుడిచిన కన్నప్పలం!
వానగండాన బుద్ధుడికి గొడుగుపట్టిన ఆదినాగులం!
సమరసత్వం, సహజీవనసారాలను చాటిన ఆంధ్రులం!

శ్రీపర్వతాన ధర్మచక్రం తిప్పిన శాంతమూర్తుల సూక్తులు
విశ్వజనహృదయాలలో వెలిగించిన కరుణజ్యోతులు
జీవకారుణ్యరససుధాస్రవంతులు ఏరులై పారగా,
మానవతా మార్గం చూపిన బౌద్ధమూర్తులకు జోతలు

బోధిద్రుమ ఛాయలో వికసించిన జ్ఞానపుష్పాలు,
లోకమంతా పరిమళించిన శాంతిసందేశాలు,
దిగంతాలు దాటిన ధర్మఘంటా నిక్వాణాలు
విశ్వవనరుల కందించిన తెలుగు బౌద్ధగణాలు!

సత్య బోధనలు విశ్వహృదయాల కందించి
నిత్యకాంతిజ్యోతులతో శాంతిమార్గాన్ని చూపించి
తప్తకాంచన భావాలతో పుడమిని పసిడిగా మార్చి
సదా నిలిచిన బౌద్ధతత్త్వం -మానవతానాద విపంచి!

ఆపస్తంబసూత్రాల ఆచారధారులం,
అక్షరతత్వ గౌరవ నిర్మాణకర్తలం!
వేదవిహిత మార్గం వెలిగించినవారలం,
శాశ్వత ఆంధ్రసంస్కృతి వాహకులం!

మూషిక రాజ్యపు మొలకనుంచి
కళింగ వినువీధుల దాకా...
అశ్మక నుండి ఆంధ్రనగరిదాకా...
అమ్మ పలుకు – ఓ లయ! ఓ నాట్యం!

అపరాధి కన్న కొడుకైనా లెక్కించని మాధవవర్మలు
ధర్మసింహాసనమెక్కి న్యాయం నిలిపిన రాజరాజన్యులు
ఆనందులు, కాదంబులు, శాలంకాయనులు విష్ణుకుండినులు
ఆంధ్ర భూ సంప్రదాయాలు కడు ఆదర్శనీయాలే ఎన్నడూ!

కళింగులు, గాంగులు, చోళులు పశ్చిమ చాళుక్యులు వరుసగా
వేంగి చాళుక్యుల వారసులు తూర్పు చాళుక్యులై విరాజిల్లగా!
కాలగర్భాన దీపస్తంభమై నిలిచిన భూవరుల పరంపర...
కీర్తి శిఖరమై వెలిగింది చరిత్రలో తెలుగు రాజ్యరమామణి!

శాతవాహనులది "ఆంధ్రభృత్య" గౌరవం,
విష్ణుకుండిన, ఇక్ష్వాకులూ –
శాలంకాయనులదీ అంతే గర్వగీతం...!
ఆంధ్రులమని శాసనంగా నిలిచిన వైనం!

వారసత్వంగా ఇచ్చిన భాష, సంస్కృతి
వాక్యాల వైభవం తెలుగులో నిలిచింది!
రెండువేలయేళ్ల భాషా సంప్రదాయాలతో
పలుకుబడుల ప్రాచీనిగా వాసికెక్కింది!

ఉద్యోతనుడు ప్రాకృతంలో అంటాడు...
రసికధీరులు, రూపసులు ఆంధ్రులని
అందగత్తెలూ, పదునైన కత్తులూ వారికి సమానమే!
దేహపుష్టి, భోజనపుష్టి వారి సొంతం

అటు, పుటు, రటు అంటూ తిరుగుతారంటాడు...
కాల్చేయటం... అటు! పొటమరించటం...పుటు!
కోలాహలం... రటు! యుద్ధజీవుల రణప్రియత్వం!
ఆంధ్రులకు గెలుపు సంకేతం "అటు పుటు రటు"!

శ్రుతిచేసిన వాద్యపు తీగను తాకినట్టు
ప్రతి మనిషి లోపలా ఒక రాగం పల్లవిస్తుంది...
మనసు గమనిస్తే, శ్రవణం అందుకుంటే,
అమ్మభాషకు మించిన శాంతము లేదు!

*** *** ***

రేనాటి చోళుల ధనుంజయుడు
తొలితెలుగు శాసనకర్తగా వెలిగినవాడు!
తెగని తెలుగు వాక్యానికి ఆద్యుడు...
తొలి శాసనరేఖల అవతరణకు బాధ్యుడు!!

'కందుకూరు' నగర కీర్తికాంతిని
బెజవాడ దాకా పరచిన
పండరంగడి తరువోజ శాసనం...
శిలపై ముద్రించిన సుస్వర సందేశం!

రాజ్యాలు నశించాయి, రాజులు మరుగయ్యారు
రాచరికం... ఉనికినే కోల్పోయినా...
శిలాక్షరాల గానమే మిగిలింది చివరికి
కీర్తిని నిలిపే సాధనమై... చరిత్రకు సజీవసాక్ష్యమై!

ప్రతిష్ఠానపురం ప్రతాపధామం,
ధాన్యకటకమే ధనవైభవం,
శ్రీ కాకుళమే శోభానిలయం,
శాతవాహనులు నిలిపిన శౌర్యవాహిని!

లక్షవిలుకాండ్ర విఖ్యాత సేనావాహిని,
దక్షిణాపథ సువర్ణ రాజసూయం,
అవక్ర విక్రమ అఖండ తేజం...
శాతవాహనులు నిలిపిన మహా శౌర్యం!

ఆ వంక పాటలీపుత్ర మీవంక ధనకటకాలు
దారిపొడవునా కట్టిన రణవిజయతోరణాలు
తెలుగుజాతి ఖ్యాతి చాటిన సజీవసాక్ష్యాలు
కాలజావళి కీర్తించిన పట్టాభిషిక్త కిరీటాలు

గ్రీసు నుండి సయామ్, చైనా దాకా
సముద్రుడికి పంచెకట్టి ఆంధ్రుణ్ణి చేశారు!
ఓడ నడిపి గెలిచిన శివకుడి పేరు
ఘంటసాలలో స్వర్ణాక్షరాలలో వ్రాశారు!

జావా, బలి, బోర్నియో ద్వీపకాంతులలో
ఆంధ్ర స్వర్ణ సంస్కృతీపతాక లెగరేశారు
సువిశాలాంధ్ర భూ వెలుగుల విరజిమ్మె
సుధారశ్మిలను నేలంతా పరిచారు!

కౌసల్యను పిలిచాడు వాల్మీకి 'మహాంధ్రీ' అని!
అమ్మ పుట్టింటివారు ఆంధ్రులై వెలిగారు,
మేనల్లుడై మురిశాడు మన రాముడు పరమాప్తుడు!
జాతి గర్వమై నిలిచేది ఈ కథ మన పుణ్యావశాన!

అజంతా అమరావతుల ఆలపించిన చిత్రగాథల
ఉండవల్లి బెజవాడ గుహల వెలయించిన సజీవ రూపాల
మహాంధ్ర శిల్పుల వెలిగించిన అమృతజ్యోతులవి...
యుగయుగాలగా విరాజిల్లే పసిడి కాంతులవి!

కవిలోకానికి అన్నయ, ఆదికవినన్నయ పలుకులో
చాళుక్యాన్వయ రాకాచంద్ర రాజరాజనరేంద్ర పిలుపులో...
పద్మపత్రంపై జలబిందువులా నిర్మలమై
జగద్ధితంగా వెలిగింది ఆది ఆంధ్రభారతవాణి!

నన్నయ కావ్యాత్మలోని ప్రసన్నకథాకలితార్థయుక్తి,
శ్రీనాథుని - వాగ్ఝరిని మీరిన ఖడ్గధారా నిశిత అభివ్యక్తి,
పోతనామాత్యుని కరుణరసప్లావిత కవితాకృతి ప్రశస్తి,
శ్రుతి స్మృతి పురాణేతిహాస రసార్ణవప్రవాహధీశక్తి!

కాకతీయుల వీరచరిత్రం లలితహృదయకళాప్రాభవం
తెలుగుదనానికి పౌరుష తిలకం తీర్చిదిద్దిన వైభవం
తెలుగు జాతిని ఒక్క తాటికి తెచ్చిన పాలనావైదుష్యం
తిక్కన, జాయప కలాలిచ్చిన సారస్వత ఆయుష్యం!

రాల లోపల కోటి పూలు పూయించిన రామప్ప గుడి
విమలశిల్పానల్ప వేదియై విలసిల్లు వేయి స్తంభాలగుడి
రాజమహల శిల్ప ప్రాకార రమ్య కిరీటాల విరాజనమై
బంగరు సీమగా మార్చిన తెలుగుమూర్తులు కాకతీయులు!

రెచ్చల రుద్రాచార్యుడు లేడిప్పుడు...
'శిల్పశాస్త్రరత్నం 'రామప్పగుడి ఉంది నేడు!
'ఒక చెరువు-ఒక ఊరు ' కాకతీయుల నినాదం
లక్నవరం, పాకాల, భద్రకాళి చెరువుల తరంగనాదం!

అలనాటి ఓరుగల్లు పోతరించిన ఘనత,
అభిరామమై వెలసిన హంపీ విజయనగర శౌర్యం;
రక్తముద్రలతో రాసిన వీరగాథల స్థైర్యం,
భువనమంతా వినిపించిన ఆంధ్రుల మహిమ!

కొండవీటిలో కర్పూర చందన కస్తూరికా పరిమళాలు
రసిక హృదయాలు గీరనగింజలాడిన రత్న ప్రవాళాలు
రెడ్డిగం వేసుకుని రాజ్యవాణిజ్యాలనేలిన కొండవీటి ప్రభువులు
కర్పూర వసంతరాయలన్న బిరుదున్న కళారచనావతంసులు!

'పద్యాల పటం 'లో వెలిగే చక్రవర్తి, అక్షర వారధి,
తెలుగు మాధుర్యాన్ని ప్రజల గుండెల్లో నింపిన రాజకవి
పద్యరాగాల సువాసన రేకెత్తించిన కృష్ణదేవరాయ కవి...
సాహితీ సమరాంగణ సార్వభౌముడు భాషా పరంధాముడు!

అక్షర రసాల తోటలో మధురిమలు ఫలించే సాహితీ మూర్తిమత
కాలాన్ని దాటే మధురత, పద్యరచనలో శాశ్వత సౌందర్యం
అల్లసాని పెద్దన నాటిన కవితా కల్పవృక్షం అనంత ఫలదాయిని!
నందితిమ్మన పెంచి సాకిన కామధేనువు అపూర్వ క్షీరదాయిని!

అటు ఏడుకొండల పైన తిరుమలేశ్వరుడికి
అన్నమయ్య పదకీర్తనల నైవేద్యాలు, మానవత కోసం...
ఇటు వాడవాడలలో ప్రజాకవి వేమన్న
ఆటవెలదుల సంస్కారాలు, 'మనిషితనం 'కోసం...

దక్షిణాంధ్ర యుగతారలు క్షీరధారలు
తమిళ నలుగట్ల మధ్య వెలిసిన తెలుగు కోనేరులు!
భాషకైనా, భావానికైనా, బొమ్మకట్టే శౌర్యానికైనా
సుల్తానులకు లొంగని పరాక్రమ పరిమళ పన్నీరులు!

కందుకూరి "అక్షర విందు "కోరి ఏతెంచిన ఆంధ్రభారతి,
పిడుగు గిడుగు వాడుక నుడి వేడుకల మంగళారతి,
సరాల మౌక్తికాల గురజాడ అడుగుజాడల జీవద్యుతి,
"కదలాడే నవ్యభారతి "విశ్వనాథ తీర్చిన 'మహతి 'శ్రుతి!

సముద్రాలకావల దేశవాసుల
హృదయకుసుమాల తెలుగు వికాసం
రాష్ట్రానికావల ఆసేతు హిమాచలం
తెలుగు పుత్రుల ఎద దివ్వెల ప్రకాశం

కృష్ణవేణీ తరంగిణీ మువ్వల వెలుగుల
క్షేత్రజ్ఞాని రసపథ పదసింగారాలు...
వేదనాద రాగ మేళమైన కీర్తనల
త్యాగరాజ గాన నీరాజనాలు....

సిద్ధప్రసిద్ధ కళలకాణాచిగా
కూచిపూడిని తీర్చిన సిద్ధేంద్రులు...
పలుకు బంగారపు తళుకుల
రామార్పణం రామదాసాగ్రజులు...

శ్రీశైలం అడవుల్లో శాంతి దీపం వెలుగు,
అరకు పలుకుల్లో పటిక తీపి ఖ్యాతి
నెల్లూరు వీధుల్లో అచ్చతెలుగు గానం,
రాయలసీమ రాగాల సందేశం,

రామప్ప శిల్పాల నాగిని శోభ...
ఉండవల్లి గుహలో మౌనగంభీరత!
విజయనగరం వీణాశబ్ద గర్వం,
బనగానపల్లె తియ్యందనపు స్మృతి!

అరసవిల్లి ఆదిత్యకాంతి, లేపాక్షి కళాకాంతి -
ఆంధ్రావనికి మధ్యమణి అమరావతి...
బెజవాడ ఆదినగరం ఆరంజ్యోతి...
ద్రావిడ, భారత తేజోమయ ఖ్యాతి!

సింగరేణి గుండెల్లో మిన్నంటిన తెలుగుస్వరం
ఖమ్మం పొలాల్లో పచ్చని పదాల కనకం!
చార్మినార్ నీడలో తెలుగు మౌనసౌందర్యం,
విశాఖను తాకే అలలసంగీత లయ!

శ్రీకాకుళపు సూర్యోదయ పసుపురేఖ,
పలాస తోటల జీడిపప్పుల జలతారు!
వంశధార, నాగావళి కళింగఖ్యాతి...
ఆదిత్య హృదయపు మేటకాటపు శ్రీకాకుళం

కాళేశ్వరం జలాల్లో ప్రతిధ్వనించే జలఘోష
నిజాం తోటల్లో మెల్లగా మురిసిన తెలుగు,
వేములవాడ వేదికపై వేదగానసౌందర్యం,
ఓరుగల్లు శిథిలాల్లో గర్జించిన గాథలు...!

సుగంధ మరంద భరిత సుషమ కుసుమాలనొదిలి,
గరువంపు తేటి ముంగురుల వెంటపడే పథికుట...!
రహెపుట్టి జంత్రగాత్రాలతో రాళ్లు కరిగించే నాదాల నొదిలి,
కరకర గరగరట గుండెలల్లార్చే ధ్వనులకు ఊగె అరసికుట...!

మధురసశోభితమైన పసిడి మామిడిపండ్ల నొదిలి,
ఆమ్లవిషాల నిషాలెక్కించే రంగునీళ్లు కోరే పిపాసకుట...!
పున్నమి చంద్రికల చల్లని నీడలో 'వెన్నెలకుప్ప'లాట లొదిలి,
కొక్కిరిబిక్కిరికూతలకు మురిసే అకాలకూష్మాండ నిరర్థకుట

భాషను మరచి సంస్కృతి విడిచి...
'మర'లాగా మారి, మనిషి మొరటౌతున్నాడు
జీవితాన్ని ఆనందించటం అంటే,
కృత్రిమతను 'కొని' తెచ్చుకోవటమే!

* ***   ****   ****

4. పలుకుబడుల పరిమళాలు

ప్రతి పదమూ భాషల ఆకాశంలో మెరిసే నక్షత్రమే!
దివ్యతేజమై అలరిస్తుంది మనసుని!
మాటల్లో మెరుపులు మౌనంలో మాధుర్యం...
జీవన పథానికి వెలుగిచ్చే దారిదీపం...!

ఆకాశ మండలం ఇరుసుమాను నంటుకుని...
తిరగలిపిడిచుట్టూ తిరిగే తిరుగుడురాయి లా
అక్షరాల పరిభ్రమణం... అది భాషాకర్షణ!
భాషను చుట్టుకున్న బ్రహ్మాండ వలయాలు

ప్రతి అక్షరమూ ఒక్కో గ్రహం...
ప్రతి భావమూ ఒక్కో కాంతి వలయం...
ఇది మనభాష...ఇది మన అక్షరమండలం...
ఆకాశవీధిలో భాషాసూర్యుడి ప్రత్యక్ష సేవ!

ఇది భాషా సౌరవ్యవస్థ!
ఇది మనిషి మనసు చుట్టూ తిరిగే
పదాల పరిభ్రమణానికి ఆదిప్రేరణ...
భావమే సూర్యుడై వెలుగులు వలయిస్తుంది!

వాక్యాలు శబ్దగోళాలై మెరిసిపోతున్నాయి
తాత్త్విక గమనానికి 'పాలరెక్క'లా
హరితకాంతులు విరజిమ్ముతున్నాయి!
మన అభిమానమే భాషకు గమనగమ్యం!

తన తాత్త్విక పరిమళాలతో
తన కాంతుల మార్మిక ధ్యానాలతో
తనంత తానే ఒక శబ్దవిశ్వం!
మనసంతా పరవశించే ప్రాణపూర్ణస్వరం

తల్లి గర్భాన ఉమ్మనీటిలో
ఎదిగే శిశుహృదయంలోనే
విలాసంగా ఒదుగుతుంది భాష
'ఎండలోని నీడ'లా మమకారం!

వేదన-ఉత్సాహం-వేకువల కాంతి-
భావాల ఆత్మవిలాసం భాష-
ఊపిరితో కలసి ఊసులై, మనసుతో కలసి భావాలై
ప్రతి పలుకులో అమ్మతనపు సంస్పందన!

శబ్దాలే శ్వాసలు, పదాలే నాడీప్రవాహం
వాక్యాలే రక్తకణాలు, భావాలే రసధాతువులు
భాషాశరీరం సజీవ భావరూపం
ప్రతి పదమూ ఓ హృదయగానం!

శబ్దం పుట్టే ప్రతిక్షణమూ శ్వాసలలయ!
భాషాశరీరానికి జీవనాడి!
పదం పలికే ప్రతి కల – ఓ జీవిత రాగం!
పలుకుల సంగీత విభావరి జీవితం!

ఒక్కో అక్షరమూ ఒక్కో జీవకణమై వెలుగుతుంది!
వాక్యాల దేహానికదే మూలకణ మౌతుంది!
ఒకటి రెండై రెండు నాలుగై విస్తరిస్తుంది...
"ఏకోఽహం బహుశ్యామి" మంత్రంలా!

పదం పూవైతే... భావం దాని పరిమళం!
అక్షరాల మకరందమే భాష వికాసం!
శరీరానికి జీవుడిలా...మనసుకు భాషే ప్రాణం!
మాటల్లో మెరుస్తుంది మనసులోని వెలుగు!

అక్షరాల విత్తన మెరిగిన కాలం –
వేదాల వానలో నానిన జ్ఞానం –
పదబంధ మణిమేఖలం
తెలుగమ్మను అలంకరించిన వైనం

భాషల అడవిలో పెరిగిన వృక్షాలు –
ప్రాకృతం, సంస్కృతం, తెలుగు పలుకులు –
కొమ్మలకు వెలుగుల బంధాల చిగుర్లు –
వాక్యాల పరిమళం పరచిన వనాలు!

చెట్లూ చెట్లూ ఒరుసుకుంటూ...
కొమ్మలూ రెమ్మలూ పెనవేసుకుంటూ,
మాటల చెట్లు మహామాను లయ్యాయి
పెనుతీపి పదాల ఫలాలు విరగకాశాయి!

అరబ్బీ, పర్షియన్, ఆంగ్లాలూ...
చోటు చూసి అక్కడే చేరుకున్నాయి,
సంస్కృత ప్రాకృత పాళీ వృక్షాలు
అప్పటికే అక్కడ గుబురువిడిచాయి!

తెలుగుతల్లి ఒడిలో తలపెట్టుకుని
మాటల చరిత్ర సేద తీరింది...
దేశిపదాలకు దేశాంతర పరిమళాలు నింపింది!
తేటతెలుగు మాటల్లో తేనె నిండింది!

మన భాషలో ఒక పరాయి పదం కనిపిస్తే
చీపురు నక్క శివాలయానికి వచ్చిందంటారు!
పరభాషల్లో అనేక తెలుగు పదాలు కనిపిస్తే,
మొలవని మీసానికి సంపెంగనూనె లంటారు!

దారొకటి ఏర్పడిందంటే,
రాకపోకలు రెండింటికీ రాచమార్గం!
పదాలూ ఊసుల
స్నేహపూర్వక హంసగమనం అది!

జాతులు కలిసి జీవించినా
జాతిలో జాతి కలిసిపోయినా,
భాషల సంస్కార సంగమమే
ఏ భాషకైనా నుడికథ!

ప్రవాహశీలి భాష... పరిణామశీలి కూడా!
వాగులూ వంకల్లా పదాల చేరిక సాధారణం!
అన్యదేశ్యాలు సరస్వతిలా ఒదిగి ఉప్పొంగాలి!
కొత్త అవసరాలను తీర్చే అతిథిలా నిలవాలి!

*** *** ***

తరతరాల ఆకాశగంగలా,
తెలుగు సంస్కృతి వెలుగులు...
వాక్యాల వర్ణాల స్వప్నచిత్రాలు,
మన ఆశల వెన్నెల పాటలు!

మొగ్గలు విచ్చుకునే నాదంలా,
పుడమి పులకించే మెలకువల్లా,
వసంత పరిమళం గాలిలో తడిసి—
చెట్ల కొమ్మల్ని తాకింది... తెలుగై!

ప్రకృతి నిండా తెలుగు, ప్రవృత్తి నిండా తెలుగు
మనచుట్టూ మనలోపల మార్మిక మంత్రమిది!
మనల్ని మనం కాదని ఎందాకా పోగలం!...?
దేశాన్ని విడవటం కాదు, భాషను మరవటం!

అచ్చతెలుగు విడిచి ఆంగ్లానికే పిలుపు
ఇంటి ఆలి విడిచి వెలయాలి వలపు!
పసిపాటల లోకం పరాయిదైపోయింది
తల్లిమాటల తీపి చేదై దూరమైపోయింది!

దాపురించిన ఆకురాలు పాడు కాలాన
ఒక్కో పదమూ ఒక్కో శతాబ్దంలా రాలుతోంది!
రాలుగాయిల రోజులివి, కుల్లాయిగబ్బాయిల యుగమిది!
తల్లిభాషని ఒత్తిగొట్టాన బెట్టిన దారుణమిది!

కంటతడి తుడుచుకుంటున్న తల్లి ముఖాన
నిశీధివీధిలో నిశ్శబ్దమై నిలిచిన అక్షరాలు—
పసిపాపలా మెలకువొచ్చిన మాటలు
ప్రపంచమంతా వలసకు బయల్దేరాయి!

విదేశీ గాలిలో వాడిపోతున్నాయి...
మన ఊరి ఉచ్చారణలు—
మాటల 'మర్మమరుపు'దాచుకున్న
మనం మహామౌనమయ్యాం...!

మన పదాలను మరిస్తే, మౌనమే మిగుల్తుంది...!
వాక్యాల వెలుగుకి చలనం చీకటవుతుంది!
ఉన్నది వదలి కొత్తదారికి ఆశపడటం,
చిత్తశుద్ధి చెదిరి ఆత్మవంచనకు సాగిలపడటం!

తెలుగు పూదోటలో విడవని పరిమళాలెన్నో!
సంస్కృతం పారసీ, పోర్చుగీసు, ఇప్పుడు ఇంగ్లీషు
తెలుగు తాంబూలంలో ఆకూ, వక్కా సున్నంలా
మనవైపోయిన మాటలే! అవి మన గుణగంధాలే!

నేతిలో వేగిన జీడిపప్పులా పరాయి పదాలు
మన మాటల పాయసానికి తీయందనాలు!
తల్లి భాష మరుగుకాని రీతిలో
అన్యపదాలు మనసు తెరిచి కాంతినివ్వాలి!

*** *** ***

కావ్యాల వాకిట వ్యాకరణం కావలి!
ప్రజల పలుకులకూ పదనీరాజనం...
సామాన్యుడి నోటి మాధుర్యమే
వాగ్దేవికి పాదాభివందనం!

గ్రామ్యాలు కావవి ప్రజల వాడుక మాటలు!
మట్టివాసన వాటి లక్షణం అది ఆత్మసౌందర్యం!
గ్రామ్యగర్వమే సోయగంకావ్యానికి!
వాడుకపదాలే బాంధవ్యంశాస్త్రానికి!

పదాల పెంపు - ప్రపంచ భాషల లక్ష్యం
ఏటా చూస్తూనే ఉన్నాం...కొత్త పదాల చేర్పులెన్నో!
ఆంగ్ల నిఘంటువు ఆక్స్ ఫర్డ్ లో ఎడతెగని కూర్పు!
కొత్తమాటల సంబరం ఆంగ్లేయులకది!

'గోబ్లిన్ మోడ్' ఓ నూతన ఆంగ్ల పదం...
'ఏదీ పట్టని నిర్లక్ష్యం'... అది దాని భావం!
భాష పట్ల మనదీ 'గోబ్లిన్ మోడే' ఇంకా...
భాషా జడుడికి పదాల మల్లెచెండు నిచ్చినట్టు!

పలుకుల వాడకం తగ్గిన ప్రతి క్షణమూ
ఒక భయానక నిశ్శబ్ద శవక్రియ...
మాట చేజార్చిన ప్రతి సందర్భమూ
మన సంస్కృతి మరణానికి వీలునామా!

పలుకుల పసిడిపై పడిన పరాయిపదాల 'పాదరసం'లా...
మందార కుసుమాలపై 'వెర్రివేచే' వడగాడ్పుల వానలా...
"భాషా పల్లకీ" భారం మోసే తెలుగు భుజాలపైన
పచ్చికాయలు కాచి, వాచి, నొప్పిస్తున్నాయి!

పలుకుబడుల పట్టాల మీద ఇప్పుడు...
పరాయి పదాల రైలుబళ్ల చప్పుడు!
పొగలు చిమ్ముతూ, ధూళి లేపుతూ
ఉల్లికుట్టుపలుకుల తిక్కరేపుతూ!

చిల్లి కుండలో నీళ్ళు పడ్తున్నాం...
వచ్చే పదాలు తక్కువ, పోయేవి కొల్లలు!
నియమం లేదు, నియంత్రణ లేదు...
నిష్క్రమించే పదాలకు లెక్కే లేదు!

బస్సూ, రైలూ, కారూ, కంప్యూటరూ
వాడుకలో రోజూ వెలుగుతున్న మాటలే...!
కాదని, మనవి కాదని తిరస్కరిస్తారా?
మనవి కాని పేర్లపైన మన పెత్తనమేమిటి?

శాస్త్రసాంకేతిక పదాలకుఅనువాదం దేనికి?
సంస్కృతాన్నాశ్రయించి ఇది తెలుగంటారు!
అడుగు మాటలెక్కడివో వండి వారుస్తారు...
చివరికి 'ఇక చాలు బాబో...'అనిపిస్తారు!

అన్యపదాల స్వీకరణలో ఆంగ్లేయులే అధికులు!
ఉలవచారును తమ భాషలో చేర్చుకున్న సాధకులు!
పాత నిలవాలి! అందులో ఆధునికతా మెరవాలి!
సంప్రదాయమే కాదు సామర్థ్యమూ ఎన్నికకు నిలవాలి!

తెలుగు పూతోటలో
సంస్కృత పదపరిమళాలెన్నో...
పాలపుంతలై ప్రవహించిన
పార్సీ క్షీరధారలెన్నెన్నో...

ఊసుల్లా మనసుల్లో ఒదిగిన
ఉడతకేచు శబ్దజాలాలెన్నో...
పలకరింపుల్లా ప్రవేశించిన
ఆంగ్లసాంకేతికాలు ఇంకా ఎన్నో...

భాషాశరీరరచనలో పదాలు, పదబంధాలూ
దట్టంగా అల్లుకున్న నాడీజాలాలే అన్నీ!
పదమే శ్వాసగా, పరిచయమే ప్రాణంగా
ఈ ధాతుమయ కోశానికి మాటలే ప్రాణాలు!

తెలుగు భాష ఆసుపత్రి పడక అందుకే!
మారేకాలానికి మారని మన తత్త్వం...
భాషాపరిణామాలను పట్టించుకోని పాపం...
విదేశీ మోజు... భాషకు అసలు శాపం...!

సంప్రదాయాలకు తీరిందింక నిద్రవేళ...
పలుకుబడుల్లో పండాలిఉగాది గేయం,
ప్రతి పదంలో పరిమళించాలితెలుగు,
ప్రతి హృదయంలో ఉదయించాలి 'నుడివెలుగు'!

'పై వంతెన' అంటాడు ఫ్లైఓవర్ని పల్లెవాడు!
ఊర్ధ్వవారధి అంటాడు చదువున్నవాడు!
'దోమల పొగచుట్ట' అన్నాడో రైతన్న!
మస్కిటో కాయిల కిది అచ్చతెలుగు పలుకన్నా...!

పలుకుల్లో పూసిన పరదేశపు రజనీగంధాలు,
మన మట్టిలో అరవిరిసిన
బొప్పాయి, అనాస రసాలు
వాడుకలో మెరిస్తే అవి తెలుగు నక్షత్రాలే!

“కారులో షికారుకెళ్ళే...” అని పాడితే
తెలుగు కొచ్చిన అవమానం లేదు!
ఆదికాలపు గాలి తాకిన సంగీత సుస్వరం,
అన్యపదం కాదు... అనుభూతి పల్లవం!

షావుకార్లు, సర్కార్లూ, ఆసాములూ
తెలుగులో కలిసిపోయారేనాడో...!
పదాల పుట్టుక కాదు, ప్రయోగమే జీవితం!
శబ్దజీవితపు సహజమార్గసంచలనం!

బార్లీకి తెలుగు పేరున్నదా?
మనదిగా చేసుకుంటే అది
భాషా పరాజయం కాదు,
భావ వ్యక్తీకరణ పరిపక్వత!

మాట తీరుకు ఇది మార్పు,
భాషల పరంపరకు ఒక గొడచేర్పు!
తెలుగును తాకిన శబ్దపుష్పాల సమరసం...
అమ్మభాషకు తోడైన మాధురీపరిమళం...

ప్రతి అక్షరం ఓ విద్యుల్లత మెరుపు –
ప్రతి ఉచ్చారణ ఓ హృదయ స్పందన!
అవసరానికి చాచిన ఆపన్నహస్తాలు...
మనభాషే మనకిచ్చిన ప్రతాపశౌర్యాలు!

అన్యపదాల కావు అతిథిపదాలు...
సంస్కృతి సింధువులో మాటల సంగమాలు!
భాషలపాలపుంతలో పదాల అయనచలనాలు
ఏ పదమూ తక్కువ కాదు నక్షత్ర కాంతిలా!

నేరం నెట్టి ఎవరిని నిలదీస్తారు?
పరాయిపదాన్నా? దాన్ని పలికిన నోటినా?
సంస్కృతిని నిలపాలన్నదే లక్ష్యం!
మాటల వాడకంలో విచక్షణే కొలబద్ద!

'బస్సు రోడ్డున స్పీడుగా పోతోంది... '
వాక్యంలో పోతోంది ఒక్కటే తెలుగు!
అదికూడా మాయమైతే భాషకు గతేంది?
వాక్యాల్లోంచి అక్షరాల్లోకి తెలుగు తరిగిపోతోంది!

బస్సు రోడ్డూ స్పీడూ... జనం మాటల్లోకి వచ్చేశాయి!
తెలుగుతో కలిసిమోగుతున్న శంఖనాదాలివి!
వచ్చినవి గుప్పెడన్ని జారిపోయినవి కొండడన్ని...
చిల్లి కడవకు నియమాల మాట్లు వేసేదెవరు?

"టెంపులు కెళ్లి కోకోనట్ బ్రేక్ చెయ్యి..."
ఇదీ రోజూ వినే మాటే...
తల్లికి గౌరవం లేని నోట...
దయ్యపు కేకలా కర్ణకఠోరంగా!

మనకు లేని పదాలను స్వీకరిద్దాం
ఉన్నవాటిని పొందికగా నిలుపుకుందాం...!
పలుకుబడి పోతే పరంపర నశిస్తుంది!
భాష వెలిసిపోతే జాతి కొడిగడ్తుంది!

చరిత్ర పరితపించిన చోట
పదాల పసదనం పోయి రోదిస్తాయి!
కూలిన గుడిసెలో నలిగిన మౌనం
గతజన్మల కథలెన్నో చెబుతుంది!

అలనాటి మాటల చివురింతలన్నీ
అచ్చతెలుగు సువర్ణాలే!
పలికేవారి కోసం ఎదురు చూద్దాం!
పదాల మల్లెదండలతో స్వాగతిద్దాం!

కాలంతో కలసిన మాటలు కాలుష్ణి దాటాయి..!
కాలానికి ఎదురీదినవన్నీ కాలగర్భంలో కలిశాయి...
పదిలపరచుకున్నవే కావ్యగర్వాలు,
మనసులో గుడికట్టుకున్న శాశ్వతరూపాలు!

*** *** ***

'లష్కరీ' పదం...
సైనికుడని అర్థం పర్షియాలో!
తెలుగులో 'లసికిరి' అయ్యింది ముద్దుగా!
రక్తికట్టిన రణపథ రాగభరిత పదం!

'లసికి' అంటే తెలుగులో కొత్త అర్థం...
కంఠంపై కత్తి రక్తం చిమ్మిందని!
పరాయి పదాలు ఇలా...
పద్మరాగాల్లా మెరవాలి!

పదం ఏ భాష నుంచి వచ్చినా
మన వాక్యంలో ఒదిగితే అది తెలుగే!
మన ఊసుల్లో ఒలికిన ప్రతిపలుకూ
మన మాటలతో మమైక్యమే!

సెల్‌ఫోను, కంప్యూటరు, ఇంటర్నెట్టు...
ఇప్పట్లో ఇవి తెలియని వారెవరు...?
'చరవాణి' 'కరచాలనం' అంటుంటే...
'వినుకలి' లేని 'టింగనానువాదాలు'!

"కఫీ"ని 'కృష్ణ ఉష్ణ పానీయం' అనాలా?
రైలుని 'ధూమవికీర్ణచోదిత శకటం' చేయాలా?
భాషా విన్యాసం కాదిది, భాషాభ్రమల దుర్వాసన!
"పదాల పాదాలలో దిగిన ముల్లు" అని నిర్వేదన!

'గుంటూరును 'గర్తపురి' చేయటం...
అమ్మని "మమ్మీ"గా మార్చటమే! ...
మార్పు కాదిది మనసులో మలినత్వం
భాషకు శవపేటిక సిద్ధం చేయటమే!

దడికట్టి భాషను దాస్తారెందుకు?
మడి వెలుగుల నింపే శాస్త్రపదాలను
అంటరాని వంటా రెందుకు?
భాషకు తాళాలు వేస్తారెందుకు?

పదాలు పెరగటమే భాషకు ప్రాణం...
తెలిసినా ఏమారుస్తా రెందుకు?
నవత్వం అంగీకరించని నియమాలు
తల్లిమాటల విరోధు లౌతారెందుకు!

ఎండుటాకు కాదు, భాష... మహాపర్వతం!
స్థిరమైన సంస్కృతికి అది ఆలంబనం
పర్వతాల శిలలే అక్షర ఆకృతం...
వాటిలో వెలిసిన జీవరేఖలే శాశ్వతం!

తెలుగు వాక్యాల తామరకొలనులో...
ఆంగ్లపదం ఒక సందర్శకుడు!
'సంధి 'కుదిరితే శబ్దం అలరిస్తుంది...
సంఘర్షణ పెరిగితే సంస్కృతి నీరసిస్తుంది!

కొత్త ఉపకరణాల రాక, సరికొత్త మాటలకు శోభ!
పరిశ్రమల ఊపుకు సాంకేతిక పదాలే శ్వాస, ఆశ!
తలుపులు తెరుచుకుంటున్నాయి విశ్వమంతా...
అన్యపదాలకు అప్రకటిత స్వాగత లేఖలు!

కొత్త పరికరాల్ని నడిపించే పదాలే నేటి అవసరం!
భాషలోనే ఉంది వెలుతురును మండించే భాస్వరం
తలుపులు మూసుకున్న నిశ్శబ్ద మౌనికి
నవశబ్ద నవశతాబ్ద కోలాహలం దేనికీ...?

సాంకేతికత దూసుకుపోయే వేగయుగం ఇది!
తెలుగులో పరికరాలు పనిచేస్తేనే మనుగడ!
కొత్త పరికరానికో కొత్త పద్ధతికో చాలినంత
మన మాటే శబ్దసత్యమై రాజ్యమేలాలి!

పరిచయం స్నేహమే, పరాయితనం కాదు!
అర్థమెరిగి ఆమోదిస్తే అవమానం కాదు!
భాష మారినా భావం మారదు...
భవిష్యత్తుకది ఆహ్వానమే, పొరబాటు కాదు!!

***** ****

5. మాండలిక శోభ

తనను మరిచినా అలగదు... అమ్మ!
తనువు మగ్గినా చిగురించే దీపం... అమ్మ!
తొలి పలుకుల ముత్తెపు రాశుల్లో మానపు వెలుగు
శబ్దకాంతిని జలపాతం చేసే శాంతిపర్వం... అమ్మ!

మన భాషకు ప్రాణనాడి... అమ్మ!
మన యాసకు మూలరేఖ...అమ్మ!
మట్టిబొమ్మకు గుండె నిచ్చిన దేవత...
జీవితం పాఠశాలలో తొలిపాఠం అమ్మ!

అమ్మ ఒక మాట కాదు, ఆదిమ గీతిక!
అమ్మ ఒక రూపం కాదు, ఆనంద ఆదిత్యం!
పదాల్లో ఓదార్పు, పదబంధాల్లో ఆత్మగానం...
మనిషి మనసులో ఆదిశక్తి అవతారం అమ్మ!

మనసు పలికే స్వరం...అమ్మ మాట
చీకటి గదిలో కుసుమ జ్యోతి ప్రకాశం...
శూన్యంలో తానే ఏడుగుర్రాల రథసారథి
దైన్యంలో కరుణారసపు తేజఃపయోనిధి

తన కడులో ఉమ్మనీటిలో
ఊహల ఊయల లూగే వేళ
తన భాషను రుచి చూపింది... అమ్మ!
యాసలోని ముద్దుల తేనెపాట...అమ్మ!

ఈ పుడమి తల్లిని కడుపులో
దాగిన పద సంపద లెన్నో!
మాటల మడిలో విరిసిన
పచ్చని పలుకుల పరిమళాలెన్నో!

నదీతరంగాల చిరునవ్వుల స్వరాలు,
తల్లగసాగే కాలువల గలగలరాగాలు,
పర్వతశ్రేణుల గంభీర ఝంఝూమారుతాలు
మధురగీతాల మాండలికపదాలు!

ఉత్తరం నుండి పడమర దాకా
సీమల గడపల గీతయాత్ర...!
పల్లెల పల్లకీలలో పలికిన గానం
మౌన భావాలను తాకిన విశ్వవిపంచి!

మాండలికాలన్నీ
అచ్చతెలుగు పలుకులే!
అగ్నికణాల చెకుముకులు...
ఒరుసుకుంటే అంటుకునే దీపశిఖలు

మాండలికాల్లో తపన ఉంది, తపస్సుంది,
వాటిలో ప్రజలున్నారు... వారి ఊపిరి ఉంది!
పామరుడి పలుకే పసిడినాణెం,
పరమార్థాన్ని పలికించే ప్రజ్ఞావేదం!

కనురెప్పల పొలం గట్లమీద కాసిన
కలల దోసపండ్లు మాండలికాలు!
వాక్యాల తేనెలో సుధానందం రంగరింపు
'భాషాసేద్యా'నికి అరక మాండలికం!

తన పలుకులు... పక్క ఊరి పలకరింపులు...
ప్రతి మాటలో బంధుత్వ తళుకుల సందడి
ప్రతీ ఊసూ "ఇది మా నుడి!" అని పరవశించాలి...
తీయని మాటల సొగసు లోకాన వికసించాలి!

చప్పుడించిన ఒకనాటి మాటల జాడలు
ఒక ఊరి ఊసుల చెంగుల సందడి ఇప్పుడు!
'మాండలికం' అది... మట్టి పరిమళాల వాహకం
నేల పొదిగికొనిన దండకవిలెల జ్ఞాపకం!

కావ్యాలకు మాండలికం బహుదూరం!
గ్రామ్యాలు గుమ్మాలు దాటని విరోధం...
కావ్యాలు - సమాజ సూత్రాలకు బహుదూరం!
'ఆతలనుండి ఈతలదాకా' తెరవని కనకద్వారం!

పల్లెపటుకే వాక్యానికి ఊపు...
ప్రజల మాటే కవితకు లోతైన చూపు!
మాండలికం ఓ పరిపక్వ సంకేతం...
వారసత్వ వాస్తవికతకు సాకేతం!

కవికి ప్రతి పదమూ శక్తి ఆయుధమే!
అర్థాల అస్త్రాల్లో దాగిన అంతశ్చేతనం!
పదాల పుట్టుక తెలిసిన యోధుడికి
ప్రతి ప్రయోగమూ ఓ ప్రకాశయోగం

ప్రాసల కవిత ముస్తాబైన వనిత!
నిజసౌందర్యాన్ని కప్పిన కృత్రిమత!
కవితకు అసలు సొబగు మాండలికం...
దాని సోయగం అరసినదే రసికం

ఒకచోట "చల్ల", మరోకడన "మజ్జిగ"
రుచి ఒకటే... పలుకులే వేరు!
ప్రాంతీయ భిన్నతల సంగీతం ఇది...
భాషావైవిధ్య సమాజం తీరు దానిది!

బౌద్ధం శ్వాసించిన నేలల్లో "పంచదార",
తక్కిన తెలుగుతోటల్లో "చక్కెర"
"పంచన్న దార... పంచదార" అని!
బౌద్ధభిక్షువుల తీపికానుక ఇది!

తీపి ఒకటే... పేర్లే వేర్వేరు...
ఇది చరిత్ర మాట్లాడే తేనెధార –
తాత్త్విక జాడలతో పదాలెరిగిన భాషకి!
ఊరుల వెన్నంటి పారే యేర్లు మాండలికాలు!

'పిడక కుంపటి' అంటారొక చోట,
"దాలిగుంట" అని మరొక చోట...
'కూరాకు'– ఒకరికి ఆకుకూర!
అది మరొకరికి మాంసంకూర!

'మంది' అంటే మనసారా కలిసిన బంధం,
పదంలో పొంగిన ప్రేమానుబంధం
'ఏంది' అంటే ఏమిటి, ఎందుకు, ఎలా...
చిన్నమాటలో ఎంతో ఆలోచనా ప్రవాహం;

కుమ్మరి సారెపై మట్టిముద్ద ... పోలి!
అమ్మవారి రూపం పసుపు ముద్ద... పోలి!
వంటగదిలో చపాతీ పిండిముద్ద.... పోలి!
పదం ఒకటే, పరమార్థాలే వేరు...

పోలి 'గా పలికింది... పోలికగా మారింది...
పుల్కాగా లోకమంతా చేరింది!
ఒక్కమాట అనంత లోకాల్ని
చుట్టుకుంటూ వెళ్లింది.. .!

ఒక మండలానికి అరణం కాదు, ఆభరణం
భాషాస్రవంతికి అదనం కాదు, అమరిన శోభ!
'అక్కడి పలుకు' అనేదే గౌరవం మాండలికానికి!
అందరి పలుకైతే అరవిరిసిన భాషాసౌరభం...

ఒక్క శబ్దంలో యుగమంత భావం వికశిస్తుంది!
ఒక్క పలుకులో పరమార్థపు పరిమళం పరవశిస్తుంది!
ఒక్క మాటలో ఆర్తి ఆద్యంతాల మధ్య ఆవహిస్తుంది!
మన ఊరి పలుకు అనేదే ఆత్మగౌరవ సంకేతం!

మాండలికాల మధురసాన్ని
పారిభాషికాల శాస్త్రసారాన్ని
పదిల పరచే మహానిఘంటువు
కావాలిప్పుడు అందరికీ!

ఊరుమాటలే ముద్దుగా రావాలి పిల్లలకు,
ఊసులు చెప్పే పదాలు నేర్పించాలి అందరికీ
ఆబగా తెరచిన పాఠ్యపుస్తకంలో
తన ఊరి పరిమళాలు ప్రేమగా పలకాలి!

గడప గడపలో పల్లవించిన మాండలికరాగం
ఊరి ఊపిరిలో పుష్పించిన వాక్యపరాగం
మాట, చేత జత కలిసిన అనుభవాల భాషాసేద్యం
తేటతెలుగును నిలిపిన పల్లె తీరపు భాషా సౌందర్యం!

మనిషినీ మనసునూ కలిపేది భాషాబంధమే!
అక్షరాలకు ఊపిరిచ్చే తత్త్వమే వాడుక భాష!
పల్లె జీవుల కన్నీళ్ళలో పండిన మాండలిక మకరందం
ప్రజల ఊపిరి నింపుకున్న వాడుకభాషానందం!

వ్యాకర్తలు కట్టిన మాటల కోటలు
కాలంలో కరిగిపోక నిలిచేవెన్ని...?
పామరులు పెంచిన మాండలికాల తోటలు
అవి మన ఆస్తి వారసత్వం! ఇది సత్యం!

ఊరెల్లా పలికే 'వెన్నెలభాష' ఊపిరి లోకానికి!
వాడుకభాషే 'అల్లాలుబెల్లం' ప్రజారంజకానికి!
సాహితీసింహాసనం పైన తేజస్సు ప్రజాభాషే!
బంధానుబంధాల వాస్తవికత వాడుకభాషే!

తాడు పడితేనే కలిసి అందరూ
భాషారథానికి కదలికలు!
అందరినీ ఒక 'తాటి'న నడిపేది
పల్లెపలుకుల మాండలికాలు!

*** *** ***

6. మినుకు పలుకులు

(పారిభాషిక పదాలు)

తేనెగా తెచ్చిన నవ్య సాంకేతిక పరిమళం...
కొత్త పదాలకు కదలిక ఇచ్చిన తల్లిభాష!
కమ్మని నుడుల కలయికల వెచ్చని స్నేహం...
పరాయి పదమూ మనదైతే మధుర సమ్మేళనం!

మాటల చెట్టుకి అక్షరాల విత్తనాలు!
నీళ్లు పోసి సాకుతోంది కాలం!
గుత్తులుగా పదాల ఫలాలు!
వాక్యాలు వేళ్లై విస్తరించాయి,

పదబంధాలు పూలై పరిమళించాయి!
ఆకులమాటున తొంగిచూసే తెలుగురాగాలు
కొమ్మకొమ్మనా కవికోకిలలు ఆలపించాయి...
రెమ్మరెమ్మనా తెలుగు గలగలలు పల్లవించాయి!

పారిభాషిక పదాల మల్లెపరిమళాలు
తెలుగు తళతళలతో జీవధారాస్రవంతి
మీగడ తరకలు తేలిన శాస్త్రక్షీరసాగరం!
అడుగడుగునా అనుభవం నేర్పే పాఠం...

ఇంగ్లీషు అరువు కొత్త అనుభవం కాదు...
సంస్కృతపు తేనెరుచి తెలియందీ కాదు....
'మన మాటలే మన బలం' అనుకోవాలి!
మన భావాలే మన ధనంగా మలచుకోవాలి!

పామరుడిని పరంపరగా చేరాలంటే, శాస్త్రం...
భాష మారాలి! బోధనలో తెలుగు చేరాలి!
భాష్యం మారాలి! భావనలో తెలుగు ఒదగాలి!
మాటలలో 'మాతృస్పర్శ'... మన్ననతో ఎదగాలి!

పరిభాషకు పరభాషే దిక్కంటూ డొకడు!
సైన్సుకి తెలుగు చాలదంటూ డింకొకడు!
పదాల కొరత అనేది భాష రానివాడి మాట!
కొత్త మాటలు పుట్టుకొస్తాయి జనంనోట!

తల్లి భాషలో 'పరిభాష'ను ప్రసరించే
భాషా సాంకేతికత పెరగాలి!
పదాల జ్ఞానమే చదువుల మణిదీపం
స్వరాల శక్తితో సత్యం వెలగాలి!

పదాలకు పూర్ణచంద్రికల పుష్పార్చన
నిర్వచనాల బంధాలు దాటి
వాడకంలో పెరిగిన వాక్ప్రవాహం,
మన ఊపిరిలో వినిపించే విస్తరణ ధ్వని!–

ఒక పదమే... నాడిలో నాటిన స్పర్శ!
ఒక పలుకే... హృదయపు మూలధ్వని!
పదబంధాలు పంచభూతాల మేళవింపు
భావరసాలొలికే రూపక కాంతికిరణం!

చీకటి చిక్కబడేకొద్దీ ఒక వెలుగు –
తన్నుకు వస్తుంది... లోపల్నుంచి!
ఆర్తి, ఆర్ద్రత పరిపక్వ భాషను తాకితే
మనసంతా 'విరజిమ్మే' కాంతులు!

ప్రతిక్షణమూ నిశ్శబ్ద సంకేతం...
శూన్యాన్నికమ్ముకున్న పొగమంచులో
పరమతత్త్వపు వెలుతురు చిగురిస్తూ –
పరమానందపు ఆలాపనే మన అస్తిత్వం!

*** *** ***

లాటిన్లో 'క్వాడ్రాంగులారిస్'నాలుగు పలకల తీగ!
నలుపలకలున్నది నల్లేరయ్యింది తెలుగులో!
ప్రతి పదమూ ఒక శాస్త్రమై వెలిగిన భాష మనది
ప్రతి పదబంధమూ ఒక చరిత్రగా నిలిచిన జాతి మనది!

రష్యా, చైనా, జపాన్, జెర్మనీ, కొరియా
తమ భాషలోనే సైన్సుకు స్వరాలిస్తాయి!
అక్షరమే ఆయుధం అనువాదం కాదు...
ఆత్మవిశ్వాసమే జ్ఞానానికి మూలం!

జపానులో 'రీకా' అంటే సైన్స్...!
చైనాలో 'కే ష్యూ', రష్యాలో 'హయ్కా',
జెర్మనీలో 'విస్సెన్షాఫ్ట్', కొరియాలో 'గ్వాహక్'
మరి తెలుగులో సైన్సుకి పేరే లేదా...?

"సైన్స్"కి తెలుగు పలుకే లేదంటారు...
"శాస్త్రం" మన ఉలుకు కాదు పొమ్మంటారు...
భాష తలవంచితే జ్ఞానం పుడుతుందా?
తల్లిపలుకు తరిగిపోతే మేధ పెరుగుతుందా?

ఎరుక అంటే జ్ఞానం! అచ్చతెలుగు చిరునామా!
అక్షరార్చన మరచితే ఎరుకలేకపోతారు!
పండితుల బుర్రలో లేని సరంజామా లెన్నో!
భాషను బద్ధకించిన శూన్యకాల సంధ్య ఇది!

'ఉడివోనిమిన్కు"లంటే వేదశాస్త్రాలు!
మినుకులంటే అచ్చతెలుగున శాస్త్రతేజాలు...
ఎరుకలో మెరిస్తే, అది "మినుకు ఎరుక"
శాస్త్రజ్ఞానానికది తల్లిమాటల పరిమళం!

మినుకు పలుకుల గుట్టువిప్పితే
శాస్త్రజ్ఞానం కట్టలు తెంచుకుంటుంది!
వెన్నెలవలె శాస్త్రసాహిత్యం
వెలుగులతో మురిసిపోతుంది!

సామాన్యుడి మది చేరే వచనం కావాలి,
తెలుగులో 'మినుకు ఎరుక 'తేలిక్కై నడవాలి!
అనువాదం కత్తిపైన సాము కాదు...
సాన మీద గంధపు చెక్కసంచారం!

పదం ఒక విత్తన రూపమైతే,
అర్థం అనుభవాల నిగారింపు,
పారిభాషికత శాస్త్రపు శ్వాస,
పలుభాషాసంగమంగా జ్ఞాన ప్రవాహిక!

చెరువుల నీడలో చిగురించిన జీవగీతి మనది...
పల్లెపదాలతో పెరిగిన జాతి పరిమళం మనది!
పాడిపశువుల పాటలే మన జన్మగాథలు!
మంచినీళ్ళంటే, మజ్జిగ ఇచ్చే మర్యాద మనది!

మట్టికి పర్యాయపదంగా మెలిగిన పల్లెబతుకు
వరికంకుల్లో ముద్దులొలికే నమ్మకం మనది!
చెరువుల్లో సేదతీరే గేదెల గాథల గొంతు,
పసిడితనం పంచే పరమతత్త్వపు పల్లెవాణి!

కలువల విస్తరాకులు చెప్పే కాలపు కథలు
కందివాసనలే కవితలైన పంటచేల వీథులు
వాకిలంతా వ్యాపించిన మేకల పాటల ఊసులు
తరతరాల తడిలో పులకించిన తల్లి పలుకులు!

నేలపై పాదాలు, గగనాన మనోరథాలు...
తెలుగురైతు వామనావతార విశ్వరూపం పల్లె,
శబ్దాల శతాబ్దాల మట్టిలో పలుకుల మల్లె!
పైరగాలుల సేద్యకవితాస్వరాల దండపూమల్లె!

శాస్త్రం దూరమైనా, పదాలే దారులు చూపిస్తాయి—
శబ్దాల నీడలోనే శాస్త్రజ్యోతి చిగురులు వేస్తుంది!
తత్త్వాల తాత్వికతకు తెనుగులో మెరుపులు...
పల్లెపదాల్లో శాస్త్రం తళుకుల్లా మెరుస్తుంది...

*** *** ***

'పాలు'...
ఒక జీవచైతన్యం! భాషకు వెలుగు,
బాష్పాలను తుడిచే ఆశ...
జాతి మూలాల లోతుల్లో మెరిసే మణిపూస!

పిడించి తీస్తారు కాబట్టి... 'మిల్క్',
పితికి పిండుతారు కాబట్టి... 'దుగ్ధం'
మరి, తెలుగులో పాలకు మూలం ఏమిటీ?
తల్లిమనసే మాటల మర్మానికి మూలం!

ద్రావిడభాష మూలపుటమ్మ
ఇచ్చిన కమ్మని పదం 'పాలు'!
వేల ఏళ్ల భాషాయాత్రలో అవి,
అమృతత్త్వం నిండిన అమ్మరూపాలు

పాలకు మూలం "పాడి"
పావనత నింపిన తెల్ల వెల్లువ!
'సరిగమపా'ల అనురాగ గీతం...
ఆంగ్ల, సంస్కృత శబ్దాల కందని తాత్త్వికత!

అనగననగ రాగంలా, అతిశయిల్లే రసగానంలా...
తినగతినగ వేము తియ్యనైన తీరులా,
కాయగాకాయగా పాల శుద్ధమౌతాయి
పొంగిపొర్లాలి పాల - జీవుడి తపోవేదనలా!

ఆరుసార్లు పొంగి చల్లారిన పాల...
తెలుగులో అచ్చమైన పేరు 'ఆనవాల!
అగ్నితప్తక్షీరం అది,
ఆత్మశుద్ధి నొందిన చేవ్రాల!!

పాలను ఇలా కాయడం...
తెలుగువాడి యుక్తి! సంస్కార విజ్ఞానం!
చిరుపాలన్నారు రాయలవారు
పరిపరి కాచిన పాలని ఆముక్తమాల్యదలో!

పాలను ఇలా కాయడం...
చెడును తొలగించే క్షీరతత్త్వసారసంగ్రహం!
పాపాల తొలగించే మోక్షమార్గం!
మలినాల వదిలించే పవిత్రమార్గదర్శనం!

పాశ్చురైజేషన్... పాశ్చాత్యశాస్త్రం దానికి పెట్టిన పేరు!
పాలు ఇలా కాయాలని...లూయీ పాశ్చర్ చెప్పాడని!
ఇది నూటయాభై యేళ్ళనాటి ఆధునికశాస్త్రప్రయాణం!
అనాదిగా తెలుగింటి ఆచారానికి గుర్తింపే లేని వైనం!

ఎప్పుడో చెప్పాడు శ్రీనాథుడు "ఆనవాలు పాయసం"
అప్పుడే అన్నారు కవులంతా 'ఆనవాలే'రాజసం!
'ఆనవాలు'ఇస్తుంది శరీరానికి జీవధాతువుల్ని!
శుద్ధక్షీరాన తోడుగిన చెడు ఆనవాల్లేనిదిగా!

ప్రతీ తెలుగు పదంలో శాస్త్రమే పరమార్థం ఉన్నతంగా...
ప్రకృతి రహస్యమే అందులో దాగుంది పరమాద్భుతంగా!
అర్థాలు వెదకని మనసుకు ఏ పదమూ 'కొబట్టదు'!
తెలుగు చాలదంటారువీళ్ళే... తామే చాలనుకున్నవాళ్ళు!

*** *** ***

తోడు...ఆనవాలుగా కాచిన పాలలో
అమ్మచేతి మజ్జిగ చుక్కల చేదోడు!
క్షీరకన్యకు చల్ల పురుషుడితో పెళ్ళి ...
నవదంపతుల నవ్యశోభనం – పెరుగు!

కంచు చెంబులే మేళతాళాలు,
వేడి ముద్దుల వెచ్చదనం కౌగిళ్ళు,
తెల్లవారేసరికి...పెరుగై మురిసింది
పెళ్ళింటి లోగిలి... సద్యోగర్భ సాక్షిగా!

పెరుగులోనూ ఉంది శాస్త్రం,
తల్లితనపు తాత్త్వికతలా...
తోడుకున్నది పెరుగు...
అది తీపి, పుటపుల జీవతత్త్వం!

పాలలో తెల్లవార్లూ పెచ్చగా
'పెరుగు'తున్న కొత్త జీవుడి ఆత్మ!
ఉపయోగపడే సూక్ష్మజీవుల
పెరుగులో నవచైతన్య నాట్యం!!

సాంకేతికపదాలలో పెరుగు...
తెలుగుమాట అది తొలిమెరుగు!
ప్రపంచానికి జీవశాస్త్రం నేర్పిన
పేరులోనే పెన్నిధి... తెలుగువెలుగు!

పాలు, పెరుగు, నెయ్యి, నూనె
ప్రతి తెలుగు పదానికీ ఒక శాస్త్రం,
ఆకు చాటున పండులా
పదాల వెనుక దాగిన ఒక చరిత్ర!

'పెర్'అంటే పెరిమ... ప్రేమ... పరవశం...
'పెర్'అంటే పెరగటం విస్తరించటం
పెరుగులో సూక్ష్మజీవుల ఉనికిని
పెరగనివ్వాలనే వైజ్ఞానిక సూచన ఇది!

శాస్త్రం దీన్నిప్రోబయటిక్ అనవచ్చు
'జీవానుకూల ద్రవతత్త్వసారం' అని!
మనకు మాత్రం ఇది అమ్మచేతి పెరుగు!
పదంగా కాదు, పరమార్థాల వెలుగు

మన పదాల్లో తాత్త్వికత
గంగలా స్వేచ్ఛావాహిక!
మన పదాల్లో దార్శనికత
యమునలా స్వచ్ఛదేహిక!

మన పదాలలో శాస్త్రీయత
సరస్వతిలా అంతర్వాహిక!
తాత్త్విక, దార్శనిక, శాస్త్రీయతల
త్రివేణీసంగమం ప్రాచీన తెలుగు!

'కూడు'- అన్నానికి ఓ తెలుగుపేరు...
వాడకం మరచిన చారిత్రక మడిపసిడి!
కూడి నలుగురూ పంచుకునే సంస్కృతి...
కూడటం మరచిన మనుషుల విస్మృతి!

తన తిండి తాను వండుకున్ననాడు,
ఆదిమకాలాన సమకూరిన మడి!
కూడి పంచుకున్నారానాడు 'కూడు'!
ఇది తొలి జీవతత్త్వానికి చారిత్రక సాక్షి!

"పారిభాషికాలకు పరభాషే దిక్కు"
నిన్నటి మాట అది!
"సాంకేతిక యుగాన ఇది అమ్మభాష హక్కు"
ఈనాటి ఉద్యమం ఇది!

ఈ నేలలో నాటిన మాటల బీజాలు
పరాయి పదాల పదఘట్టనల కింద
నలిగిన ధనియపు గింజలిప్పుడు!
తలెత్తి మొలకెత్తుతాయి కొత్తిమీరిళ్లు!

*** *** ***

కోర్టు గదిలో తెలుగు మాటల జల్లు
మన 'భాషాహక్కు'ల కిది హరివిల్లు
న్యాయదేవత అందించే ఆశీస్సు...
ఆంగ్లం ఎడారిలో అది ఒయాసిస్సు

న్యాయవాదులు తెలుగులో వాదిస్తే
న్యాయమూర్తులు తెలుగులో తీర్పిస్తే
న్యాయం వినిపిస్తుంది మన గుండెల్లో,
అర్థం అల్లుకుంటుంది మన మాటల్లో।

తల్లి మాట న్యాయవాణి కావాలి...
ప్రజల శ్వాసకి ఊపిరి తానై నిలవాలి...
తెలుగులో తీర్పు పేదవాడికి ముక్తి!
తెలుగులో వాదన ప్రజాస్వామ్య స్ఫూర్తి!

వందేళ్ల నాడే పాలన మనమాటల్లో జరిగితే,
పాలనా పారిభాషికాలు మనకూ ఉండేవి!
అమ్మభాషలో మనమూ చదివి ఉంటే
మాటలు చేతలై వెలిగి ఉండేవి!

ప్రతి పదంలో పరిమళించే ప్రేమ,
ప్రతి శబ్దంలో ప్రతిఫలించే మాధుర్యం
ఏ భాషైనా పరిభాష గర్వంగా వికసించాలి –
ఏ యాసైనా యంత్రాల హృదయంలో ఒదగాలి!

తెలుగు ఇంజనీర్లు తెలుగులో ఆలోచిస్తే
యంత్రభాష తెలుగులోనే గణగణ మంటుంది!
చిప్పుటూ కోడుటూ యంత్ర ధర్మాల చరాచరం
'తెలుగుదనం' 'ఓహరిసాహరి'అవుతుంది!

నిఘంటుకర్తలు పరిశీలించరు...
ప్రజలు ఏదీ పట్టించుకోరు...
శాస్త్రపదాలు కొరుకుడు పడవు తేలికగా
బహు విస్తారం వాటి అర్థాలు పొందికగా...

*** *** ***

7. అధికారభాష

1-8-1795...
మూడు నూరేళ్ల నాటి మాట...
జె ర్యాంఘుం... మచిలీపట్టణం జిల్లా కలెక్టర్ !
ఇంగ్లీషులో అర్జీని దూరంగా నెట్టాడు....
తెలుగులో వ్రాస్తే పనివిన్నాడు !

ఇంగ్లీషుతనపు అహంకార వీధుల్లో
తెలుగుపదాలకు పాదఘాతాల రోజులవి!
అయినా మనమాటకో మన్నన ఇచ్చాడాయన!
“తెలుగులో రాసివ్వు”... ఎంత కమ్మనైన మాట!

తల్లిపాల తాగిన వాడు
తెలివి తేటల వెలుగు రేడు...,
పోతపాల బతుకు
పరాయి కంచంలో ఎంగిలి మెతుకు!

పరతంత్ర పాలన జనజ్వలిత గాథ!
శివుడికైనా అలవి కాదన్నాడు శ్రీనాథ!
పరభాషా పల్లకినెక్కి పాలకుల నిద్రా ఊర్మిళం!
తెలుగు కథ నివురుకిందనిప్పుల పరిమళం

కర్జన్ లార్డు కుతంత్రంతో ఆనాడు...
బెంగాల్ విభజనాయుధం వాడాడు!
తిరిగొచ్చి తన్నే బూమరాంగ్ విసిరాడు!
అది బ్రిటిష్ వారికి తొలి మరణశాసనం...

అది మొదటగా జాగరమైన జాతి
చీకటిలో చివురించిన స్వాతంత్ర్యజ్యోతి
"ఒక్కటే మనభూమి" అన్న...దేశఘోష!
వందేమాతరమని గర్జించిన స్వతంత్ర గీతి!

తెల్లవిషం 'పారద్రోలాలనే తపన...
జనజీవనంలో జ్ఞానజ్వలన...
స్వరాజ్యం వెలిగింది జనం మనసున...
సురాజ్యరాగం పలికింది వీధివీధిన!

బంగాళాఖాతం తరంగాలపై
వందేమాతర ఘోష మారుమోగింది...
మహారాష్ట్రపు మట్టిపైన
స్వదేశీ స్వరం పడగలెత్తి ఆడింది!

ఆంధ్రుల గుండె లోతుల్లో
వెలిగిన భాషాదీప కాంతులు,
అఖండ భారతాకాశాన
అరవిరిసిన అరవిందాలు!

'అమ్మా నీకు వందనం' అన్నరోజు
తెలుగమ్మ మంత్రమే తారకమై నిలిచింది,
భాషాస్వేచ్ఛ జన్మహక్కై వికసించింది,
భావిబాటలో వెలుగై ప్రసరించింది!

దేశ స్వాతంత్ర్యజ్వాల ఒక వైపు –
మాతృభాషాదీప్తి వేరొక వైపు,
స్వరాజ్య పథం దేశీయుల సుస్వప్నం
స్వరాష్ట్ర ఉద్యమం తెలుగు సంస్పందనం!

జాతీయోద్యమానికి తోడైన ఆంధ్రోద్యమం...
బాపట్ల మహాసభ ఆంధ్రతేజోనిధి దర్పణం,
'తెలుగుతల్లి' భావన అలా...
అప్పుడే వెలిసింది రాయప్రోలు పుణ్యాన!

చెరకురసం లాంటి మాట తెలుగు –
చెరకుపిప్పై మిగిలింది వాడిన వెలుగు
సంస్కృతి నలిగింది, నైతికధర్మం నీలిగింది...
పరాధీనత పొంగులెత్తింది పునరావృతంగా!

ఆంగ్లేయయుగాన మద్రాసుకే వెలుగు
మన దిక్కంతా దిక్కుమాలిన చీకటి!
తమిళులకు తలపాగా, గౌరవ కిరీటం...
మనకేమో చింకి చాప, చిరుగు దుప్పటం!

అటువైపుకే స్టీమర్ల నడకలు...
రైలుబళ్ళ నిశ్శబ్ద కూచుక్ చుకులు ...
పరిశ్రమల సైరన్ లేవీ వినబడని వల్లకాడు
ఆంధ్రలో అభివృద్ధి “ఆకాశ పంచాంగం ”ఆనాడు!

స్వాతంత్ర్యం వచ్చినా
వదలని పరతంత్రపు జాడ్యాలు
నాడు లాఠీలు విరిచిన ఆ అధికారులే
స్వతంత్రంలోనూ ప్రజల వెన్ను విరిచారు !

భాషకోసం ప్రాణాలిచ్చిన యోధుడు
అమరుడై నిలిచాడు పొట్టి శ్రీరాములు...
భాషోద్యమాన్ని రాష్ట్రోద్యమంగా మార్చి
భాషసంగతే మరిచారు మన పరంధాములు !

తల్లివాక్యాలకు బెల్లుబోటీ లిచ్చి,
పాలకుల మాటల నిండా తెలుగే...
చేతలకొచ్చేసరికి చేతినిండా కలుగే!
మాయమయ్యిందేనాడో మాటకు మన్నన!

ఆత్మత్యాగపు ఒక మూగరోదనకు
భాష కోసం ఒక బలిదానపు స్మృతికి
వారూ వీరూ అనవేల పొడిచారందరూ..
తెలుగుమాధ్యమం రద్దంటు వెన్నులో బాకు! !

మాట్లాడే భాషలో చక్కగా పాలిస్తే,
ప్రజాహృదయానికి దగ్గరౌతుంది ప్రభుత!
పక్క చూపులతో 'పాచిపెత్తనం' చేస్తే
రహదారిలో వెలగని వీధిదీప ఘనత!

మనసులో మాటని జనం
చెప్పుకునేదే అమ్మభాషలో నిజం!
వినతుల్లో కూడా సవితి భాషేనా?
తెలుగులో పాలనకే ఓటంటూ రెవరైనా!

భాషకు గౌరవమే రాజ్యశోభ...
భాషను బంగారంగా దాచావని,
తేజోరూపంగా నిన్ను నిలుపుతుంది చరిత!
వాడకమే భాషాపరిమళం!భాషేజాతికి భవిత

వాక్యాలను వాడక మురగబెడితే,
గాలిలో గడ్డిపరకవే నువ్వు చరిత్రలో!
భాషని ఉన్నతికి చేర్చితే,
వెలుగురేఖవే నువ్వు ఈ ధరిత్రిలో

అన్నిరంగాల్లోనూ ఇప్పుడు
పరిమళమంతా తెలుగు పదాలదే!
తెలుగే తేలికైన తెలివి చూపు...
వాడుకభాషే దానికి చేయి చాపు!

ఎలా మాటాడుతున్నామో
అలా వ్రాయగలుగుతున్నాం ఇప్పుడు...
అచ్చు ఉపకరణాలన్నీ తెలుగు పరమే!
పాలనా భాషకు తెలుగు నిజంగా వరమే !!

చదువు లేనివాడికీ మాట అర్థమైతే,
భావానికీ మాటకూ స్నేహమైతే
పాలనలో తెలుగు భాగ్యమైతే
వైకుంఠపాళి పైవరుస' లో ప్రజాపాలన!

విజనంటారు నిజంగా...పాతికేళ్ల కోసం...
అందులో భాషా ఉండాలి... కళలూ ఉండాలి!
అభివృద్ధి జపంలో సంస్కృతి ఒక మంత్రం
భాషకు జయమైతే జాతికి అచ్చ స్వతంత్రం!

తెలుగులో పుట్టినందుకు –
జీవితకాలం శిక్ష... కవికీ, కళాకారుడికీ!
మంచి రచన చేసినా వెలుగు దొరకదు...
మంచి ప్రదర్శన ఇచ్చినా మెప్పు ఉండదు...

గ్రంథకర్తలకు బహుదూరం... గ్రంథాలయాలు!
పుష్కర కాలంగా మరిచాయవి...పుస్తకాల కొనుగోళ్లు...
పెన్షన్ డబ్బులు ఖాళీ... సొంతంగా అచ్చువేసుకుంటే!
రచయిత ఒక్కడే పాఠకుడు చివరికి పుస్తకానికి!

అక్షరాల వెంట మొదలైన మనిషి ప్రయాణం
నుడికట్టుల పల్లకిపైన భాషాసాగరానికి!
అక్షరాల వంపుల్లో సముద్రం మెరుస్తుంటే,
అర్థాల అలలపై తేలియాడతాడు మనిషి!

భాషాపరిపక్వత శక్తినిచ్చే రసగంగాధరం
పరిణామమే జీవతత్త్వం, నిలిచిపోతే నిశ్శబ్దం!
'కాలిని దువ్వ'లా వానకు వెరవని మనిషి...
ప్రతి అవసరానికీ చలించటమే తెలుగు ధర్మం!

మెదళ్ళలో ముళ్ళలా గుచ్చుకుంటుంది పరభాష
హృదయంలో జీవాంకురమై మొలుస్తుంది తల్లిభాష!
తెల్లటి నుడిమడిపైన తేనెల వానలు కురిపించి,
పలుకుల పల్లకీ ఎక్కి పరవశిస్తుంది వాడుకభాష!

ఇంకో భాష నేర్చుకోవద్దన్నదెవడు?
ఇంకో భావాన్ని హత్తుకోవద్దన్నదెవడు?
భాషలు సరిహద్దుల గోడలు కావు!
ప్రతి భాషా ఓ ఆహ్వానం... మనసు పొరల్లోకి!

ప్రతి అక్షరమూ – వెలుతురిచ్చే ఒక గవాక్షం...
ప్రతీ పదమూ – తెరచి ఉంచిన ఒక ద్వారం...
ప్రతి వాక్యమూ – భావాల రాకపోకల రహదారి...
ప్రతి సంభాషణ – మరోప్రపంచానికి ప్రవేశం!

ఒక మాట బుర్రలోకి తిన్నగా చొచ్చుకుపోతే –
హృదయం విడమరుస్తుంది... దాని అర్థాన్ని...
అనుభవాన్ని అద్దంగా, అనుభూతిని వర్ణంగా!
మనసు – మెదడుల మధ్య ప్రయాణం భాష!

ఏ భాషా మనకు శత్రువు కాదు,
ఏ యాసా అపహాస్యం కారాదు.
అమ్మభాషని ప్రేమించే హృదయం
అన్యభాషలనూ గౌరవిస్తుంది!

తల్లి పలుకునే మరిచినవాడికి
తన స్వరం కూడా పరాయిదే!
మనసు దాటి మాట దారితప్పితే,
మౌనం ముఖాన్ని దిగనాడుతుంది!

అమ్మభాషను ప్రేమించేవాడు
అన్యభాషలను అలరిస్తాడు...
అమ్మభాషను మరచినవాడు
అన్యభాషలకూ కొరగాడు!

ఏ యుగాన ఏ రూపాన వెలిసిందో
'ఆదిగానం'– ఛేదించని రహస్యం...
చిరకాల జ్ఞాననినాదం...
మన అమ్మభాష –మన అంతరాత్మ!

భాషలోంచి ఒక్కమాట జారితే,
మాటల భాండం ఒరిగిపోతుంది!
జ్ఞానహృదయంలో గూడుకట్టిన శూన్యం
నిశ్శబ్దపు దిక్కుల్ని తడుముకుంటుంది!

భాష... భవిష్యత్తు పలికే అనుభవగాథ!
మాట... గళాన్ని కదిలించే కలల స్వరం!
పలుకు... తరతరాల హృదయధ్వని!
పదబంధం... బుద్ధి మెరిసే తొలికిరణం!

అక్షరం... ఆత్మను తడిమే ఆరాధ్యధ్వని,
వాక్యం... అనుభూతి నిండిన ఆలయం!
శబ్దం... శ్వాసతో పుట్టే శాశ్వత నినాదం!
లిపి... కళ్లకెదురుగా నిలిచే కాలానుగ్రహం,

అనుభవం... భావాలపై పూసిన పుష్పసారం,
అనుభూతి... మనసు పంచే పరిమళపు గానం
భావం... అంతరాత్మ ఆలపించే రాగం!
కవిత్వం... హృదయాన్ని తాకే దివ్య శబ్దాల బాణం!

నన్నెచోడుని జానుతెనుగు మిన్నేరు
పాల్కురికి పద్యనైవేద్యం పొంగారు
పొన్నెగంటి తెలుగన్న అచ్చతెలుగు
పసిడి పలుకుల పెసర పైరు...!

ఆదిభట్ల నాటుతెనుగు
ఆత్రేయ తేటతెనుగు
తేనెలో 'భావన' చేసిన
తెలుగుతల్లి హృదయపు వెలుగు!

వాడుకలో మెరిసిందంతా తెలుగే!
మన నోట పలికినదంతా మనదే!
పదమైనా, పాటైనా, వాక్యమైనా, కావ్యమైనా
అర్థాల ఆకాశంలో అక్షరాల కాంతిరేఖలే!

మార్పుల మెరుపులు మెరిసే వేళ...
కొత్త కంఠాలు గొంతెత్తి సందడిస్తే...
స్వరమై రసమై భాష మురిసే వేళ...
మేల్కొల్పే ఆలోచనలు ఎగసెత్తే సమయాన...

వెన్నెల మాటలు మాయమై
మనసులో 'గూడువెలితి'కమ్ముకుని
గాలిలో పరుచుకున్న మౌనం
'అనర్గళగళం'గా మారిన సమయాన...

వ్యామోహపు ఉప్పెనల అలజడిలో
అక్షరపు దీపస్తంభం దీక్షగా దారిచూపింది...
సమభావ స్పర్శే కవితాదర్శమని
స్వరరేఖలు ఆశగా ఉదయించాయి!!

పరభావ నదుటగా నడిచే పటకు,
విపత్తుల నీడల వలయంలో జాతి...
పాశ్చాత్య మాయల పడమర వెటగు,
సొంటుశోధనలతో కాలం యాప్యంగా జరుగు!

అక్షరమే ఆయుధమై పలికినపుడే
నిశీధి నిండు వెన్నెలౌతుంది!
వాక్యమే మార్గం, కవితే ధర్మం –
ఇది నాదబ్రహ్మ నిశ్శబ్ద సంకల్పం!

మిణుగురు కాంతులే సాహిత్య దీపాట
వచనమే వెటగు, కవిత్వమే బలం!
అక్షరాల వానలో జనచైతన్యజ్యోతి!
తూరుపు గాలిలో ఊగే జాతీయ గానం

పాశ్చాత్య పంథాలో పారిపోయిన భవిష్యత్తు,
జనం నాటకలపై ఆడే తెటగు పదం ఎక్కడ?
భాషనిభక్తిగా, కళను శక్తిగా, శాస్త్రాన్ని ఆసక్తిగా
భాషతోనే బలిమి కూడే సమయమే యిక్కడ!

రసమయ గీతపు రారాజ్యాన నిలిచే
విస్మయ దీపిక వెటగు కావాలి!
కావ్య కాంతిరేఖలను కలపగల చేతలే
వాక్యాల వేదికపై నర్తించాలి!

సకలోదయ సూత్రాల సారం పాఠమై,
పునర్నిర్మాణపు పునాది పూర్ణకావ్యమై,
తెలుగు నేలపైన స్వరజల్లై కవిత్వం
సత్యగీతాల నదిలా పరవశించాలి!

పారంపర్యపు శిథిలాల బెదటు తొలగించి,
పరదా గోడలు కూలగొట్టి, 'గోరోజనం' వదిలించి
దేశీదారుల్లో స్వరజ్ఞాన జ్యోతిప్రకాశనం,
వాఙ్మయధారలో వెలిగే నూతన దీపశాసనం!

ఇరవై కోట్ల గొంతుకల భాషాధారుణి,
పదాల హారమై పలికే తెలుగు వాణి
పసిడి వెలుగుల పరిమళాల మణిరాణి
పరభాషలకూ పదాలిచ్చిన ఆంధ్రగీర్వాణి!

పదాల గనిని తవ్వితెచ్చిన పసిడిజ్ఞానం!
పలుకుల్లో పరిమళించిన ప్రజ్ఞామణికంఠం!
అక్షరాల విపంచి ఆలపించే రాగవాక్యాభరణం!
మాటల మబ్బుల వెనుక మెరిసే చంద్రబింబం!

పరాయి పూలపైన వాలిన గడుసు 'తీర్థకాకాలు'
తికమకల ముళ్లపొదల్లో చిక్కిన వేళ
తల్లిమాటల తేనెలో తడిసిన ఆలోచనలు
సౌరెక్కిన అక్షరాకృతుల అనుభూతి లోచనాలు

నేల తల్లి... నుడి తల్లి...
రెండింటిదీ పేగుబంధం!
విడదీయలేరెవరూ ఏనాడూ
అది భావజాలపు సత్యానందం!

మనిషినీ మనసునూ కలిపేది భాషాబంధమే!
అక్షరాలకు ఊపిరిచ్చే తత్త్వమే వాడుక భాష!
పల్లెజీవుల కన్నీళ్ళలో పండిన మాండలిక మకరందం
ప్రజల ఊపిరి నింపుకున్న వాడుకభాషానందం!

పరాయి భాషలో పలుకులు
మెదడు పొరల్లో తన్నుకొస్తాయి!
అమ్మభాషలో మాటలు
హృదయపు లోతుల్లో ఊరుకొస్తాయి!

గడపగడపలో పల్లవించిన ముద్దుల మాండలికరాగం
ఊరి ఊపిరిలో పుష్పించిన వాచస్పతుల వాక్యపరాగం
మాటలు, చేతలు జతకలిసిన అనుభవాల జీవన నేద్యం
తేట తెలుగును నిలిపిన పల్లెతీరపు భాషా సౌందర్యం!

ఊరెల్లా పలికే వెన్నెల భాషే ఊపిరి లోకానికి!
వాడుకభాషే వాస్తవ భాష – ప్రజల నోట మోగాలి!
సాహిత్య సింహాసనం పైన వెలిగే తేజస్సు – ప్రజల భాషే!
బంధాలు అనుబంధాల పలకరింపు – వాడుకభాష!

చదువుల భాష కాలేదు, బడిలో మన భాష
కార్యాలయాల్లో చేరలేదు, తెలుగక్కడ మూగనోము
సత్యాన్ని న్యాయమూర్తి తెలుగులో చెప్పడు తమాషా!
ఇంటింటా కనిపించకుండా పోయింది తెలుగు తేనెసీసా!

తెలుగులో రచనలు చేసిన పీవీ నృసింహుడు...
తెలుగు కోసం తపించిన మండలి కృష్ణుడు...
తెలుగే తానై నిలిచిన నందమూరి తారకరాముడు...
ముడిచేందుకు నాలుగో వేలుకు మనిషే లేడిప్పుడు!

భాషలలో మేటి ... తెలుగు వాడికి తెలుగే!
తెలుగే ఎందుకంటే తెలుగులో పుట్టావు కాబట్టి!
ఏ భాష మాట్లాడినా నువ్వు తెలుగు వాడివే!
తెలుగొక్కటే మనసుని వికసింప చేసేది సానపట్టి!!

ఇన్ని భాషలు మాట్లాడుతున్నా ఇంకా అర్థం కాలేదా ”
అమ్మభాషలోనే గ్రహింపు అధికం అని!
సహజ పరిమళం అమ్మదనానికే ఉంటుంది
మాతృభాషే మహనీయం మనిషికి!

నమ్మకంగా నడిపించిన తల్లిని
నాలాగా కాపాడే దెవరామెని!
ఒక్కమాటైనా బతికితే చాలను,
ఆమె ఉనికి నూరేళ్లూ నిలిచి తీరును!

**** ****

పరిపూర్ణజీవి డా॥ జి.వి. పూర్ణచందు
సాహితీ జీవన ప్రస్థానం

సాహితీ సింధు, సాహితీ దీప్తి, వైద్యశిరోమణి, వైద్యవిజ్ఞాన శౌరి, భాషాభిజ్ఞ, సభాసరస్వతి, తెలుగుపసిడి బిరుదాంకితులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న (హంస), బోయిభీమన్న పురస్కారాల గ్రహీత, స్వర్ణోత్సవ సాహితీ వేత్త, శతాధిక గ్రంథకర్త డా॥ జి.వి. పూర్ణచందు.

తెలుగు భాషోద్యమ ప్రముఖుడు, మినీకవితా ఉద్యమ సారధి, శతాధిక గ్రంథకర్త, కవి, కథానవలా రచయిత, వైజ్ఞానిక సాహితీవేత్త, తెలుగుభాష మూలాలను తవ్వి తీసిన పరిశోధకుడు, తెలుగు వారి ఆహార చరిత్రవేత్త, కాలమిస్టు, సంపాదకుడు, విమర్శకుడు, వ్యాఖ్యాత డా॥ జి.వి. పూర్ణచందు అంతకు మించిన సాహితీ కార్యకర్త కూడా!

రచయితగా 52 యేళ్ల సాహితీ ప్రస్థానంలో, గ్రంథరచయితగా 47 ఏళ్ళ కాలంలో మొత్తం 150కి పైగా పుస్తకాలు వెలువరించి సాహితీ స్వర్ణోత్సవం జరుపుకున్న సాహితీమూర్తి డా॥ జి.వి. పూర్ణచందు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం ఇంకా... యువభారతి, వంశీ ఇంటర్నేషనల్, ప్రపంచ తెలుగు సమాఖ్య, శ్రీకళాసుధ చెన్నై, సద్గురు శివానంద సనాతనధర్మ చారిటబుల్ ట్రస్టు రాష్ట్రేతర తెలుగు సమాఖ్య లాంటి ప్రసిద్ధ సంస్థల పురస్కారాలు, సత్కార గౌరవాలు 70కి పైగా అందుకొని, రచయితగా తాను అత్యంత సంతృప్త జీవినని ప్రకటించుకున్న సాహితీ పరిపూర్ణజీవి డా॥ జి.వి. పూర్ణచందు.

రాష్ట్రంలో ప్రసిద్ధిపొందిన ఆయుర్వేద వైద్యుడు, చిత్రకారుడు, తెలుగు భాష మూలాల్ని తవ్వి తీసిన పరిశోధకుడు, భాషోద్యమ ప్రముఖుడు, ఆరు పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు బాధ్యతలు వహించిన మహాకార్యదర్శి, భాషాసాహిత్య పరిరక్షణలో బహుముఖీనమైన పాత్ర నిర్వహిస్తూ, ఉభయ రాష్ట్రాల్లోనూ పరిచయం అవసరంలేని సాహితీవేత్తగా చిరపరిచితుడు.

మినీకవితా ఉద్యమసారథ్యం: 1979-80లలో ప్రారంభమైన మినీకవితా ఉద్యమంలో డా॥ రావిరంగారావుతో కలిసి, సారథ్యం వహించారు. ఊరూరా మినీకవితా ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఆ ప్రక్రియకు ఉద్యమరూపం సంతరింపచేశారు. కవిత్వానికి ప్రదర్శన అనే ఆలోచన పూర్ణచందుగారిదే!

తెలుగు భాషోద్యమ సారధి: 2003లో 'మాటల ముచ్చట్లు' పుస్తకం ద్వారా తెలుగు భాషోద్యమ ప్రవేశం చేశారు. 2004లో కృష్ణాజిల్లా రచయితల సంఘం పునర్వ్యవస్థీకరించి ఉద్యమ ప్రచారం చేశారు. సంఘం పక్షాన మచిలీపట్టణం నుండి నెల్లూరు వరకు 'రచయితల పాదయాత్ర' సహా వందలాది కార్యక్రమాలు, జాతీయ అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు. 6 పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించారు. అనేక ప్రాంతాల్లో భాషోద్యమ సదస్సులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘంతో కలిసి తెలుగు భాషకు క్లాసికహోదా రావటానికి అడ్డంకిగా ఉన్న మద్రాస్ హైకోర్టులోని కేసుని

కొట్టేయవలసిందిగా సుప్రీంకోర్టుకి వెళ్ళారు. 2004 నుండీ తెలుగే ప్రాచీనం లాంటి తెలుగు భాష ప్రాముఖ్యతను చాటే 50కి పైగా గ్రంథాలను వెలువరించారు. 30కి పైగా పరిశోధనా బృహద్గ్రంథాలకు సంపాదకత్వం / సహ సంపాదకత్వం వహించారు.

భాష, చరిత్ర, పరిశోధకుడిగా: పూర్ణచందుగారి పరిశోధనలు కొత్త దృష్టికోణాన్ని ఆవిష్కరించేవిగా ఉంటాయి. తెలుగు భాషా సంస్కృతుల మూలాలు వెలికితీసి "తెలుగే ప్రాచీనం" (ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం ప్రచురణ) "నైలు నుండి కృష్ణదాకా" (ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణ) గ్రంథాల ద్వారా భాషోద్యమ దీప్తి కలిగించారు. తెలుగులో అతిథిపదాలు, తెలుగు కోసం, మాతృభాష-మహాత్ముడి బాటలాంటి పరిశోధనా గ్రంథాలు భాషోద్యమ దీప్తిని కలిగించాయి. తెలుగు సంస్కృతి మూలాలను తరచి తరచి చూసిన విశ్లేషకుడు పూర్ణచందుగారు. మాటల ముచ్చట్లు, తెలుగు కోసం, తెలుగులో అతిథిపదాలు, మాతృభాష-మహాత్ముడి బాట, తాంబూలం: ఆరోగ్యం ఆనందం, మరో 100 విశేషాలు, సొంపైన తెలుగు (తెలుగు నుడుల సంచికట్టు) లాంటి గ్రంథాలు ఆయన పరిశోధన, పరిశీలనా శక్తులను చాటే గ్రంథాలు.

తెలుగువారి తొలి ఆహారచరిత్ర రూపకర్త: తెలుగు వారి ఆహార చరిత్రకు తొలి రూపకర్త పూర్ణచందుగారే! లండన్ నగరంలో జరిగిన తొలి ప్రపంచ తెలుగు చరిత్ర మహాసభల్లో తెలుగువారి ఆహారచరిత్రపైన పత్ర సమర్పణ చేశారు. అనేక విశ్వవిద్యాలయాల జాతీయ సదస్సులలో కీలక ప్రసంగం చేశారు. వివిధ "యూ ట్యూబు ఛానల్స్ ద్వారా మెడికల్ ఇంటర్వ్యూలు, ప్రసంగాలు లక్షల సంఖ్యలో తెలుగు వీక్షకుల సందర్శనాన్ని పొందాయి దేశవిదేశాల్లో వీరి వీడియోలకు అభిమాన సందోహం ఉంది. ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో మన ఆహారసంస్కృతి మూలాల్ని తవ్వి తీస్తూ "తినరా మైమరచి" శీర్షికన ఆయన వ్రాసే వ్యాసాలు విశేషప్రాచుర్యాన్ని పొందాయి.

తల్లి వైద్యం, వంటిల్లే వైద్యశాల, భోజన భోగం, అలనాటి ఆహారాలు, ఆరు రుచులతో ఆరోగ్యం, ఆయుర్వేదంలో పథ్యాలు – అపథ్యాలు, తరతరాల తెలుగు రుచులు, మన ఆహారం, ఆహారవేదం ఆహార సంహిత గ్రంథాలు ఆయనను ఆహార ఆరోగ్య పథికుడిగా నిలబెట్టాయి.

ఆయన శ్రీమతి గంగరాజు అరుణాదేవితో కలిసి నలుడు వ్రాసిన పాకదర్పణం, క్షేమశర్మ వ్రాసిన క్షేమకుతూహలం, రఘునాథశర్మ వ్రాసిన భోజన కుతూహలం గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

కవిగా, నవలాకారుడిగా: పూర్ణచందుగారు ఎంతటి కార్యకర్తో అంతటి కవి! 1990లలో వెలువడిన కాంతిస్వప్న వీరి కవితా పటిమకు తార్కాణంగా నిలిచింది. 7 భాషలలోకి అనువదించి రెండు సంపుటాలుగా వెలువడిన ముక్కాలు కవితా సంపుటాలు వీరి ప్రతిభకు గీటురాళ్లు. తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాలు, దాని చరిత్ర, దాని ప్రశస్తి, తెలుగులో మాండలికాల పరిరక్షణ, సైన్సు రచనలు, సాంకేయిక పారిభాషిక పదాలు, అధికార భాషగా తెలుగు అమలు లాంటి అంశాలను తొలిసారిగా కవిత్వీకరించి వ్రాసిన ఆంధ్రగీతి తెలుగు భాషాజాగృత కావ్యం

అజరామరమై నిలిచేదిగా రూపొందింది. సప్తసింధు, తెలుగుధీర, చిగురులు వేసిన కలలు నవలలు ఆయన కీర్తిని ఇనుమడింపచేశాయి. ఈ నవలలను అనేక యూట్యూబులవారు చదివి రికార్డు చేశారు. అవి బహుళ ప్రాచుర్యం పొందాయి.

30కి పైగా కాలమ్స్ వ్రాసిన అపురూప రచయిత: తెలుగులో అత్యధికంగా ఫీచర్లు / కాలమ్స్ నిర్వహించిన ఖ్యాతి పూర్ణచందు గారికే దక్కుతుంది ఒక దశలో ఒకేసారి 9 పత్రికలకు కాలమ్స్ వ్రాశారాయన. 1979 లోనే సౌజన్య వారపత్రికలో ప్రేమ-పెళ్లి శృంగారం అనే ఫీచర్, ఇదీ సంగతి అపేరుతో రాజకీయ వ్యాఖ్య కాలమ్ నిర్వహించారు. ఒక వంక వైద్య వృత్తి, మరొక వంక గ్రంథ రచనా వ్యాసంగం ఇంకో వైపు ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వంటి భారీ కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమై ఉంటూ వీక్లీ ఫీచర్లు వ్రాయటం, అవి కూడా పరిశోధనాత్మక రచనలు చేయటం విశేషం. ఆంధ్రప్రభ, అమ్మనుడి, విశాలాక్షి, Neo Science Hub, 'సంచిక' వెబ్ పత్రిక ఇంకా అనేక దినపత్రికల్లో, వారపత్రికల్లో, మాసపత్రికల్లో వ్రాస్తున్న వ్యాసాలు మన భాష పట్ల, మన చరిత్ర పట్ల పూర్ణచందు నిబద్ధతను చాటుతాయి, ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో "తినరా! మైమరచి" శీర్షిక ఆహార చరిత్రను చాటుతూ అత్యంత ప్రాచుర్యం పొందింది. ఆంధ్రజ్యోతి శనివారం నవ్య పేజీలో భోజన కుతూహలం ధారావాహిక తన శ్రీమతి గంగరాజు అరుణాదేవితో కలిసి వ్రాస్తున్నారు. విశాలాక్షి మాసపత్రికలొ సొగసైన తెలుగు, నియో సైన్స్ హబ్ ఆంగ్ల పత్రికలొ 'ది టేస్ట్ ఆఫ్ ట్రెడిషన్' శీర్షికలు జనాదరణ పొందాయి.

40 బృహద్గ్రంథాలకు సంపాదకుడుగా: తెలుగు పసిడి, వజ్రభారతి, కృష్ణాజిల్లా సర్వస్వం, దేశభాషలందు తెలుగు లెస్స, తెలుగు వ్యాసమండలి, తెలుగు మణిదీపాలు లాంటి బృహద్ పరిశోధనాగ్రంథాలకు సంపాదకుడుగా సహ సంపాదకుడిగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ పక్షాన అనేక గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. తెలుగు వ్యాసమండలి, దేశభాషలందు తెలుగు లెస్స లాంటి గ్రంథాలలో తెలుగు భాషకు సంబంధించి ప్రముఖరచయితల అపురూప వ్యాసాలను సేకరించటం ద్వారా భావి పరిశోధకులకు ఆకర గ్రంథాలుగా వెలువరించారు.

మహాకార్యదర్శిగా: కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధానకార్యదర్శిగా, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా అనితర సాధ్యమైన రీతిలో 6 పర్యాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు, ఒక పర్యాయం జాతీయ తెలుగు రచయితల మహాసభలతో పాటు ప్రధమ ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలు అలాగే, తెలుగే ప్రాచీనం ప్రధమ తెలుగు భాషా ప్రాచీనతా సదస్సు, సింధుకృష్ణలోయల నాగరికతల అధ్యయన సదస్సు, తెలుగులో న్యాయపాలన సదస్సు, సాంకేతిక తెలుగు జాతీయ సదస్సు లాంటి సదస్సుల నిర్వహణ ద్వారా భాష ఆధునీకరణకు కావలసిన ఆలోచనలు కలిగించారు. పాతికకు పైగా బృహద్గ్రంధాలను ప్రచురించారు.

లయన్స్ సేవాసంస్థలో 40 యేళ్లుగా: గత 40 యేళ్లుగా లయన్స్ అంతర్జాతీయ

సేవాసంస్థలో సభ్యుడిగా వివిధ పదవులను పురస్కారాలను పొందారు. లయనిజం కార్యక్రమాలలో తెలుగు పరివ్యాప్తికి పూర్ణచందు ప్రధాన కారకుడు. లయనిజం విధి విధానాల గురించి 8 పుస్తకాలు ప్రచురించారు. తన్నీరు కృష్ణమూర్తి విద్యాధరా లయన్స్ కంటి ఆసుపత్రి ఏర్పరచి, వ్యవస్థాపక చైర్మన్ గా వున్నారు. 2000–2001 సంవత్సరంలో క్యాబినెట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు.

నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా: సంయుక్త ఆంధ్రప్రదేశ్ లోని ఆయుర్వేద పట్టభద్ర వైద్యులందరినీ ఒక త్రాటిమీదకు తెచ్చి నేషనల్ మెడికల్ అసోసియేషన్ వ్యవస్థాపనలో ముఖ్య పాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. విజయవాడలోని డా॥ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల పరిరక్షణకు కృషి చేశారు.

పూర్వపు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యత్వం: పూర్వపు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీకి 1984లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్ర–నాగార్జున విశ్వవిద్యాలయాల సాహితీ సంస్థల నియోజకవర్గం నుండి తన 26వ యేట సభ్యునిగా ఎన్నికయ్యారు. యన్.టి. రామారావు గారి ప్రభుత్వం అన్ని అకాడెమీలను రద్దు చేసి వాటి స్థానే తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన సమయంలో ఉన్న జెనరల్ బాడీలో పూర్ణచందుగారు కూడా సభ్యులుగా ఉన్నారు. ఆ తరువాత అకాడెమీల పునర్నిర్మాణం కోసం పోరాడారాయన.

పదవ తరగతిలోనే మేఘమాల పత్రిక సంపాదకుడు: పూర్ణచందుగారికి చిన్ననాటి నుండే ప్రసిద్ధ రచయితల పరిచయ భాగ్యం కలిగింది. దుర్గానంద్, యమ్వీయల్ రామసూరి, చివుకుల సుబ్బావధాన్లు గారి లాంటి పెద్దలతో పరిచయ ప్రభావం ఆయన్ని సాహిత్యంలోకి ఆకర్షించింది. తోటి విద్యార్థులతో కలిసి తను సంపాదకుడిగా మేఘమాల అనే లిఖిత పత్రికని వెలువరించారు.

ఇంకా...

వివిధపత్రికల్లో 8,000 పైబడిన వ్యాసాలు వ్రాశారు కవితలు, కథలు, నవలలు, రేడియో నాటికలతోపాటు, విమర్శనా వ్యాసాలు, పరిశోధనా వ్యాసాలు, జీవిత చరిత్రలు కూడా వ్రాశారు. తెలుగు భాష, సంస్కృతుల ప్రాచీనతను నిరూపిస్తూ అనేక గ్రంథాలు వ్రాశారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఏర్పాటులోనూ, దానిలో తెలుగు శాఖ ప్రారంభించటంలోనూ విశేష కృషిచేశారు. తన స్వంత గ్రంథాలయం నుండి 1500 పుస్తకాల్ని అలాగే కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన 6 బీరువాల్ని తెలుగు శాఖకు అందించారు.

ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ పక్షాన కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో కృష్ణదేవరాయ మహోత్సవాల నిర్వహణలో ముఖ్యపాత్ర వహించారు. పద్యకవితా బ్రహ్మోత్సవాలు, తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు, జానపద సాహిత్య వైభవ సదస్సులకు సంచాలకుడిగా వ్యవహరించారు.

2008లో ఆచార్య శరజ్జ్యోత్స్నారాణి జ్యోత్స్నకళాపీఠం పురస్కారాన్ని పూర్ణచందుకి అందించిన సభలో సినారె ప్రసంగిస్తూ, "తెలుగు ప్రాచీనుడు మన పూర్ణచందు" అన్నారు బుద్ధప్రసాద్, లక్ష్మీప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, పూర్ణచందు ఈ నలుగురూ భాషోద్యమానికి నాలుగు స్తంభాలని సినారె అనేక సభలలో వ్యాఖ్యానించారు సినారె ప్రశంసే అన్నింటికన్నా

పెద్ద పురస్కారంగా భావిస్తారు పూర్ణచందు.

వారణాసిలో కుమారుని ఇంట కొన్ని రోజులున్నప్పుడు గంగరాజు ఇంటి పేరుగా కలిగిన పూర్ణచందుగారు తన ఇంట గంగమ్మ ఉందన్న స్పృహతో గంగమ్మ తల్లి (తెలుగు-గంగ పద అనుబంధాలు) అనే పుస్తకాన్ని వారణాసిలోనే వ్రాయగా వారణాసి విశ్వవిద్యాలయం తెలుగు శాఖవారు ఉగాది రోజున అతిథిగా ఆహ్వానించి ఆచార్య మాడభూషి శ్రీధర్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది.

పూర్ణచందుగారంటే మౌలికంగా పుస్తక రచయితే! గత పాతికేళ్ళ కాలంలో తెలుగు నాట సంభవించిన అనేక పరిణామాల పైన వ్యాసాలు కాదు పుస్తకాలే వ్రాసి వెలుగులోకి తెచ్చారు. కాలచక్ర తంత్రం, బుద్ధ దేవునికథ, జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నివేదిక ఏం చెప్పింది? ఎందుకు చెప్పింది? లాంటి పుస్తకాలు ఇలా సందర్భానుసారం వెలువడ్డవే! 2016లో అప్పటి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చట్ట సభలలో నైతిక విలువలు అనే అంశంపైన సదస్సులు నిర్వహించిన సందర్భంలో పూర్ణచందుగారు భారతీయ సభామర్యాదలు పుస్తకం వెలువరించారు. తెలుగు భాష ప్రాచీనతా హోదా పోరాటం ముమ్మరంగా సాగుతున్నప్పుడు తెలుగే ప్రాచీనం, నైలు నుండి కృష్ణ దాకా పుస్తకాలు తెచ్చారు. ద్రావిడ విశ్వవిద్యాలయం, అధికార భాషాసంఘం లాంటి సంస్థలు వీరి ఈ రచనలను ప్రచురించాయి.

వ్యక్తిగతం.

డా॥ జి.వి. పూర్ణచందు 23-04-1957న కృష్ణాజిల్లా కంకిపాడు గ్రామంలో మాతామహుల ఇంట జన్మించారు. ముత్తాతల కాలం నుండీ విజయవాడ వారి స్వస్థలం.

విజయవాడ శాతవాహన కళాశాలలో ఇంటర్మీడియట్, 1975-81 విజయవాడ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ఆయుర్వేద వైద్యం చదివారు. 1982 నుండి సుశ్రుత ఆయుర్వేద ఆసుపత్రి నడుపుతున్నారు.

భార్య గంగరాజు అరుణాదేవి. ఆమె కూడా రచయిత్రి, నలుడి 'పాకదర్పణం, క్షేమశర్మ క్షేమకుతూహలం, రఘునాథ సూరి 'భోజన కుతూహలం' గ్రంథాలకు వ్యాఖ్యానం వ్రాయటానికి పూర్ణచందుకు సహరచయిత్రిగా ఉన్నారు. భజనచేసే విధము తెలియండి గ్రంథాన్ని కూడా వెలువరించారు.

కుమార్తె లక్ష్మీ చేతన, అల్లుడు చక్కిలం శివరామ్ మల్లిక్ న్యూజెర్సీలో ఇద్దరూ సాఫ్ట్ వేర్ రంగంలో పనిచేస్తున్నారు. మనుమరాలు శ్రీ సాత్విక, మనుమడు సమన్యు, కుమారుడు డా॥ మనో కార్తీక్ చెన్నై ఐఐటిలో పిహెచ్‌డి, (గోల్డ్ మెడల్) దక్షిణ కొరియాలో పోస్ట్ డాక్టరేట్ చేశారు. వారణాసి ఐఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. కోడలు సౌమ్య, మనుమరాలు పూర్ణసంహిత.

పరిచయం: **దామెర్ల నరసింహారావు**

కోశపతి, కృష్ణాజిల్లా రచయితల సంఘం

ANDHRAGEETI

A Poetic Manifesto of Telugu Language Renaissance



Dr. G.V. PURNACHAND